www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 5-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 308 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా. 12.36 తదుపరి నవమి; నక్షత్రం: భరణి రా. 8.33 తదుపరి కృత్తిక; వర్జ్యం: ఉ. 6.55-8.26; దుర్ముహూర్తం: మ. 12.06-12.51; అమృతఘడియలు: సా. 4.00-5.31; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.49; సూర్యాస్తమయం: 6.08 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

'పౌల్ట్రీ'పై వైరస్ దాడి

ఖమ్మం జిల్లాలో లక్షకుపైగా కోళ్ల మృతి

అంతుపట్టని వైరస్‌తో ఫారాలు ఖాళీ

రూ.లక్షల్లో నష్టపోతున్న యజమానులు

పరీక్షల కోసం ల్యాబ్‌కు నమూనాలు 14

ఆంధ్రప్రదేశ్ నుంచి సోకుతున్న వైరస్?

ప.గోదావరి జిల్లాలో లక్షల కోళ్ల మృతి

అమెరికా నుంచి భారత్‌కు..

205 మంది అక్రమ వలసదారులు వెనక్కి!

యుద్ధ విమానం 'సీ-17 గ్లోబ్‌మాస్టర్'లో భారతీయులను తరలిస్తున్న అమెరికా ప్రభుత్వం

అమృతసర్‌లో నేడు దిగనున్న విమానం!.. నేర చరిత్ర ఉన్నవారిని అరెస్టు చేస్తాం: పంజాబ్ పోలీసులు

18 వేల మందిని వెనక్కి రప్పించేందుకు భారత్ ఓకే.. 7.5 లక్షల మందికి ఆ ముద్ర వేస్తారంటున్న కాంగ్రెస్

ట్రంప్ వాణిజ్య యుద్ధానికి జిన్‌పింగ్ సై!.. అమెరికా బొగ్గు, ఎల్‌ఎన్‌జీ ఉత్పత్తులపై 15% సుంకం



టెక్సాస్, ఫిబ్రవరి 4: అక్రమ వలసదారులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కఠిన చర్యలు ప్రారంభించింది. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ మొదలైంది. ఇందులో భాగంగా భారత్‌కు చెందిన అక్రమ వలసదారులను వెనక్కి పంపే ప్రక్రియను ప్రారంభించింది. అమెరికా సైన్యానికి చెందిన సీ-17 గ్లోబ్‌మాస్టర్ విమానం 205 మంది భారతీయులతో టెక్సాస్ నుంచి బయల్దేరినట్లు సమాచారం. ఈ విమానం పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో దిగనుంది. బుధవారం మధ్యాహ్నానికి అమృత్‌సర్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అవుతుందని భావిస్తున్నారు. ఈ క్రమంలో పంజాబ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. అమెరికా నుంచి వచ్చే వారిని నిర్బంధించాలన్న ఆదేశాలేవీ రాలేదని అధికారులు తెలిపారు. కానీ, అమెరికా నుంచి వచ్చే వారి పత్రాలన్నింటినీ తనిఖీ చేయనున్నట్లు చెప్పారు. అమెరికా నుంచి తిరిగి వస్తున్న వారిలో ఎవరిపైనైనా పంజాబ్‌లో క్రిమినల్ రికార్డులు ఉన్నాయా? అనే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. నేర చరిత్ర కలిగిన వారు ఎవరైనా వస్తే.. వెంటనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు. మరోవైపు భారత్‌కు వస్తున్న విమానంలో ఎవరున్నారు? ఎంత మంది ఉన్నారు? వంటి వివరాలను వెల్లడించడానికి అమెరికా అధికారులు నిరాకరించారు. తమ ప్రభుత్వం అక్రమ వలసదారులపై

మిగతా 2వ పేజీలో...

వర్గీకరణకు సై

మాదిగలకు 9%.. మాల, ఉప కులాలకు 5%.. ఇతరులకు 1%



ఎస్సీ వర్గీకరణపై సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న మంత్రి దామోదర, ఎస్సీ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు

క్రీమీలేయర్ సిఫారసును తిరస్కరించిన ప్రభుత్వం

సుప్రీంకోర్టు తీర్పు తర్వాత వర్గీకరణను అమలు చేసిన మొట్టమొదటి రాష్ట్రంగా నిలిచిన తెలంగాణ

మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం.. సుదీర్ఘ చర్చ

వారం పది రోజుల్లో గెజిట్ నోటిఫికేషన్‌కు కసరత్తు

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీలను 3 గ్రూపులుగా విభజిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. షెడ్యూల్డు కులాల్లో సంఖ్యాపరంగా అధికంగా ఉన్న మాదిగ, ఉప కులాలకు 9% రిజర్వేషన్లు ఖరారు చేసింది. మాల, ఉప కులాలకు 5%; అత్యంత వెనకబడిన బుడ్గ జంగం తదితర కులాలకు ఒక శాతం రిజర్వేషన్‌ను కేటాయించింది. ఈ మేరకు ఎస్సీ వర్గీకరణపై నియమించిన జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ నివేదికను తొలుత క్యాబినెట్‌లో, ఆ తర్వాత అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించింది. తద్వారా, సుప్రీం తీర్పు అనంతరం ఎస్సీలను వర్గీకరించి, రిజర్వేషన్లను

మిగతా 13వ పేజీలో...

సుప్రీం తీర్పిచ్చిన గంటన్నరలోనే సీఎం స్పందించారు: దామోదర



రాష్ట్రంలో ఎస్సీల్లోని 59 ఉపకులాలను మూడు గ్రూపులుగా విభజించి రిజర్వేషన్లను వర్గీకరించాలని జస్టిస్ అక్తర్ కమిషన్ నివేదిక సమర్పించింది. వర్గీకరణపై తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుంది. ఏకసభ్య కమిషన్ ఎస్సీల్లోని 59 ఉపకులాలను 3 గ్రూపులుగా విభజించి 1:9:5 నిష్పత్తిలో రిజర్వేషన్లను అమలు చేయాలని సిఫారసు చేసింది. సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న ఎస్సీ వర్గాలందరికీ మేలు జరుగుతుంది.

- శాసన మండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



బీఆర్ఎస్ పార్టీ కులగణనపై అవాస్తవాలు మాట్లాడి.. వాకౌట్ అంటే ఎలా? బీఆర్ఎస్ పాలనలో బీసీలకు చేసిందేమీ లేదు. వారు చేసిన సమగ్ర సర్వేలో ఓసీ జనాభా 21.55 శాతమని చెప్పారు. తాజా కులగణనలో 15.79 శాతంగా తేలింది. బీఆర్ఎస్ వాళ్లు సభలో అబద్ధాలు మాట్లాడుతున్నారు. రాజకీయ రిజర్వేషన్లే కాకుండా ఉపాధి, ఉద్యోగాల్లో బీసీలకు న్యాయం చేయడానికే మా ప్రభుత్వం ఈ సర్వే చేపట్టింది.

- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



బీసీలకు 42% సీట్లు

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఇస్తాం

చట్టపరంగా అవకాశం లేకపోయినా మేము సిద్ధం

బీఆర్ఎస్, బీజేపీ 42 శాతం ఇచ్చేందుకు సిద్ధమా?

బీఆర్ఎస్ సర్వే ప్రకారం రాష్ట్రంలో బీసీలు 51 శాతమే

మా సర్వే ప్రకారం 56.33 శాతం ఉన్నారు

వారి సర్వేలో ఓసీలు 21%, మా సర్వేలో 15.79%

కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు వివరాలు ఇవ్వలేదు

సర్వేలో పాల్గొనని సభ్యులకు మాట్లాడే అర్హత లేదు

మేము చేసిన సర్వేనే అధికారిక డాక్యుమెంట్

ఒక్క కుటుంబం కోసమే నాటి 'సమగ్ర కుటుంబ సర్వే'

అది ఒక ఫాల్తూ రిపోర్ట్.. అందులో చెప్పినన్ని

ఎస్సీ కులాలుంటే సీఎం పదవికి రాజీనామా చేస్తా

శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన

కులగణనను ఏకగ్రీవంగా ఆమోదించిన సభ

ఎస్సీ వర్గీకరణ అమల్లో దేశంలో మేమే ముందు

సుప్రీంకోర్టు తీర్పునాడే మాటిచ్చాం.. నిలబెట్టుకున్నాం

రాజకీయ జీవితంలో ఆత్మసంతృప్తినిచ్చిన రోజు ఇది

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కాంగ్రెస్ పార్టీ తరఫున 42 శాతం సీట్లు ఇస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శాసనసభ వేదికగా ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే రాజ్యాంగ సవరణ జరగాల్సి ఉందన్నారు. ఒకవేళ చట్టపరంగా అంత శాతం రిజర్వేషన్లు కల్పించలేని పరిస్థితి ఏర్పడితే.. తమ పార్టీ మాత్రం 42 శాతం సీట్లు ఇస్తుందని స్పష్టం చేశారు. తమ పార్టీలాగే బీఆర్ఎస్, బీజేపీ కూడా బీసీలకు 42 శాతం సీట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయా? అని సవాల్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే ఇదే శాసనసభ నుంచి ఆ రెండు పార్టీలు బీసీలకు

మిగతా 12వ పేజీలో...

బీసీలు 46.25 శాతం

ముస్లింలలో బీసీలు 10.08%.. వారిని కలుపుకొంటే మొత్తం బీసీలు 56.33%

ఎస్సీలు 17.43%, ఎస్టీలు 10.45%

ఓసీలు 13.31%.. ముస్లిం ఓసీలు 2.48%.. మొత్తం 15.79% 12

శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీ తీర్మానం



ఎన్నికల సామగ్రితో పోలింగ్ అధికారులు

నేడే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

క్లైమాక్స్‌కు చేరిన హస్తిన రాజకీయ పోరు

గెలుపుపై కమలం ఆశాభావం 2

అనూహ్యంగా పుంజుకున్న కాంగ్రెస్

అధికారం నిలుపుకోడానికి ఆప్ అష్టకష్టాలు

ఈవీఎంలలో తీర్పు నిక్షిప్తం చేయనున్న ఓటర్లు

బీసీల జనాభా తగ్గినట్లు చూపిస్తున్నారు

గత సమగ్ర కుటుంబ సర్వేలో కంటే కులగణనలో బీసీలు ఎలా తగ్గారు?

తప్పులతడక సర్వేతో కుట్ర చేస్తున్నారు

పార్టీపరంగా రిజర్వేషన్లు ఇస్తామంటున్న కాంగ్రెస్ నిబద్ధత ఏంటో అందరికీ తెలుసు

ఓడిపోయే సీట్లు బీసీలకు కేటాయించింది

బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వేలో బీసీల జనాభా తగ్గినట్లు చూపిస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. నిజానికి బీసీల్లో కుటుంబ నియంత్రణపై తక్కువ అవగాహన ఉంటుందని, అయినా జనాభా ఎలా తగ్గిందని, అంటే.. బీసీలు కాపురాలు చేయడం లేదా అని

మిగతా 12వ పేజీలో...

నాటి మా సర్వే అధికారికమే

సర్వేను బహిష్కరించాలని అప్పట్లో రేవంత్ రెడ్డి చెప్పలేదా?

ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ అనుకూలం

అసెంబ్లీలో మాజీమంత్రి కేటీఆర్

అభయహస్తం అమలు ఎప్పటి నుంచో చెప్పాలని డిమాండ్

నిమిషంలోనే సభ వాయిదా వేయడంపైబీఆర్ఎస్ నేతల ఖండన

రేవంత్‌రెడ్డిని తెలంగాణలో తిరగనీయం

ఎమ్మెల్యే వివేకానంద గౌడ్

42% రిజర్వేషన్ల తర్వాతే 'స్థానిక' ఎన్నికలకు వెళ్లాలి: తలసాని

శాసనమండలిలో బీఆర్ఎస్ వాకౌట్



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తాము అధికారంలో ఉన్నప్పుడు నిర్వహించిన 'సమగ్ర కుటుంబ సర్వే' అధికారికమేనని మాజీ మంత్రి కేటీ రామారావు స్పష్టం చేశారు. ఆ సర్వేలో 1.03 కోట్ల కుటుంబాలకు చెందిన 3.68 కోట్ల పౌరుల వివరాలను ఒక్కరోజులోనే సేకరించామని గుర్తుచేశారు. మంగళవారం అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి 'సమగ్ర కుటుంబ సర్వే' నివేదికను అధికారికంగా ప్రజల ముందు ఎందుకు పెట్టలేదని అడిగిన ప్రశ్నకు.. కేటీఆర్ స్పందించారు. గత సర్వే నివేదిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని వివరించారు. రేవంత్ సర్కారు చేపట్టిన కులగణనను అనేకమంది బహిష్కరించారని, నివేదిక తప్పుల తడక అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీనే

మిగతా 12వ పేజీలో...



అదరగొట్టిన ఒంగోలు జాతి ఆవు

బ్రెజిల్‌లో జరిగిన వేలంలో 2

రూ.41 కోట్ల ధర పలికిన వియాటినా

ఒంగోలు జాతి ఆవు కంటే రెట్టింపు సైజు

బరువు 1,101 కిలోలు

అత్యంత ఖరీదైన గోవుగా ప్రపంచ రికార్డు

గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు 14

సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో కదలిక

బీఆర్ఎస్ ఫిర్యాదుపై లిఖితపూర్వకంగా స్పందించాలని కోరిన స్పీకర్ కార్యాలయం

4 నెలల గడువు కోరిన పలువురు ఎమ్మెల్యేలు

స్వీడన్‌లో.. వయోజన విద్యా కేంద్రంలో కాల్పులు

10 మంది మృతి.. 15 మందికి గాయాలు

గుర్తు తెలియని వ్యక్తి దారుణం 2

దేశంలోని గ్యాంగ్ వార్‌లలో భాగంగానే..

రాజ్‌తరుణ్-లావణ్య కేసులో

తెరపైకి ఆర్జే శేఖర్ బాషా!

ఆమెను డ్రగ్స్ కేసులో ఇరికించేందుకు మస్తాన్ సాయితో కలిసి పథకం

లావణ్య ఇంట్లో పార్టీ ఏర్పాటు చేసి గుట్టుగా 150 గ్రాముల డ్రగ్స్ పెట్టేందుకు ప్లాన్

మస్తాన్-శేఖర్ మాట్లాడుకున్నట్లుగా చెబుతున్న ఆడియోను పోలీసులకు అందజేసిన లావణ్య

శేఖర్ బాషాని కూడా అదుపులోకి తీసుకునే చాన్స్.. బయటపడుతున్న మస్తాన్ ఘోరాలు

300 మంది యువతుల వీడియోలు!.. మస్తాన్‌ను వారం కస్టడీకి అనుమతించాలని పిటిషన్

హైదరాబాద్ సిటీ, గుంటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తనతో సహజీవనం చేసి.. పెళ్లి కూడా చేసుకున్న సినీ నటుడు రాజ్‌తరుణ్ తనను వదిలేయడానికి డ్రగ్స్ పెడ్లర్ రావి మస్తాన్ సాయి 'అరాచకమే' కారణం అని మొదట్నుంచీ గగ్గోలు పెడుతున్న లావణ్య, ఇందుకు సంబంధించిన ఆధారంగా ఓ 'కీలక ఆడియో'ను బయటపెట్టింది. రాజ్‌తరుణ్‌కు పరిచయస్తుడు, బిగ్‌బాస్ ఫేం అయిన ఆర్జే శేఖర్ బాషా సహకారంతో

మిగతా 10వ పేజీలో...



రాహుల్ అర్బన్ నక్సల్!

దేశంపై యుద్ధాన్ని ప్రకటించారు

గుడిసెల్లో పేదలతో ఫొటోలు దిగే వాళ్లకు ఆ పేదల బాధలు అర్థం కావు

50 ఏళ్లలో 'గరీబీ హఠావో' కాలేదు

మేం పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చాం: మోదీ

'అద్దాల మేడ' కోసం ఎన్నికల్లో అసాధ్య హామీలు ఇస్తున్నారంటూ కేజ్రీవాల్‌పై విమర్శ

చైనా దురాక్రమణపై రాహుల్‌వి తప్పుడు ఆరోపణలు.. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

రాహుల్‌పై సభాహక్కుల నోటీసు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌పై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం ఆయన లోక్‌సభలో మాట్లాడుతూ.. రాహుల్, కేజ్రీవాల్‌పై వారి పేర్లను వినియోగించకుండా.. పరోక్షంగా మండిపడ్డారు. ఢిల్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా

మిగతా 2వ పేజీలో...

అమెరికా నుంచి భారత్‌కు..

(మొదటి పేజీ తరువాయి)

కఠిన చర్యలు తీసుకుంటుందని మాత్రం స్పష్టం చేశారు. అక్రమంగా అమెరికాలో ఉంటున్న వారందరినీ బహిష్కరిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు అమెరికాలో 18 వేల మందికి పైగా భారత అక్రమ వలసదారులు ఉన్నట్లు ఇరుదేశాలు గుర్తించాయి. వారందరినీ అమెరికా నుంచి బహిష్కరించేందుకు ట్రంప్ సర్కారు సిద్ధమవుతోంది. అక్రమ వలసదారులను భారత్‌కు తిప్పి పంపిస్తామని చెప్పగా.. ప్రధాని మోదీ అంగీకరించినట్లు ట్రంప్ ఇటీవల వెల్లడించారు. కాగా, అక్రమ వలసదారులపై అమెరికా అనుసరిస్తున్న విధానాలపై ఇప్పటికే భారత్ విదేశాంగ శాఖ తన స్పందనను తెలిపింది. అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని, ఈ అంశం అనేక రకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని పేర్కొంది. వీసా గడువు ముగిసి లేదా సరైన దస్త్రాలు లేకుండా భారతీయులు అమెరికా సహా ఏ దేశంలో ఉన్నా తిరిగి తీసుకొచ్చేందుకు వీలు కల్పిస్తామని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు వెళ్తున్న తరుణంలో అక్రమంగా వలస వెళ్లిన భారతీయుల తొలివిడత తరలింపు జరగడం గమనార్హం. అక్రమ వలసదారులను తరలించేందుకు అమెరికా వినియోగిస్తున్న సీ-17 సైనిక విమానాలు చాలా ఖరీదైనవి. అమెరికాకు చెందిన బోయింగ్ సంస్థ తయారు చేసిన 223 సీ-17 గ్లోబ్‌మాస్టర్ విమానాలను ఆ దేశ సైన్యం వినియోగిస్తోంది. వీటి విలువ దాదాపు రూ.6.6 లక్షల కోట్లు. ఈ మొత్తం టాంజానియా, శ్రీలంక, ఘనా, బెలారస్, ఉరుగ్వే, క్రొయేషియా వంటి దేశాల జీడీపీ కంటే ఎక్కువ కావడం విశేషం. ఇక ప్రపంచవ్యాప్తంగా 275 సీ-17 విమానాలు వినియోగంలో ఉండగా.. వాటిలో 223 విమానాలు అమెరికా ఆర్మీ వద్దే ఉండడం గమనార్హం. ఆస్ట్రేలియా, కెనడా, భారత్, కువైత్, ఖతార్, యూఏఈ, యూకే కూడా ఈ విమానాలను వినియోగిస్తున్నాయి. కాగా, గతంలో ఉక్రెయిన్‌లో చిక్కుకున్న భారతీయులను వెనక్కి రప్పించడానికి భారత్ కూడా తన సీ-17 విమానాన్ని రొమేనియాకు పంపింది.

7.25 లక్షల మంది తిరుగుటపా: రాజీవ్ శుక్లా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నేత రాజీవ్ శుక్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. అక్రమ వలసదారులుగా ముద్ర వేసి 7.25 లక్షల మంది భారతీయులను వెనక్కి పంపేందుకు అమెరికా సిద్ధమవుతోందని ఆరోపించారు. విదేశీ వ్యవహారాలపై ఏర్పాటు చేసిన పార్లమెంటు స్థాయీ సంఘం సమావేశంలో తనకీ విషయం చెప్పారన్నారు. ఎన్నో ఏళ్లుగా అమెరికాలో ఉంటున్న వారంతా హఠాత్తుగా భారత్‌కు వచ్చి ఏం చేస్తారో తనకు అర్థం కావడం లేదని మంగళవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "విదేశాంగ శాఖ పార్లమెంటు స్థాయీ సంఘం సమావేశానికి హాజరయ్యా. అమెరికా 7.25 లక్షల మంది భారతీయులను అక్రమ వలసదారులుగా పేర్కొంటూ వెనక్కి పంపేయడానికి సిద్ధమైందని తెలుసుకున్నా" అని పేర్కొన్నారు.

స్వీడన్‌లో ఓ స్కూల్‌లో కాల్పులు..10 మంది మృతి

స్టాక్‌హోమ్, ఫిబ్రవరి 4: స్వీడన్‌లోని ఓ పాఠశాలలో (వయోజన విద్యా కేంద్రం)లో మంగళవారం మధ్యాహ్నం కాల్పుల కలకలం రేగింది. గుర్తు తెలియని ఓ వ్యక్తి(35) పాఠశాలలోకి ప్రవేశించి జరిపిన కాల్పుల్లో 10 మంది మరణించారు. కాల్పులు జరిపిన వ్యక్తి కూడా మరణించాడని, 15 మంది గాయపడ్డారని పోలీసులు వెల్లడించారు. స్టాక్‌హోమ్‌కు సుమారు 200 కిమీల దూరంలోని ఒరెబ్రో నగర శివారులోని పాఠశాలలో ఈ ఘటన జరిగింది. ప్రాథమిక, ఉన్నత విద్య పూర్తి చేయని 20 ఏళ్ల వయస్సు పైబడిన వారు ఈ పాఠశాలలో చదువుతుంటారు. ప్రధాన పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన పరీక్ష అనంతరం పాఠశాలలో ఆటోమేటిక్ గన్‌తో ఆగంతకుడు కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. కాల్పుల ఘటనలో ఉగ్రవాద కోణం లేదని, కొంతకాలంగా దేశంలో జరుగుతున్న గ్యాంగ్‌వార్‌ల్లో భాగంగా జరిగిన ఘటనని ప్రభుత్వం భావిస్తోంది.

న్యాక్ కేసులో జేఎన్‌యూ ప్రొఫెసర్ సస్పెండ్

» గుర్తింపు ఇచ్చేందుకు 'కేఎల్' నుంచి 1.8 కోట్లు డిమాండ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఉన్నత విద్యాసంస్థలకు ఇచ్చే 'నేషనల్ అసెస్‌మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) గుర్తింపును అడ్డుపెట్టుకుని లంచాలు డిమాండ్ చేసిన కేసులో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ) ప్రొఫెసర్ రాజీవ్ సిజారియా విధుల నుంచి సస్పెండ్ అయ్యారు. గుంటూరులో ఉన్న కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ విద్యాసంస్థకు అనుకూలంగా 'ఏ++' నివేదిక ఇచ్చేందుకు న్యాక్ పరిశీలన బృందం.. ఏకంగా రూ.1.8 కోట్లను లంచంగా డిమాండ్ చేసినట్టు సీబీఐ అధికారులు తెలిపారు. అయితే.. పలు చర్చల తర్వాత రూ.28 లక్షలకు సెటిల్ అయిందని పేర్కొన్నారు. దీనిలో పరిశీలన బృందం ఛైర్మన్ రూ.10 లక్షలు, సభ్యులు ఒక్కొక్కరూ రూ.3 లక్షల చొప్పున తీసుకునేందుకు ఒప్పందం చేసుకున్నారు. అదేవిధంగా ల్యాప్‌టాప్‌లు, బంగారం, సహా పరిశీలన బృందంలోని ఓ సభ్యుడి సతీమణి విదేశీ ప్రయాణానికి అయ్యే ఖర్చును కూడా లంచం కింద డిమాండ్ చేశారని తెలిపారు. ఈ వ్యవహారంపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దీనిలో ఒక్క రాజీవే.. రూ.1.3 కోట్లు డిమాండ్ చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.

వక్ఫ్ బిల్లుతో సామాజిక అస్థిరత: అసదుద్దీన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: "వక్ఫ్ సవరణ బిల్లును డ్రాఫ్ట్‌లో ఉన్నట్లే చట్టంగా తీసుకువస్తే.. దేశంలో సామాజిక అస్థిరత రాజ్యమేలుతుంది. ఏ ముస్లిం కూడా ఈ బిల్లును ఆమోదించడం లేదు" అని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించారు. సోమవారం ఈ మేరకు లోక్‌సభలో ప్రకటన చేశారు. "ఈ బిల్లు ఆమోదం పొందితే.. వక్ఫ్ ఆస్తులుండవు. ఏదీ మిగలదు" అని అన్నారు. ఒక గర్వించదగ్గ భారతీయ ముస్లింగా తాను ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నానన్నారు. "ఒక మసీదుకు చెందిన.. లేదా ఒక దర్గాకు చెందిన ఒక్క అంగుళం స్థలాన్ని కూడా వదులుకునేందుకు ముస్లింలు సిద్ధంగా లేరు. భారతీయుడిగా నేను గర్విస్తా. ఇది నా దేశం. ఎవరో ఇచ్చింది కాదు. ఎవరూ లాక్కోలేరు కూడా. వక్ఫ్ అంటేనే నా దృష్టిలో ఓ ప్రార్థన స్థలం" అని వివరించారు. విపక్ష ఎంపీలు కల్యాణ్ బెనర్జీ, మహమ్మద్ నదీముల్ హక్ కూడా వక్ఫ్ బిల్లును వ్యతిరేకించారు. అసదుద్దీన్ వ్యాఖ్యలను వక్ఫ్‌పై ఏర్పాటు చేసిన జేపీసీ ఛైర్మన్ జగదంబికా పాల్ తీవ్రంగా ఖండించారు. జేపీసీలో అసదుద్దీన్ కూడా ఉన్నారని, ఆయన సమక్షంలోనే ఓటింగ్ జరిగిందని గుర్తుచేశారు.

గుజరాత్‌లో యూసీసీపై కమిటీ ఏర్పాటు

గాంధీనగర్, ఫిబ్రవరి 4: గుజరాత్‌లోనీ బీజేపీ ప్రభుత్వం కూడా ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో యూసీసీ అమలు ఆవశ్యకతను అంచనా వేసేందుకు, ముసాయిదా బిల్లు రూపొందించేందుకు మంగళవారం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ రంజనాదేశాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల కమిటీ 45 రోజుల్లో నివేదిక ఇస్తుందని, అనంతరం యూసీసీ అమలుపై నిర్ణయం తీసుకుంటామని సీఎం భూపేంద్ర తెలిపారు.

సంగమంలో భూటాన్ రాజు పుణ్యస్నానం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు మహా కుంభమేళాకు విచ్చేసిన భూటాన్ రాజు.. జిగ్మే ఖేసర్ నాంగ్యల్ వాంగ్‌చుక్.. త్రివేణి సంగమంలో మంగళవారం పుణ్యస్నానం ఆచరించారు. భూటాన్ రాజు వెంట ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా ఉన్నారు. మరోవైపు, ప్రధాన మంత్రి మోదీ బుధవారం మహా కుంభమేళాలో పాల్గొననున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించనున్నారు.

రాజ్‌ఘాట్‌లో మన్మోహన్‌కు స్మారకం నిర్మాణం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 : రాజ్‌ఘాట్‌లో దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ స్మారకం ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించనున్నట్లు ఆయన కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది. గత డిసెంబరులో మరణించిన ఆయనకు మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ స్మారకం పక్కనే స్థలం కేటాయించనున్నట్లు సమాచారం. స్మారకం నిర్మాణానికి ట్రస్ట్ ఏర్పాటు చేయగానే కేంద్ర ప్రభుత్వం స్థలం కేటాయించనుంది.

రాహుల్ అర్బన్ నక్సల్!

(మొదటి పేజీ తరువాయి)



తాము బీజేపీ, ఆరెస్సెస్‌తోపాటు.. భారత రాజ్యంపై యుద్ధం చేస్తున్నామని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.! దీన్ని మోదీ పరోక్షంగా ప్రస్తావించారు. "కొందరు వ్యక్తులు యుద్ధాన్ని ప్రకటిస్తున్నామని బహిరంగంగా చెబుతున్నారు. అర్బన్ నక్సలైట్లలా మాట్లాడుతున్నారు. చేతిలో రాజ్యాంగాన్ని పెట్టుకుని తిరుగుతారు. అయితే.. వారికి రాజ్యాంగం అర్థంకాదు. దేశ సమైక్యత గురించి తెలియదు" అంటూ దుయ్యబట్టారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని 'బోర్' అని రాహుల్ అనడంపైనా ప్రధాని స్పందించారు. గుడిసెల్లో ఫొటో సెషన్లకు ఫోజులిచ్చేవారికి పేదల బాధలు అర్థంకావన్నారు. అందుకే పార్లమెంట్‌లో పేదల గురించి మాట్లాడితే.. సోనియా, రాహుల్‌కు 'బోర్'కొడుతుందని ఎద్దేవా చేశారు. అటు ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌ను కూడా మోదీ మాటలతో దునుమాడారు. "ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించే కొన్ని పార్టీలతో యువతకు 'ఆప్'ద పొంచి ఉంది. వారు అద్దాల మేడ నిర్మాణానికి అవినీతికి పాల్పడతారు" అంటూ ధ్వజమెత్తారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ పాలనపైనా దుమ్మెత్తిపోశారు. 'గరీబీ హఠావో' అనే నినాదాన్ని 50 ఏళ్ల కొనసాగించినా సాధించలేనిది తమ ప్రభుత్వం చేసి, చూపించిందని.. గడిచిన పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చామని వివరించారు. 4 కోట్ల మంది పేదలకు సొంత ఇళ్లను ఇచ్చామని, 12 కోట్ల మంది పేదలకు మరుగుదొడ్లను కట్టించామని, వారి బాధలను అర్థం చేసుకున్నాం కాబట్టే ఇదంతా చేశామని వ్యాఖ్యానించారు. రాజీవ్‌గాంధీ 21వ శతాబ్ది పేరుతో గాలిమేడలు(హవాహవాయీ) నిర్మించారే తప్ప.. పరిస్థితులు మాత్రం 20వ శతాబ్దంలోనే ఉండేవన్నారు. పేదల అభ్యున్నతిపైనా దృష్టి సారించలేదన్నారు. "అప్పట్లో కేంద్రం నుంచి గ్రామ సచివాలయం వరకు ఒకే పార్టీ పాలన ఉండేది. అయినా.. కేంద్రం ఇచ్చే రూ.1 పేదలకు అందేసరికి 15 పైసలుగా మారేది. మేం నగదు బదిలీని తీసుకొచ్చాం. కేంద్రం ఇచ్చే ప్రతి రూపాయిని లబ్ధిదారులకు చేరేలా చేశాం" అని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్‌తో పేదలందరికీ ఆరోగ్యభాగ్యాన్ని కలిగించామని, కొన్ని రాష్ట్రాలు మాత్రం ఈ పథకాన్ని వినియోగించుకోవడంలేదని విమర్శించారు. పదికోట్ల నకిలీ ఖాతాలను స్తంభింపజేశామని, ఇథనాల్ బ్లెండింగ్ ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదాచేశామన్నారు. "గతంలో తరచూ రూ.లక్షల కోట్ల అవినీతిపై వార్తలు వచ్చేవి. గడిచిన పదేళ్లలో మా సర్కారు హయాంలో ఎలాంటి అవినీతి ఆరోపణల్లేవు. కేంద్రంలో పదేళ్లుగా అవినీతి లేకపోవడంతో ప్రజలు లబ్ధిపొందారు" అని మోదీ వ్యాఖ్యానించారు.

రాహుల్‌పై సభా హక్కుల నోటీసు

రాహుల్ గాంధీ లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే సభాహక్కుల నోటీసు ఇచ్చారు. మంగళవారం ఆయన ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఓ లేఖను అందజేసి.. రాహుల్ గాంధీపై సభాహక్కుల తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. చైనా తమ భూభాగంలోకి చొరబడిందంటూ రాహుల్ తన వ్యాఖ్యలతో భారత్ గౌరవానికి భంగం కలిగించారన్నారు. నిస్సిగ్గుగా చారిత్రక అంశాలను తప్పుదోవ పట్టించారని విమర్శించారు.

రాహుల్‌పై రాజ్‌నాథ్ ఫైర్

భారత భూభాగంలోకి చైనా చొచ్చుకొచ్చిందని, ఆర్మీ చీఫ్ స్వయంగా ఈ విషయం చెప్పాడంటూ లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ చేసిన ప్రసంగంపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మండిపడ్డారు. ఆర్మీ చీఫ్ గానీ, సైన్యాధికారులు గానీ ఆ మాట అనలేదని ఎక్స్‌లో పేర్కొన్నారు. రాహుల్ గాంధీ తప్పుడు ఆరోపణలు చేశారని విమర్శించారు. జాతీయ ప్రయోజనాలకు సంబంధించి ఆయన బాధ్యతారహితంగా మాట్లాడడం, రాజకీయాలకు పాల్పడడం విచారకరమన్నారు. రాహుల్‌గాంధీ చరిత్రపై అవగాహన పెంచుకోవాలని హితవుపలికారు.

లోకం తీరు



ఆయన.. అమిత్ షా గూండా!

» ఢిల్లీ పోలీసుపై కేజ్రీవాల్ తీవ్ర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ఢిల్లీ పోలీసు అధికారిపై ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పోలీసు అధికారిని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా గుండాగా అభివర్ణించారు. "అమిత్‌షా గూండా ఒకరు పోలీసు దుస్తులు ధరించారు. బహిరంగంగానే ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అమిత్‌షా గారూ.. ఈ దేశం మీ గూండాయిజాన్ని ఏమాత్రం సహించదు" అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. సంబంధిత వీడియోను ఆప్ మీడియా చీఫ్ కోఆర్డినేటర్ వికాస్ యోగి సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. "నాతో పెట్టుకుంటే నువ్వు నన్నేమీ చేయలేవు. కానీ, నేను తలుచుకుంటే నువ్వు ఇబ్బందుల్లో పడతావు" అంటూ బవానా నియోజకవర్గం ఆప్ అభ్యర్థిని ఓ పోలీసు ఇన్‌స్పెక్టర్.. బహిరంగంగా బెదిరించిన వీడియోను కూడా పోస్టు చేశారు. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ స్పందిస్తూ.. "ఇది అమిత్‌షా గూండాగిరికి నిదర్శనం" అని అన్నారు. 'అమిత్‌షా గూండాగిరి' హ్యాష్ ట్యాగ్‌తో సోషల్ మీడియాలో ఆయన క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు.

సీఎం అతిశీపై ఎఫ్ఐఆర్

సీఎం అతిశీపై ఢిల్లీలోని గోవిందపురి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఎన్నికల నిబంధనావళిని సీఎం ఉల్లంఘించారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారి తన విధులు నిర్వర్తించకుండా అడ్డుకున్నారని తెలిపారు. "సీఎం అతిశీ తన అనుచరులు 50-70 మందితో 10 వాహనాల్లో వచ్చి ఫతే సింగ్ మార్గ్‌ను బ్లాక్ చేశారు. ఇది కోడ్‌కు విరుద్ధం" అని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. కాగా, మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘంతో కేజ్రీవాల్, అతిశీ భేటీ అయ్యారు.

నేడే ఢిల్లీ పోలింగ్



కన్నాట్‌ప్లేస్‌లోని హనుమాన్ గుడిలో కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమయింది. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అధికార ఆమ్ ఆద్మీని ఇంటికి పంపించేందుకు బీజేపీ అన్ని అస్త్రాలను సంధించింది. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా మొదలు కొని ఏపీ సీఎం చంద్రబాబు వరకు అందరినీ రంగంలోకి దించింది. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన వరాలు ఆ పార్టీ అవకాశాలను మెరుగు పరిచిందన్న అభిప్రాయాలు వస్తున్నాయి. ప్రధానంగా ఆదాయ పన్ను మినహాయింపును రూ.12 లక్షలకు పెంచడంతో మధ్య తరగతి ప్రజలు తమకు అనుకూలంగా ఓటేసే అవకాశం ఉందని బీజేపీ భావిస్తోంది. ఆమ్ ఆద్మీ మాత్రం బడుగు, బలహీన వర్గాలపైనే ఆశలు పెట్టుకుంది. గత పదేళ్లలో ఆ వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, మరోసారి తమకే అధికారం అప్పగిస్తారని కేజ్రీవాల్ బలంగా విశ్వసిస్తున్నారు. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటును కూడా దక్కించుకోని కాంగ్రెస్ ఈసారి ఒకటి లేదా రెండు సీట్లను గెలిచే అవకాశం ఉందని అంచనా. అయితే, ఈ పార్టీకి ఓటు శాతం పెరిగే అవకాశం ఉంది. ఒకవేళ కాంగ్రెస్ ఓటు శాతం పెరిగితే అది ఆమ్ ఆద్మీకి తీరని నష్టం చేసి, బీజేపీకి లాభం చేకూర్చే అవకాశం ఉంది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 699 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 13,033పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. హోమ్ ఓటింగ్ సౌకర్యంతో 7,553 మంది తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. ఈ నెల 8న ఫలితాలు రానున్నాయి.

మేం ఒక్కరు కాదు.. ముగ్గురం: ఈసీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: కేంద్ర ఎన్నికల సంఘాన్ని సీఈసీ రాజీవ్ కుమార్ నడుపుతున్నారంటూ ఆప్ నాయకులు ఎన్నికల ప్రచారం చేసిన ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. "మేం ఒక్కరు కాదు.. ముగ్గురం" అని పేర్కొంది. ఆప్ నేతలు చేసిన ఆరోపణలు ఉద్దేశ పూర్వకమని, ఈసీపై ఒత్తిడి పెంచేలా ఉన్నాయని తెలిపింది. ఈసీ అంటే ఒక్క అధికారి చేతుల్లోనే ఉందన్న ఉద్దేశాన్ని కల్పించేలా ఆప్ నేతల ఆరోపణలు ఉన్నాయని పేర్కొంది. అయితే, రాజ్యాంగబద్ధమైన వ్యవస్థ కావడంతో సంయమనం పాటించాలని నిర్ణయించుకున్నట్టు వివరించింది.

దివ్యాంగులందరూ పరీక్షల్లో స్క్రైబ్‌లను ఉపయోగించుకోవచ్చు

» కేంద్రం తగిన అవకాశాలు కల్పించాలి: సుప్రీం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: దివ్యాంగ అభ్యర్థులందరూ పరీక్షల్లో జవాబులు రాసేందుకు తమకు సహాయకులుగా 'స్క్రైబ్' (లేఖరి)లను నియమించుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇందుకు తగిన సౌకర్యాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రస్తుతం 40 శాతం మేర వైకల్యం ఉన్న అభ్యర్థులే స్క్రైబ్‌లను తోడుగా తీసుకెళ్లవచ్చు. ఇందుకు సంబంధిత అధికారులు ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. ఇలాంటి వారిని 'పర్సన్స్ విత్ బెంచ్‌మార్క్ డిజేబిలిటీస్' (పీడబ్ల్యూబీడీ) అభ్యర్థులుగా వ్యవహరిస్తారు. 40 శాతం ప్రామాణికత కన్నా తక్కువ వైకల్యం ఉన్న 'పర్సన్స్ విత్ డిజేబిలిటీస్' (పీడబ్ల్యూడీ) అభ్యర్థులు కూడా స్క్రైబ్‌లను వినియోగించుకోవచ్చని సోమవారం జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం ఆదేశించింది. దీనిని సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని తెలిపింది. పరీక్షలు నిర్వహించే అన్ని సంస్థలూ దీన్ని పాటించాలని పేర్కొంది. ఇలాంటి సమస్యలు కోర్టు వరకు రాకుండా ముందుగానే పరిష్కరించేందుకు వీలుగా పోర్టల్‌ను ఏర్పాటు చేయాలని సూచించింది. ప్రస్తుతం ఆరు నెలలకు చెల్లుబాటు అయ్యేలా స్క్రైబ్ సర్టిఫికెట్ ఇస్తుండగా ఆ గడువును పెంచాలని ఆదేశించింది.

అటవీ విస్తీర్ణం తగ్గించే ఎలాంటి చర్యలు చేపట్టొద్దు

» ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: అడవుల విస్తీర్ణాన్ని తగ్గించే ఎలాంటి చర్యలూ చేపట్టకూడదని సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో అటవీ భూమిని వేరే అవసరాలకు మళ్లిస్తే వెంటనే ప్రత్యామ్నాయంగా మరో చోట అడవిని పెంచాలని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన వన సంరక్షణ, సంవర్ధన నిబంధనలు-2023 కారణంగా 1.97 లక్షల చ.కి.మీ. భూమిని 'అడవుల' నిర్వచనం పరిధి నుంచి తప్పించారంటూ దాఖలైన వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. విశ్రాంత ఇండియన్ ఫారెస్టు సర్వీసు అధికారులు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. 'అడవి'కి ఉన్న నిర్వచనాన్ని మార్చి ఇతర అవసరాల కోసం భూమిని కేటాయిస్తున్నారని ఆ పిటిషన్‌లో ఆరోపించారు.

నిర్బంధ కేంద్రాల్లో 'వారు' ఎన్నాళ్లు?

విదేశీయులను పంపేందుకు ముహూర్తం కోసం చూస్తున్నారా?.. అసోం సర్కారుపై సుప్రీం ఫైర్

» పరాయి దేశస్థులుగా గుర్తించాక వారి దేశాలకు పంపాల్సిందే

» అడ్రస్‌లు తెలియడం లేదంటే అది మా సమస్య కాదు: సుప్రీం



ఇదీ వ్యాజ్యం.. అసోం నిర్బంధ కేంద్రాల్లో ఉన్న విదేశీయులను స్వదేశాలకు పంపాలని.. వారికి ఆహారం, వసతి తగురీతిలో లేవని.. వారిని స్వదేశాలకు అప్పగించబోతున్నట్లు రుజువు చూపేవరకు.. ఏ ఒక్కరినీ అసోం ప్రభుత్వం నిర్బంధించకుండా ఆదేశాలివ్వాలని పిటిషన్‌లో సుప్రీంకోర్టును కోరారు. దీనిపై నిరుడు మే 16న న్యాయస్థానం విచారణ చేపట్టింది. ప్రధానంగా మటియా నిర్బంధ కేంద్రంలో ఉన్న విదేశీయులను వారి దేశాలకు పంపేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. విదేశీయుల నిర్బంధానికి గల కారణాలు చెప్పాలని ఆదేశించగా..రాష్ట్రప్రభుత్వం జవాబివ్వకపోవడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది.

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: విదేశీయులుగా ప్రకటించిన వ్యక్తులను వారి స్వదేశాలకు పంపకుండా.. నిరవధికంగా నిర్బంధ కేంద్రాల్లో ఉంచడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఏదైనా ముహూర్తం కోసం చూస్తున్నారా అని అసోం ప్రభుత్వంపై మండిపడింది. ఈ వ్యవహారంలో రాష్ట్రప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోందని వ్యాఖ్యానించింది. ఒకసారి బందీలను పరాయి దేశస్థులుగా గుర్తించిన తర్వాత.. వారిని తక్షణమే వారి దేశాలకు పంపేయాలని స్పష్టం చేసింది. అసోంలో విదేశీయులుగా ప్రకటించినవారిని స్వదేశాలకు పంపడం.. వారున్న నిర్బంధ కేంద్రాల్లో ఆహార, వసతి సౌకర్యాలపై దాఖలైన పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన అసోం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రవి కోటాపై ప్రశ్నల వర్షం కురిపించింది. 'బందీల చిరునామాలు తెలియడం లేదంటూ వారిని ఆయా దేశాలకు పంపడానికి మీరు నిరాకరిస్తున్నారు. ఇది మా సమస్య ఎలా అవుతుంది? వారి దేశానికి వారిని పంపేయాల్సిందే. ఏదైనా శుభముహూర్తం కోసం చూస్తున్నారా? ఒకసారి ఒకరిని విదేశీయుడిగా ప్రకటించాక తదుపరి చట్టబద్ధమైన చర్యకు మీరు ఉపక్రమించాలి. శాశ్వతంగా వారిని నిర్బంధించి ఉంచలేరు. రాజ్యాంగంలోని 21వ అధికరణ ఇక్కడ ఉంది. అసోంలో చాలా నిర్బంధ కేంద్రాలు ఉన్నాయి. ఎంతమందిని మీరు విదేశాలకు పంపించారు' అని అసోం తరఫు న్యాయవాదిని అడిగింది. అడ్రస్‌లు తెలియకుండా వారిని పంపలేమని ఆయన నిస్సహాయత వ్యక్తం చేయడంతో.. చిరునామాలు లేకపోయినా వారిని వెనక్కి పంపవచ్చని ధర్మాసనం తెలిపింది. 'వారి దేశ రాజధానికి పంపేయండి. ఒకవేళ ఫలానా బందీ పాకిస్థాన్‌కు చెందినవాడైతే ఆ దేశ రాజధాని ఏదో మీకు తెలుసు కదా! విదేశాల్లో వారి చిరునామా తెలియదని ఎన్నాళ్లు వారిని నిర్బంధిస్తారు? ఇలాగైతే ఎప్పటికీ అడ్రస్ తెలుసుకోలేరు. ఇన్నేళ్లు నిర్బంధంలో ఉంచి ఖజానా నుంచి ఖర్చుపెడుతున్నారు' అని వ్యాఖ్యానించింది. విదేశీయులుగా ప్రకటించి.. జాతీయతను గుర్తించిన 63 మందిని స్వదేశాలకు పంపించే ప్రక్రియను రాష్ట్రప్రభుత్వం ప్రారంభించాలని ఆదేశించింది. రెండు వారాల్లో స్థాయీనివేదికను సమర్పించాలని నిర్దేశించింది. 'మా ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం సవ్యమైన అఫిడవిట్ దాఖలు చేయాలి' అని పేర్కొంది.

వారిని బంగ్లాదేశ్ తీసుకోవడం లేదు!

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కొలిన్ గొంజాల్వెజ్ వాదనలు వినిపించారు. కొందరు బందీలను తన దేశీయులుగా గుర్తించడానికి బంగ్లాదేశ్ నిరాకరించిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. 'వారు భారతీయులు కాదని భారత్ అంటుంటే.. బంగ్లా జాతీయులు కాదని ఆ దేశం అంటోంది. వారిప్పుడు అనాథలుగా మారారు' అని తెలిపారు. బందీలు రోహింగ్యాలని.. ఈ విషయంలో కేంద్రం, రాష్ట్రం కోర్టుకు నిజాలు చెప్పాలని కోరారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా జోక్యం చేసుకుని.. అసోం అఫిడవిట్‌లో లోపాలు చోటుచేసుకోవడంపై క్షమాపణ చెప్పారు. అత్యున్నత అధికారితో మాట్లాడి అన్ని వివరాలూ కోర్టుకు సమర్పిస్తానని తెలిపారు. దీంతో.. ఇంతవరకు ఎంత మంది విదేశీయులను వారి దేశాలకు పంపించారు.. ఆ దేశం వారో తెలియనివారి విషయంలో ఏం చేస్తారో కేంద్రం కూడా వివరాలు సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 25వ తేదీకి వాయిదావేసింది.

90 రోజులు దాటినా ఎన్ఐఏ కేసుల్లో అప్పీళ్లకు అనుమతి

జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) చట్టం కింద నమోదైన కేసుల్లో అప్పీళ్లు చేసుకునే విషయమై మంగళవారం సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఆదేశాలు, తీర్పులు వెలువడిన 90 రోజుల తరువాత కూడా వాటిని సవాలు చేస్తూ అప్పీళ్లు చేసుకోవచ్చని తెలిపింది. 90 రోజుల గడువు దాటిందన్న కారణంతో అప్పీళ్లను తిరస్కరించలేరని ధర్మాసనం తెలిపింది. ఎన్ఐఏ చట్టం-2008లో అప్పీళ్లకు గడువు విధించిన సెక్షన్ 21(5) రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలిచ్చింది.

బ్రెజిల్‌లో వేలం.. ఒంగోలు జాతి ఆవుకు రూ. 41 కోట్లు పలికిన ధర

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఇటీవల బ్రెజిల్‌లో జరిగిన వేలంలో ఒంగోలు జాతికి చెందిన వియాటినా-19 అనే పేరు గల ఆవు 4.8 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 41 కోట్లు) ధర పలికి ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనదిగా నిలిచింది. ఇప్పటిదాకా అత్యంత ఖరీదైన జాతులుగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన జపాన్‌కు చెందిన వాగ్యు, భారత్‌కు చెందిన బ్రాహ్మణ్‌లను బ్రెజిల్‌లోని మినాస్ గెరెయిస్‌లో పుట్టి పెరిగిన వియాటినా ఈ వేలంతో వెనక్కినెట్టింది. అంతేకాకుండా పశువుల పరిశ్రమలో ఇప్పటి వరకు ఉన్న అన్ని రికార్డులను తుడిచిపెట్టేసింది. ఒంగోలు జాతికి ఉండే అద్వితీయమైన శరీర సౌష్ఠవం, జాతి లక్షణం వియాటినాను ప్రత్యేక స్థానంలో నిలిపాయి. ఇది అత్యంత ఖరీదైన ఆవుగా గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో చోటు సాధించింది. అత్యద్భుత జాతి లక్షణాలు కలిగిన వియాటినా దూడల కోసం ప్రపంచంలోని బ్రీడర్లు ఎదురుచూస్తున్నారు. సాధారణ ఒంగోలు జాతి ఆవు కంటే డబుల్ సైజులో వియాటినా ఉంటుంది. దీని బరువు 1,101 కిలోలు.

వాట్సా‌ప్‌లో మరింత విస్తృతంగా చాట్‌జీపీటీ సేవలు

» ఇకపై ఆడియో ఇన్‌పుట్స్‌కూ స్పందన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఓపెన్ ఏఐకు చెందిన ఏఐ చాట్‌బాట్ చాట్‌జీపీటీ వాట్సాప్‌లో తన సేవలను మరింత విస్తృతం చేసింది. వాట్సాప్‌లో సేవలను అందించేందుకు గతేడాది డిసెంబరులో '+18002428478' నంబర్‌ను గతేడాది అందుబాటులోకి తీసుకొచ్చిన ఆ సంస్థ ఇప్పటి వరకు టెక్స్ట్ సందేశాలకు మాత్రమే సమాధానం ఇచ్చేది. అయితే ఇకపై ఆడియో, ఫొటో ఇన్‌పుట్స్‌కు కూడా స్పందించనుంది. ఇకపై వాట్సాప్ ద్వారా ఏదైనా ఫొటోను అప్‌లోడ్ చేసి దానికి సంబంధించిన ప్రశ్నలు అడిగితే చాట్‌జీపీటీ సమాధానం ఇస్తుంది. ఇదే తరహాలో వాయిస్ ఇన్‌పుట్‌లను కూడా విశ్లేషించి చాట్‌జీపీటీ సమాధానం ఇస్తుంది.

ట్రంప్ ట్రేడ్‌వార్‌కు జిన్‌పింగ్ సై!

» అమెరికా నుంచి వచ్చే బొగ్గు, ఎల్ఎన్‌జీపై 15% సుంకం విధించనున్నట్లు చైనా ప్రకటన



బీజింగ్, ఫిబ్రవరి 4: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'ట్రేడ్ వార్'కు చైనా సై అంది. అమెరికా నుంచి చైనాకు దిగుమతి అయ్యే బొగ్గు, ద్రవ రూపంలోని సహజవాయువు(ఎల్ఎన్‌జీ) ఉత్పత్తులపై 15% సుంకం విధిస్తామని ప్రకటించింది. ముడిచమురు, వ్యవసాయ యంత్రాలు, భారీ ఇంజన్లతో తయారైన కార్లపై 10శాతం టారిఫ్ విధిస్తామని తెలిపింది. అంతే కాకుండా, అనైతిక కార్యకలాపాలకు పాల్పడుతోందంటూ టెక్ దిగ్గజం గూగుల్‌పై విచారణకు సిద్ధమైంది. పీవీహెచ్ కార్పొరేషన్, ఇల్యుమినా లాంటి సంస్థలను 'నమ్మదగిన కంపెనీలు కావు' అన్న జాబితాలో చేర్చింది. అత్యంత అరుదైన ఖనిజ వనరులను అమెరికాకు ఎగుమతి చేయడంపైనా ఆంక్షలు విధిస్తామని చైనా ప్రకటించింది. చైనా విధించిన సుంకాలు ఈ నెల 10(సోమవారం) నుంచి అమల్లోకి రానున్నాయి. చైనా సరుకులపై 10% సుంకం విధిస్తామని ట్రంప్ ఇప్పటికే కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేసిన సంగతి తెలిసిందే. ఇది మంగళవారం నుంచే అమల్లోకి వచ్చింది. కెనడా, మెక్సికోలపై విధించిన సుంకాలు కూడా మంగళవారం నుంచే అమల్లోకి రావాల్సి ఉండగా.. అక్రమ వలసదారులపై చర్యలకు ఆ రెండు దేశాలు హామీ ఇవ్వడంతో టారిఫ్‌ల అమలును ట్రంప్ నెల రోజుల పాటు వాయిదా వేశారు.

చారకొండలో ఇళ్ల కూల్చివేత ఉద్రిక్తం

- రోడ్డు కోసం గృహాలను పడగొట్టిన అధికారులు
- తమకు నోటీసు ఇవ్వలేదని బాధితుల ఆగ్రహం




ఇళ్లను కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్, తమ ఇళ్లను కూల్చవద్దని అడ్డుపడటంతో బాలికను ఎత్తుకెళుతున్న పోలీసులు

చారకొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూలు జిల్లా చారకొండ మండల కేంద్రంలో బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం చేపట్టిన ఇళ్ల కూల్చివేత తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జడ్చర్ల-కోదాడ 167వ జాతీయ రహదారిలో భాగంగా చారకొండ నుంచి మర్రిపల్లి వరకు 2 కి.మీ మేర బైపాస్ రోడ్డు వేస్తున్నారు. ఈ రోడ్డు కోసం 2020లో చారకొండలో పరిహారం చెల్లించి భూసేకరణ చేశారు. ఇప్పు డు కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో పనులు ఆపేయాలని కొందరు, పరిహారం తీసుకోని మరికొందరు కలిసి పనులు చేపట్టొద్దని ఆందోళనలు చేశారు. రోడ్డు పనుల్లో భాగంగా మంగళవారం కల్వకుర్తి డీఎస్పీ, ఆర్డీవో ఆధ్వర్యంలో పలువురి ఇళ్లను ఎక్స్‌కవేటర్లతో నేలమట్టం చేశారు. నోటీసులు ఇవ్వకుండా పోలీసులు హఠాత్తుగా వచ్చి ఇళ్లను కూల్చివేశారని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. తమకు రెండేళ్ల క్రితం ఇచ్చిన నష్టపరిహారంతో ప్రస్తుతం ఎక్కడా ఇంటి స్థలం రాదని బాధితులు వాపోయారు. ఆందోళన నేపథ్యంలో పలువురు స్పృహ తప్పి పడిపోయారు.

పరిహారం ఇచ్చాం.. చాటింపు వేశాం

చారకొండలో 2 యూటర్న్‌లు, ఓ కల్వర్టు ఉండటంతో బైపాస్ రోడ్డు వేయాలని గ్రామస్థులు అప్పట్లో డిమాండ్ చేశారు. దీంతో రోడ్డు కోసం 29 ఇళ్లతో పాటు ఖాళీ స్థలాలను సేకరించాం. ఇందులో ఆరుగురికి మినహా మిగతా వారికి నాలుగేళ్ల క్రితమే పరిహారం ఇచ్చాం. మిగిలిన వారికీ డబ్బులిస్తాం. పరిహారం ఇచ్చాక నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదు. కూల్చివేతలపై ముందు రోజు గ్రామంలో చాటింపు వేశాం.

- భరత్, ఆర్ఐ, చారకొండ

తెలంగాణ సీఎం పదవిని బీసీలకు ఇవ్వాలి

- లోక్‌సభలో ఎంపీ రఘునందన్‌రావు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన గురించి గొప్పలు చెప్పే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తెలంగాణ సీఎం పదవిని బీసీలకు ఇవ్వాలని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రి వర్గంలో ఖాళీగా ఉన్న ఆరు మంత్రి పదవులను కూడా బీసీలకే ఇవ్వాలన్నారు. మంగళవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఎంపీ రఘునందన్ మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఏమీ రాలేదంటూ పత్రికల్లో రావడం బాధాకరమని, ఒక్క ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వం రూ.20 వేల కోట్లకు పైగా ఇచ్చిందని ఎంపీ రఘునందన్ పేర్కొన్నారు.

విభజన హామీల అమలెప్పుడు?: రేణుకా చౌదరి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విభజన హామీల అమలుకు ఇంకెంతకాలం పడుతుందని రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి ప్రశ్నించారు. "తెలంగాణ కోసం కేంద్ర ప్రభుత్వాన్ని మేమేమీ బిచ్చమడగట్లేదు. ఇది మా హక్కు. కాబట్టి నిలదీస్తున్నాం. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలనే నెరవేర్చకపోతే.. ఇంక ఈ సమావేశాలు నిర్వహించుకోవడం ఎందుకు?" అంటూ రాజ్యసభలో కేంద్రాన్ని నిలదీశారు. మంగళవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో ఆమె మాట్లాడారు.

విద్యారంగంలో వెనకబడిన జిల్లాలు మూడు

- ఎంపీ రఘురామిరెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యారంగానికి సబంధించి తెలంగాణలో ఆసిఫాబాద్, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెంలను వెనుకబడిన జిల్లాలుగా గుర్తించామని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి వెల్లడించారు. విద్యాపరంగా దేశంలో ఐదేళ్లలో ఎన్ని వెనుకబడిన జిల్లాలను గుర్తించారు? ఆ జిల్లాల్లో కేంద్రం తీసుకుంటున్న చర్యలేమిటి?.. అని ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ ఆర్. రఘురామిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు.

పంట దిగుబడి రాక రైతు ఆత్మహత్య

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కుమరంభీం జిల్లా ఆసిఫాబాద్ మండలంలోని బొందగూడకు చెందిన కొమురం పోశయ్య(55) అనే రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోశయ్య తనకున్న 10 ఎకరాల భూమిలో ఈ ఏడాది పత్తిని సాగు చేశాడు. విత్తనాలు, ఎరువుల కోసం సుమారు రూ. 2 లక్షలకు పైగా ఖర్చయింది. ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. దీనికి తోడు బ్యాంకులో రూ. 1.80 లక్షల రుణం, ట్రాక్టర్ ఈఎంఐ ఏడాదికి రూ. 1.60 లక్షలు కట్టాల్సి ఉంది. దిగుబడి తగ్గడంతో అప్పులు ఎలా తీర్చాలని మనోవేదనకు గురై సోమవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు ఆయన్ను ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

ఆదివాసీల హత్యపై విచారణ జరిపించాలి

- ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక డిమాండ్

నల్లకుంట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీలను హతమార్చడంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక డిమాండ్ చేసింది. ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్న బలగాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేసింది. ఆదివాసులను హత్య చేసిన పోలీసులే ఎన్‌కౌంటర్ జరిగిందంటూ కట్టుకథ అల్లుతున్నారంటూ పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్(పీయూసీఎల్) ఇప్పటికే ప్రకటించిందని వారు గుర్తుచేశారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం, పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు తదితరులు మాట్లాడారు.

ఛత్తీస్‌గఢ్ గంగలూరు అడవుల్లో పేలిన ఐఈడీ

- ముగ్గురు జవాన్లకు గాయాలు.. తప్పిన ప్రాణాపాయం
- ఇద్దరు గిరిజనులను హత్య చేసిన మావోయిస్టులు

చర్ల, ఫిబ్రవరి 4: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గంగలూరు అడవుల్లో మంగళవారం ఐఈడీ పేలడంతో ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. కేంద్ర బలగాలు గంగలూరు అడవుల్లో కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలింది. గాయపడ్డ జవాన్ల పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని బీజాపూర్ పోలీసులు తెలిపారు. బీజాపూర్ జిల్లా బడ్డిచెరులో మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. బడ్డిచెరుకు చెందిన కరం రాజు, మాద్వి మున్నా అనే గిరిజనులు ఇంట్లో నిద్రిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున మావోయిస్టులు వారిని బయటకు తీసుకెళ్లి గొంతుకోసి హత్య చేశారని పోలీసులు తెలిపారు.

కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



చంపాపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విమర్శించారు. హైదరాబాద్ హస్తినాపురం డివిజన్‌లో మంగళవారం రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.చంద్రమోహన్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో జాన్ వెస్లీ మాట్లాడుతూ, శ్రామిక, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు బడ్జెట్ వ్యతిరేకంగా ఉందని అన్నారు. కోట్లాది మంది కూలీల పొట్ట గడవడానికి రూ. 2లక్షల కోట్ల నిధులు కేటాయించాలని కోరితే.. కేవలం రూ. 85వేలు మాత్రమే ఇచ్చారని చెప్పారు. బడ్జెట్‌లో అధిక భాగం వడ్డీలు చెల్లించడానికే సరిపోతుందని జాన్ వెస్లీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 10న ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చలో ఇందిరాపార్కు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య తెలిపారు.

బైక్‌లో లోపాలకు రూ.1.94 లక్షలు చెల్లించండి

- జావా బైక్ కంపెనీకి ఫోరం ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఒక వాహనదారుడు జావా బైక్ కంపెనీపై వేసిన కేసులో హైదరాబాద్ జిల్లా వినియోగదారుల ఫోరం-1 ఆసక్తికర తీర్పు ఇచ్చింది. లోపాలు ఉన్న వాహనాన్ని ఇచ్చినందుకు వినియోగదారుడికి రూ.1.94 లక్షలు చెల్లించాలని ఆదేశించింది. యూసుఫ్‌గూడాకు చెందిన సీహెచ్.విజయానంత్ 2021 డిసెంబరులో జావా పెరక్ బైక్‌ను రూ.2,42,750లకు కొనుగోలు చేశాడు. ఈ బైక్ వైరింగ్ వ్యవస్థలో తరచూ సమస్యలు రావడం మొదలైంది. వారెంటీ ఉండడంతో లేబర్ సర్వీస్ చార్జీలను తీసుకొని ఒకసారి వైరింగ్ వ్యవస్థను మార్చి కొత్తది వేయగా, మరికొన్నిసార్లు రిపేరు చేసి ఇచ్చారు. 2023 డిసెంబరులో వారెంటీ రెండు రోజుల్లో ముగుస్తుందనగా మరోసారి వైరింగ్ సిస్టంలో సమస్య తలెత్తడంతో సర్వీస్ సెంటర్‌కు ఫోన్ చేసి సమాచారమిచ్చాడు. తాను ఆ సమయంలో రాలేకపోతున్నానని రెండు రోజులు తర్వాత వస్తానని వివరంగా చెప్పగా అందుకు సర్వీస్ సెంటర్ ప్రతినిధి అంగీకరించాడు. తీరా రెండు రోజులు తర్వాత అక్కడికి వెళ్లగా వారెంటీ గడువు ముగిసిందని చెప్పడంతో జావా బైక్ కంపెనీని ఆశ్రయించాడు. వారి నుంచి సరైన సమాధానం రాకపోగా అమర్యాదగా మాట్లాడడంతో విసుగు చెందిన విజయానంత్ గత ఏడాది మే నెలలో వినియోగదారుల ఫోరం మెట్లు తొక్కాడు. కేవలం వైరింగ్ వ్యవస్థనే కాకుండా క్లచ్‌తో పాటు బైక్ డిజైన్‌లోని లోపాలను కూడా ఎత్తి చూపాడు. సుదీర్ఘ విచారణానంతరం డి.మాధవీలత బెంచ్ ఈ కేసులో తీర్పును వెలువరించింది. బైక్ తయారీ సంస్థ ప్రతినిధుల నిర్లక్ష్యం, వాహనదారుడితో వ్యవహరించిన తీరును పరిశీలించి ఆ కంపెనీకి మొట్టికాయలు వేసింది. వాహనదారుడు రెండేళ్ల పాటు బైక్ వినియోగించినందున ఆ తరుగుదల మొత్తాన్ని తొలగించి, ఆ వాహనం కొన్న ధరలో 20 శాతం తగ్గించి మిగిలిన రూ.1.94 లక్షలు అతడికి చెల్లించాలని తీర్పు ఇచ్చింది.

ఆనంద నృత్యం చేస్తుండగా.. ఆగిన ఇంటర్ విద్యార్థిని గుండె

- మహబూబాబాద్ జిల్లా సీరోలు 'ఏకలవ్య'లో విషాదం

సీరోలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వారంతా ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థినులు.. త్వరలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వార్షిక పరీక్షలు పూర్తయితే ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోతారు కాబట్టి వారికి ఘనంగా వీడ్కోలు తెలిపేందుకు వేడుక నిర్వహిస్తున్నారు!! అందరూ ఉత్సాహంగా కేరింతలు కొడుతూ.. నృత్యాలు చేస్తున్నారు. కానీ అంతలోనే.. వారిలో ఒక విద్యార్థి గుండెపోటుతో కుప్పకూలింది. అప్పటిదాకా సందడిగా ఉన్న ఆ ప్రాంగణమంతా విషాదంలో మునిగిపోయింది. మహబూబాబాద్ జిల్లా సీరోలు మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో మంగళవారం సాయంత్రం జరిగిన విషాదమిది. ఆ కళాశాలలో.. ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ చదువుతున్న విద్యార్థిని సపావట్ రోజా (16) వేదికపై నృత్యం చేస్తూనే గుండెపోటుకు గురైంది. వెంటనే అక్కడున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఆమెకు సీపీఆర్ చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రోజా స్వగ్రామం మరిపెడ మండలం తానంచర్ల శివారు సపావట్ గ్రామం. బిడ్డ మరణ వార్త తెలియగానే ఆమె తల్లిదండ్రులు వీరు, పద్మ, వారి కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

చోరీలకు.. సరిపోదా గురువారం!

సోమ, మంగళ, బుధవారాల్లో ప్లానింగ్.. గురువారాలు దొంగతనాలు.. వీకెండ్‌లో జల్సాలు

- హైటెక్ దొంగ బత్తుల ప్రభాకర్ స్టయిలే వేరు
- ప్రిజమ్ పబ్ వద్ద కాల్పులు జరిపి పోలీసులకు చిక్కిన ప్రభాకర్



బత్తుల ప్రభాకర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల వచ్చిన 'సరిపోదా శనివారం' సినిమా గుర్తుందా? అందులో కథానాయకుడు నాని... కేవలం శనివారం మాత్రమే తన కోపాన్ని బయటకు ప్రదర్శిస్తాడు, ఫైటింగులు చేస్తాడు.. హైదరాబాద్, గచ్చిబౌలిలోని ప్రిజమ్ పబ్ వద్ద కాల్పులు జరిపి పోలీసులకు చిక్కిన ఘరానా దొంగ బత్తుల ప్రభాకర్‌ది కూడా దాదాపు ఇదే పద్ధతి. కళాశాలలు, విద్యాసంస్థలే లక్ష్యంగా దొంగతనాలు చేసే ప్రభాకర్... సరిపోదా గురువారం అన్నట్టు.. వారంలో గురువారం రోజున మాత్రమే తన కళను ప్రదర్శిస్తాడు. సోమ, మంగళ, బుధవారాల్లో దొంగతనానికి పథకం వేస్తుంటాడు. వారాంతాలు.. శుక్ర, శని, ఆదివారాలు పబ్‌లు చుట్టూ తిరుగుతూ విలాసవంతమైన జీవితాన్ని గడుపుతుంటాడు. అంతేనా.. ఎలాగైనా రూ.335 కోట్లు కొల్లగొట్టడం, వంద మంది అమ్మాయిలతో జల్సా చేయడం ప్రభాకర్ జీవిత లక్ష్యాలు. వీటిని నెరవేర్చుకునేందుకు ప్రభాకర్.. 'ధూమ్' సినిమా స్థాయిలో పెద్ద సెటప్ కూడా పెట్టుకున్నాడు. తాను నివాసముండే ఫ్లాట్‌లోని ఓ గదిలో గోడకి తన తదుపరి లక్ష్యాలు, అవి నెరవేర్చుకునే మార్గాలకు సంబంధించిన ఫొటోలతో కూడిన మ్యాప్‌లను ఏర్పాటు చేసుకున్నాడు. విచారణలో ప్రభాకర్‌కు సంబంధించిన ఇలాంటి విషయాలన్నీ బయటికొస్తుంటే పోలీసులే ముక్కున వేలేసుకుంటున్నారు.

ఒకేసారి రూ.3 కోట్లు మొత్తం రూ.335 కోట్లు.

ప్రభాకర్ కేవలం నగదు దొంగతనాలే చేస్తుంటాడు. ఎవ్వరికీ అనుమానం రాకుండా కళాశాలలు, విద్యా సంస్థల్లో చోరీలు చేస్తాడు. సోమ, మంగళ, బుధవారాల్లో రెక్కీ చేసి గురువారం దొంగతనం చేస్తుంటాడు. కనీసం రూ.10 లక్షలు దొరుకుతాయి అనుకుంటేనే డ్యూటీ ఎక్కుతాడు. ఒక్క దోపిడీలో రూ.3కోట్లు కొల్లగొట్టాలని, జీవితకాలంలో రూ.335 కోట్లు దోచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభాకర్ 80 వరకు కళాశాలల్లో చోరీలు చేశాడు. కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రులపై కన్నేశాడు. హైదరాబాద్‌లోని 2 కార్పొరేట్ ఆస్పత్రులపై స్కెచ్ కూడా సిద్ధం చేసుకున్నాడు.

ఫోన్ ఉంటుంది.. కానీ నో సిమ్

ప్రభాకర్ ఓ సెల్‌ఫోన్ వాడతాడు కానీ అందులో సిమ్ కార్డు ఉండదు. చోరీల కోసం రెక్కీకి వెళ్లినప్పుడు తనకు కావాల్సిన ఫొటోలు తీసేందుకు ఆ సెల్ ఫోన్ వాడతాడు. అలాగే, చోరీ చేసే గదిలో చీకటిగా ఉంటే సెల్‌ఫోన్‌లోని టార్చ్‌లైట్‌ను వాడతాడు. ఇక, గచ్చిబౌలిలో నెలకు రూ.50వేలు అద్దె చెల్లిస్తూ ఓ ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లో ఉంటున్న ప్రభాకర్.. ఆ ఫ్లాట్‌లోని ఓ గదిని డెన్‌గా మార్చేశాడు. సినిమాలో చూపించే విధంగా దోపిడీకి స్కెచ్‌లు, చోరీకి వెళ్లడానికి రూట్ మ్యాప్, దోపిడీకి టార్గెట్ చేసిన లొకేషన్స్‌కు సంబంధించి ఆ గదిలో ప్రత్యేక ఏర్పాటు చేసుకున్నాడు. వంట చేసి పెట్టేందుకు ఓ వంట మనిషిని కూడా పెట్టుకున్న ప్రభాకర్.. కొత్తవాళ్లను ఫ్లాట్‌లోకి రానివ్వడు.

కారు, బ్యాంకు ఖాతాలు స్నేహితుల పేరు మీదే..

ఊళ్లో తనకు చేపలు, రొయ్యల చెరువుల వ్యాపారులున్నాయని చెప్పుకునే ప్రభాకర్.. ఖరీదైన బ్రాండెడ్ దుస్తులు వేసుకుని తిరుగుతూ, రూ.40వేల విలువైన మద్యం తాగుతూ దర్పం ప్రదర్శించేవాడు. స్నేహితుడి పేరిట కొనుగోలు చేసిన స్కోడా కారులో తిరిగేవాడు. డబ్బు అవసరమైనా, ఆన్‌లైన్ లావాదేవీలు చేయాలన్నా పబ్‌ల్లో పరిచయమైన స్నేహితుల బ్యాంకు ఖాతాలు వాడేవాడు. ఇక, రెండుసార్లు బిహార్ వెళ్లి రెండు తుపాకులు తెచ్చుకున్న ప్రభాకర్... ఓఆర్ఆర్ సమీపంలోని అటవీ ప్రాంతాల్లోకి వెళ్లి తుపాకీ పేల్చడం సొంతంగా నేర్చుకున్నాడు. 500 బుల్లెట్లు కొనుగోలు చేసి శిక్షణకు 100 రౌండ్ల దాకా వాడేశాడు. తొమ్మిదో తరగతి వరకే చదివిన ప్రభాకర్ తెలివికి ఆశ్చర్యపోతున్న పోలీసులు.. అతడిని లోతుగా విచారించడానికి కోర్టులో కస్టడీ పిటిషన్ వేశారు.

లక్ష్యం.. 100 మంది అమ్మాయిలు

జల్సారాయుడైన ప్రభాకర్ డబ్బు ఎరగా వేసి నచ్చిన అమ్మాయిని తన ఫ్లాట్‌కు తీసుకెళ్లి వారితో గడిపి సరదా తీరాక పంపేస్తుంటాడు. ఇలా నచ్చిన 100 మందితో గడపాలనేది ప్రభాకర్ లక్ష్యం. ఇందులో భాగంగా ఇప్పటిదాకా 40 మంది అమ్మాయిలను ట్రాప్ చేసినట్టు ప్రభాకర్ పోలీసులకు చెప్పాడు. డబ్బు, అమ్మాయిల విషయంలో తన లక్ష్యాలను ప్రతిబింబించేలా తన ఛాతీపై రెండు టాటూలు కూడా వేయించుకున్నాడు ప్రభాకర్. ఏపీకి చెందిన ఓ అమ్మాయి వారానికోసారి ప్రభాకర్ ఫ్లాట్‌కు వచ్చివెళ్లేదని, ప్రతీసారి రూ.30వేలు చొప్పున తీసుకెళ్లేదని పోలీసులు గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా ఎస్సై, మరొకరి మృతి

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఎస్సై కారు
- జగిత్యాల జిల్లా చిల్వాకోడూర్ వద్ద ఘటన




కొక్కుల శ్వేత, నరేష్ (ఫైల్)

గొల్లపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల డిస్ట్రిక్ట్ క్రైం రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్‌బీ) ఎస్సై కొక్కుల శ్వేత (30)తో పాటు, ఓ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మల్యాల నరేష్ (26) దుర్మరణం చెందారు. ఎస్సై శ్వేత చొప్పదండి మండలం ఆర్నకొండ నుంచి తన కారులో జగిత్యాలకు వస్తుండగా మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన మల్యాల నరేష్ (26) మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు ద్విచక్ర వాహనం పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ రెవెన్యూ శివారులోని వంతెన సమీపంలో అదుపు తప్పిన శ్వేత కారు ఎదురుగా వస్తున్న నరేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. అదే వేగంతో కారు చెట్టుకు ఢీకొనడంతో శ్వేత, నరేష్ తీవ్ర గాయాలతో మృతి చెందారు. నరేష్‌కు ఇటీవల వివాహం నిశ్చయమైంది. శ్వేతకు వివాహమైనప్పటికీ కొంతకాలంగా పుట్టింట్లోనే ఉంటున్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన శ్వేత కష్టపడి మొదట కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో ఉద్యోగం పొందారు. ఆ తర్వాత ఎస్ఐగా ఉద్యోగం సాధించినా కుటుంబ సభ్యుల సంబురం ఎంతోకాలం నిలవలేదని గ్రామస్తులు కంటతడి పెట్టారు.

కలెక్టర్ సస్పెండ్ చేయడంతో సీడీపీవో ఆత్మహత్యాయత్నం!

- ప్రాణాపాయం లేదన్న వైద్యులు.. ములుగు జిల్లాలో ఘటన



అపస్మారకస్థితిలో ధనలక్ష్మి

వెంకటాపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో ఇన్‌చార్జ్ సీడీపీవో ధనలక్ష్మి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కలెక్టర్ సస్పెండ్ చేశారన్న మనస్తాపంతోనే ఆమె ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిసింది. జిల్లాలోని వెంకటాపురం మండల కేంద్రంలోని ఓ ఇంట్లో వెంకటాపురం (నూగూరు) ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ సీడీపీవో ధనలక్ష్మి అద్దెకు ఉంటున్నారు. ఆమె గతేడాది నవంబరులో ఇన్‌చార్జ్ సీడీపీవోగా విధుల్లో చేరారు. మంగళవారం ఆమె ఉంటున్న ఇంట్లోనే చేతి మణికట్టుపై కత్తితో కోసుకున్నారు. రక్తస్రావమవ్వడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఆమెను విధులకు తీసుకెళ్లేందుకు వచ్చిన కారు డ్రైవర్‌ను ఆమెను గమనించి వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వెంటనే చికిత్స అందించడంతో ప్రాణాప్రాయం నుంచి బయటపడ్డారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు ప్రకటించారు. అయితే జిల్లా సంక్షేమ అధికారిణే తన ఆత్మహత్యాయత్నానికి కారణమని సీడీపీవో ధనలక్ష్మి చెప్పారు. తనపై ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇవ్వడంతో కలెక్టర్ తనను సస్పెండ్ చేశారని కన్నీటిపర్యంతమయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాల గురించి తాను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో జిల్లా సంక్షేమ అధికారి కక్షగట్టి అంగన్‌వాడీ టీచర్లకు లేనిపోని మాటలు చెప్పి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేలా ఉసిగొల్పారని వాపోయారు. డీడబ్ల్యూవో తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మీడియాకు తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి నుంచి తనకు సపోర్టు లేదని ఆమె చెబుతున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ట్రంప్ వీరంగం

తెలిసిన దయ్యమే కనుక, ప్రమాదం కూడా ఊహించినట్టుగానే ఉన్నది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెండోరాకడతో ప్రపంచం ఇప్పటికే ఉత్పాతాలకు సిద్ధపడింది. గద్దెనెక్కగానే ఏం చేయబోతున్నానో ఆయన ముందుగానే చెప్పాడు. అమెరికాకి మళ్ళీ ఔన్నత్యాన్ని అద్దడానికి, గతకాలపు కీర్తిని తెచ్చి తలకు చుట్టడానికి ఇంటాబయటా కూడా సమూల ప్రక్షాళనకు ఒడిగడతానని ప్రమాణం చేశారాయన. అందులో భాగంగా అగ్రరాజ్యానికి తలవంపులు తెచ్చే వెకిలిపనులకు కూడా ఆయన వెనుకాడడం లేదు.

పన్నులు, సుంకాలతో ఆయన మిత్రులనూ, శత్రువులనూ ఉక్కిరిబిక్కిరి చేయడం ఆరంభించారు. అక్రమవలసదారులను కట్టకట్టి సైనిక విమానాల్లోకి తోసి సరిహద్దులను దాటించేస్తున్నారు. అనాదిగా అమెరికాతో అనుబంధం ఉన్న కెనడా, మెక్సికోలమీద పాతికశాతం సుంకాలు విధించి, శత్రుదేశం చైనామీద ప్రస్తుతానికి పదిశాతంతో సరిపెట్టాడాయన. అరవై శాతం సుంకాలతో చైనాకు ఊపిరాడకుండా చేస్తానని ఎన్నికల ప్రచారంలో చెప్పుకున్నా, ఎందుచేతనో వెనక్కుతగ్గారు. మెక్సికో దారికి వస్తున్నదనీ, సయోధ్య కుదిరితే సరేసరి, లేదంటే నెలరోజుల తరువాతైనా వాతలు తప్పవంటూ ఆ తరువాత ఆదేశాల అమలును వాయిదావేశారు ట్రంప్. అమెరికా అధ్యక్షుడి సుంకాలదాడికి ఈ మూడుదేశాలు చేతనైనమేరకు తక్షణ ప్రతీకారం తీర్చుకున్నాయి. అమెరికా తప్పుడు విధానాలమీద ప్రపంచ వాణిజ్యసంస్థలో అమీతుమీ తేల్చుకుంటానని చైనా అంటోంది. మొత్తానికి ట్రంప్ ఆరంభించిన వాణిజ్యయుద్ధం అంతర్జాతీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. చాలాదేశాల మార్కెట్ సూచీలు ఆదుర్దాగా కదులుతున్నాయి. త్వరలోనే యూరోపియన్ యూనియన్ వంతు వస్తుందని కూడా ఆయన ప్రకటించారు. అధ్యక్షుడి అంతిమలక్ష్యం మిగతాదేశాలను రాయబారానికి దించడం, లొంగివచ్చేవరకూ ఒత్తిడి పెంచడం కనుక ఈ వాణిజ్య యుద్ధానికి అంతా తయారుకాక తప్పదు. ఇప్పటికైతే భారతదేశం జోలికి రాకపోయినా, హార్లీడేవిడ్సన్ వంటి ఉదాహరణలతో, ఎత్తిపొడుపులతో, చిన్నాచితకా దాడితో ఆయన కార్యరంగాన్ని ఎప్పటినుంచో సిద్ధం చేసివుంచారు. ఆ విధానాలను కాస్తంత రుచిచూసిన అనుభవం కూడా ఉన్నది కనుక, ఏయే అంశాల్లో రాజీపడాలో, వేటిని రాజకీయంతో నెట్టుకురావాలో మనం గమనించుకోవాలి. ఈనెలలో మోదీ జరపబోయే అమెరికా పర్యటన, ఆలింగనం స్థాయికి ఎదిగిన ఇద్దరి స్నేహం ఈ విషయంలో ఎంతమేరకు ఉపకరిస్తుందో చూడాలి.

ట్రంప్ సుంకాల యుద్ధానికి మిగతాదేశాలు మొదట్లో కాస్తంత తడబడినా, త్వరితంగానే తట్టుకొని నిలబడతాయి, ఎదురొడ్డిపోరాడతాయి. పెంచిన సుంకాల దెబ్బకు సరుకుల రాకడ తగ్గి, ధరలు పెరిగి సామాన్య అమెరికన్‌కు సెగ పుట్టడానికి కొంత సమయం పట్టవచ్చు. వలసజీవులమీద ఉక్కుపాదం మోపడం జనరంజకంగా ఉంటుందేమో కానీ, అమెరికా ఆర్థికాన్ని రక్షించదని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఆ శ్రామికజనం లేనిదే దేశం కదలదని ట్రంప్‌కు మాత్రం తెలియదా? రియల్ ఎస్టేట్ సహా చాలా రంగాల్లోకి తన వ్యాపారసామ్రాజ్యాన్ని విస్తరించిన ట్రంప్‌కు ఖర్చుతక్కువ కూలీలు ఏ అడ్డామీద దొరుకుతారో అవగాహన ఉండదా?

ఈ ఏరివేతలు, తరలింపులు ఎంతకాలం, ఏ స్థాయిలో సాగుతాయో తెలియదు కానీ, గద్దెనెక్కిన కొద్దిరోజులకే ట్రంప్ వీరంగం అవధులు దాటిపోతోంది. ప్రజాస్వామ్యానికీ, భావస్వేచ్ఛకు పుట్టినిల్లని చెప్పుకొనే అమెరికా పునాది విలువలను ఆయన కుదిపేస్తున్నారు. ఏ ఆదర్శాలకు, ఆశయాలకు స్టాట్యూ ఆఫ్ లిబర్టీ ప్రతీగా నిలబడిందో వాటికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. పదిహేనునెలల గాజాయుద్ధంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ఎంత అమానవీయంగా వ్యవహరించారో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. అమెరికా, దాని మిత్రదేశాలు తప్ప, మిగతా ప్రపంచమంతా అక్కడ సాగిన మారణకాండకు తల్లడిల్లిపోయింది. ఈ యూదునాయకుడి ఆధ్వర్యంలో పాలస్తీనియన్ల ఊచకోతను అంతర్జాతీయ సంస్థలూ సంఘాలూ ఖండించాయి. తక్షణమే యుద్ధం ఆగాలనీ, ఆకలితో అల్లాడుతున్నవారికి అన్నం అందాలనీ ఘోషించాయి. అమెరికన్ యూనివర్సిటీల్లో గాజా ఊచకోతలకు వ్యతిరేకంగా విద్యార్థులు సాగించిన ఉద్యమం ఎలా చూసినా హద్దులు దాటిందేమీ లేదు. అమెరికా స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు ప్రతీకగా ఆ దేశానికి మంచిపేరు తెచ్చిందే తప్ప, అవమానించిందేమీ లేదు. కానీ, నిరసనల్లో పాల్గొన్నవారిని స్వదేశాలకు తిరిగి పంపించేయాలన్న ట్రంప్ నిర్ణయం ఇజ్రాయెల్‌ను సంతృప్తిపరచవచ్చు, నెతన్యాహూను మెప్పించవచ్చు కానీ, అమెరికాపరువు దిగజార్చింది.

విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు నిధుల కేటాయింపు సమృద్ధిగా ఉంటేనే ప్రపంచ వ్యాప్తంగా భారత్ వ్యూహాత్మక ప్రయోజనాలు నెరవేరుతాయి. ఈ కీలక శాఖకు 2024–25 సవరించిన బడ్జెట్‌లో నిధుల కేటాయింపు రూ. 25,277 కోట్లు కాగా 2025–26లో రూ.20,516 కోట్లు మాత్రమే కేటాయించారు!

దౌత్య విధులకు నిధుల కోత!

గల్ఫ్ లేఖ

అంకితభావం, చిత్తశుద్ధి, సహనం, జిజ్ఞాస... ఈ నాలుగు అంశాలు భారతీయులకు దేవుడు ఇచ్చిన వరం. అగ్రరాజ్యం అమెరికా మొదలు ఆఫ్రికాలోని ఇథియోపియా దాకా ప్రపంచం నాలుగు దిక్కుల్లోను భారత వైభవం పరిఢవిల్లడానికి ఆ విశిష్టతలే ఒక ప్రధాన కారణం. వైద్య రంగం, నిర్మాణ, ఐ.టి రంగాలలో ప్రపంచవ్యాప్తంగా భారత్ గౌరవాదరాలు పొందడంలో విదేశాలలోని భారతీయ యువత పాత్ర కీలకమైనది, ప్రశస్తమైనది, అభినందనీయమైనది. ఇటువంటి స్నేహ వారధి వ్యవస్థ మరే దేశానికి లేదనడంలో అతిశయోక్తి లేదు.

విశ్వ గురువు మన మాతృభూమి అని మనం సగర్వంగా చెప్పుకుంటున్నాం. అందుకు తగినట్లుగా ప్రధాని మోదీ అంతర్జాతీయ దౌత్య వ్యవహారాలలో నిరంతరం నిమగ్నమై ఉంటారు. భారత్ ప్రతిష్ఠను ఇనుమడింపచేయడానికి ఆయన చేయని ప్రయత్నాలు లేవు. దేశ ప్రతిష్ఠ, వైభవాన్ని చాటి చెబుతూ సమస్త దేశాలతోను ద్వైపాక్షిక సంబంధాలు పెంపొందించుకోవడం ద్వారా జాతి ప్రయోజనాలను సాధించుకోవాలి. ఈ రాజనీతి కర్తవ్య నిర్వహణలో ఏ దేశానికైనా దాని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కీలకమైనది. అమెరికాతో సహా అనేక అభివృద్ధి చెందిన దేశాల ప్రాబల్యం నలుమూలలలో ఉండడానికి కారణం ఆయా దేశాల విదేశీ వ్యవహారాల శాఖలు తమ జాతీయ ప్రయోజనాలు పరిరక్షించుకోవడంలో వ్యూహాత్మకంగా వ్యవహరించే తీరుతెన్నులే.

అంతర్జాతీయ దౌత్య వ్యవహారాలలోకి భారత్ కంటే చాల వెనుక వచ్చిన చైనా వ్యూహాత్మకంగా భారత్‌ను మించిపోతోంది. మన పొరుగు దేశాలు మొదలు ఆఫ్రికా రాజ్యాల దాకా చైనా పై చేయి సాధించడంలో విజయవంతమవుతోంది. ఆఫ్రికాతో భారత్ సంబంధాలు చరిత్రాత్మకమైనవి అయినా మన తర్వాత చైనా అక్కడ ప్రవేశించి విస్తరించిన తీరు అనూహ్యం. చైనా ప్రభుత్వ దూకుడుకు తోడుగా భారత్ తరహా ప్రవాస యువత ఆ దేశానికి ఉంటే ఆ కమ్యూనిస్టు రాజ్యం పలుకుబడి ప్రపంచ వ్యాప్తంగా ఎంత అధికంగా ఉండేదో ఊహించడం కూడ కష్టం.



భారత్ విదేశీ వ్యవహారాల శాఖలో ప్రతిభా సామర్థ్యాలకు కొదవ లేదు. కార్యాచరణ విషయానికి వస్తే అది మాటలకు తగినట్లుగా లేదు! గతంతో పోల్చితే గడిచిన కొన్ని సంవత్సరాలుగా బడ్జెట్‌లో విదేశీ వ్యవహారాల శాఖకు మెరుగయిన కేటాయింపులు ఉంటున్నాయి, సందేహం లేదు. అయితే ప్రభుత్వం వక్కాణించే విశ్వగురువు ప్రచారానికి అనుగుణంగా కేటాయింపులు లేవు. ప్రపంచవ్యాప్తంగా దేశ ప్రతిష్ఠను చాటాలనుకుంటున్న ప్రభుత్వం తన మొత్తం బడ్జెట్‌లో కనీసం అర శాతం కేటాయింపులు కూడ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చేయలేదు.

ఈ కీలక శాఖకు 2025–26 బడ్జెట్‌లో రూ. 20,516 కోట్లు కేటాయించగా 2024–25 సవరించిన బడ్జెట్‌లో నిధుల కేటాయింపు రూ. 25,277 కోట్లు. అంటే ఈ సారి రూ. 4,761 కోట్ల కోత విధించారు! వ్యూహాత్మక మిత్ర దేశాలలో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ఉద్దేశించిన కేటాయింపులు ఏటా నిరాశా జనకంగా ఉంటున్నాయి. ఈ సారీ అదే పరిస్థితి. శ్రీలంకకు రూ.300 కోట్లు, నేపాల్‌కు రూ. 700 కోట్లు, బంగ్లాదేశ్‌కు రూ. 120 కోట్లు కేటాయించారు. అదే విధంగా ఆఫ్ఘానిస్థాన్‌కు రూ. 100 కోట్లు, ఇరాన్–ఆఫ్ఘానిస్తాన్ సరిహద్దులోని చాబహార్ రేవు కేంద్రానికి రూ.100 కోట్ల కేటాయింపు జరిగింది. ప్రస్తుతం ఆఫ్ఘానిస్తాన్‌లోని తాలిబాన్ పాలకులకు పాకిస్థాన్ సర్కారుకు పడడం లేదు. పైగా ఇటీవల దుబాయిలో ఆఫ్ఘాన్ విదేశాంగ మంత్రితో భారత్ విదేశీ వ్యవహారాల కార్యదర్శి సమావేశమైన తర్వాత కూడ ఆ దేశానికి రూ. 100 కోట్లు మాత్రమే కేటాయించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. భారత్‌కు అన్ని విధాలుగా సహకరించే భూటాన్‌కు రూ. 2150 కోట్లతో విదేశీ సహాయంలో సింహభాగం ఆ కీలక హిమాలయ రాజ్యానికి కేటాయించడం ముదావహం. భూటాన్‌లో జలవిద్యుదుత్పత్తి, ఇతరత్రా అభివృద్ధి కార్యక్రమాలకు భారత్ నిర్మాణాత్మకంగా సహాయం అందిస్తుంది.

ఆధునికీకరణలో భాగంగా, పాస్‌పోర్టుల జారీలో విప్లవాత్మక మార్పులను సర్కారు అమలు చేస్తోంది. ఆధార్ కార్డుతో అనుసంధానం చేస్తూ ఎలక్ట్రానిక్ చిప్‌తో కూడిన పాస్ పోర్టులు జారీ చేస్తున్నారు. ఈ దృష్ట్యా పాస్‌పోర్టులు, ఇమ్మిగ్రేషన్ కొరకు ఈ సారి రూ. 1,913 కోట్లు కేటాయించారు. విదేశాలలోని భారతీయ ఎంబసీల నిర్వహణకు ఈ సారి 4,206 కోట్లు కేటాయించారు. గత ఏడాది కేటాయింపుల (రూ.3969 కోట్లు) కంటే అధికమైనా రూపాయి విలువ పతనమైన విషయాన్ని మరిచిపోకూడదు. పైగా ప్రవాసులు నానా ఇబ్బందులు ఎదుర్కొనే కీలక గల్ఫ్ దేశాలలో భారతీయుల సహాయార్థం అదనపు సిబ్బంది నియామకాలకు అవసరమైన నిధులు కేటాయించలేదు. గల్ఫ్‌లో ఏ దేశంలోనైనా న్యాయస్థానానికి వెళ్ళి భారతీయులకు సహకరించే దౌత్య ఉద్యోగులకుగాను ఒక్క వాహనం కొనుగోలుకు సైతం నిధులు కేటాయించలేదు. బడ్జెటులో విదేశాలలో ఇబ్బందులు ఎదుర్కొనే మహిళలకు సహాయ కార్యక్రమాల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించినా వాటికి కనీసం ఒక కోటి రూపాయలు సైతం ఇవ్వలేదు.

విశ్వగురువు, వికసిత్ భారత్ ఆశయాలకు అనుగుణంగా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు నిధుల కేటాయింపు సమృద్ధిగా ఉంటేనే ప్రపంచ వ్యాప్తంగా భారత్ వ్యూహాత్మక ప్రయోజనాలు నెరవేరుతాయి. దేశ ప్రతిష్ఠ పెరుగుతుంది.

■ **మొహమ్మద్ ఇర్ఫాన్**
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

పన్ను రాయితీలతో ఆర్థికాభ్యుదయమా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

పాత పార్లమెంట్ భవనంలోని రీడింగ్ రూమ్ పై భాగంలో వివిధ సంస్థానాధీశుల రాచరిక చిహ్నాలు కనపడతాయి. స్వాతంత్ర్యం రాకముందు ఈ రీడింగ్ రూమ్ సంస్థానాధీశుల ఛాంబర్‌గా ఉండేది. రాజులు పోయారు, రాచరిక చిహ్నాలు పోయాయి. స్వాతంత్ర్యం తర్వాత సామాన్యులు పార్లమెంట్‌లో ప్రవేశించడం ప్రారంభమైంది. పుచ్చలపల్లి సుందరయ్య లాంటి నేతలు సైకిల్‌పై కూడా పార్లమెంట్‌కు వచ్చేవారు. మరి ప్రస్తుత పరిస్థితులు ఎలా ఉన్నాయి? సంస్థానాధీశులకు బదులు ఇప్పుడు కోట్లకు పడగెత్తినవారు పార్లమెంట్‌లో ప్రవేశిస్తున్నారు. తెలుగుదేశం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు సైకిల్‌పై పార్లమెంట్‌కు వస్తే అది ఒక అరుదైన దృశ్యంలా కనిపిస్తోంది. అసలు సంపన్నులు కాని వారు పార్లమెంట్ సభ్యులు కావడం అరుదుగా మారింది. 18వ లోక్‌సభలో 93 శాతం మంది ఎంపీలు కోటీశ్వరులైతే, కోటీశ్వరులు కానివారు పార్లమెంట్‌కు రావడం అసాధ్యమని అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ సంస్థ తెలిపింది. రూ.10 కోట్లకు పైగా ఆస్తులు సంపాదించిన ఎంపీలు 42 శాతం మంది ఉన్నారు. లోక్‌సభ పరిస్థితి ఈ విధంగా ఉంటే, రాజ్యసభలో సంపన్నులు కానివారు ప్రవేశించడం అతి కష్టంగా మారింది. మొత్తం రాజ్యసభ సభ్యుల ఆస్తుల సగటు విలువ రూ.87 కోట్లు దాటితే బీజేపీకి చెందిన 90 మంది రాజ్యసభ ఎంపీల ఆస్తుల విలువ రూ.37 కోట్లకు పైగా ఉంటుంది. పట్టణాల్లో నివసించేవారి సగటు ఆస్తుల విలువ కంటే ఎంపీల ఆస్తులు 27 రెట్లు ఎక్కువ ఉంటుందని ఒక అధ్యయనం పేర్కొంది.

భారతదేశంలో సంపన్నులూ–మధ్యతరగతికీ మధ్య సంపద విషయంలో వ్యత్యాసం చట్టసభల్లోనే స్పష్టంగా కనబడుతుంది. ఒకప్పుడు కేవలం రూ. 10 కోట్లతోనే దేశం మొత్తం ఎన్నికలు జరిగేవి. ఇప్పుడు వేల కోట్లు ఎన్నికల్లో ప్రవహిస్తున్నాయి. సంపన్నులకు అన్ని రకాల రాయితీలు, లక్షల కోట్ల రుణాలు, ప్యాకేజీలు, నల్లధనం పెంచుకునేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. వారు ఎన్నికలను ప్రభావితం చేసేందుకు, చట్టసభల్లో ప్రవేశించేందుకు దోహదం చేస్తుంటే, సామాన్యులను శాంతింపచేసేందుకు రేషన్‌తో పాటు రకరకాల ఉచితాలు, పథకాలు, మహిళా సమ్మాన్ యోజన వంటి తాయిలాలు ప్రకటిస్తున్నారు. ఇదీ మన దేశ రాజకీయాల్లో పరిఢవిల్లుతున్న ప్రజాస్వామ్యం!

కేవలం సైద్ధాంతిక నిర్ణయాల ద్వారా భావోద్వేగాలను రేకెత్తించి మధ్యతరగతిని ఆకట్టుకోవడం సాధ్యపడదని బీజేపీ గ్రహించినట్లు కనిపిస్తోంది. ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వ చట్టం, రామమందిర నిర్మాణం వంటివి ఎన్ని జరిగినా 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి అంతగా ప్రయోజనం కలగలేదు. ఏమీ ఖర్చుపెట్టకుండానే, రకరకాల పన్నుల ద్వారా వారి జేబులకు కత్తెర వేస్తూ, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ, నిత్యావసర వస్తువులు ఆకాశానికి పెరిగిపోయినా విస్మరిస్తూ ఉంటే మధ్యతరగతి ఎంతకాలం మౌనం పాటిస్తారు? మెజారిటీ జీఎస్టీ వసూళ్లు మధ్యతరగతి నుంచే లభిస్తున్నాయని ఒక అంచనా. స్కూలు ఫీజుల్లో కూడా జీఎస్టీ వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. కార్పొరేట్లు చెల్లించే పన్నులకంటే వ్యక్తిగత పన్నుల వసూళ్లు దాదాపు రూ. 2లక్షల కోట్లు ఎక్కువ. వ్యక్తిగత పన్నుల వసూళ్లు 19 శాతం పెరిగితే కార్పొరేట్ పన్ను వసూళ్లు 7 శాతమే పెరిగాయి. ఇందుకు కారణం ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలే. ఉదాహరణకు 2019 సెప్టెంబర్‌లో కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించారు. బ్యాంకులకు లక్షల కోట్లు ఎగ్గొట్టిన సంపన్నులను ఏమీ చేయడం లేదనే ఒక అభిప్రాయం నెలకొని ఉన్నది. కార్పొరేట్లు తాము ఆర్జించిన మొత్తాన్ని పెట్టుబడులు పెడతారని, ఉద్యోగాలు కల్పిస్తారని ప్రభుత్వం ఆశించింది కాని అది జరగలేదు సరికదా. వారు తమ ఖజానాలు నింపుకున్నారు. గత దశాబ్దంలో తీవ్రమైన ద్రవ్యోల్బణం రీత్యా మధ్యతరగతి తమ ఆదాయాలు పెరగకపోవడాన్ని గమనించారు. వచ్చిన డబ్బులన్నీ మళ్లీ ఏదో రూపేణా లాగేసుకుంటున్నట్లు వారు గమనించారు.

బహుశా అన్ని విధాల నష్టపోతున్నది మధ్యతరగతి వారేనన్న అభిప్రాయం గత కొద్ది సంవత్సరాలుగా నెలకొని ఉన్నది. ఆ మధ్యతరగతిని శాంతింపచేయడం కోసమే రెండు రోజుల క్రితం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు స్పష్టమవుతోంది. పార్లమెంట్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశంలోని మధ్యతరగతి ఆకాంక్షలను నెరవేర్చినప్పుడే ఆర్థిక ప్రగతి సుసాధ్యమవుతుందని ప్రకటించారు. 'ఈ దేశ మధ్యతరగతి ప్రజలు, పేదలకు లక్ష్మీదేవి ఆశీర్వాదం లభిస్తుందని ఆశిస్తున్నాను..' అని బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజే మోదీ మీడియాతో అన్నారు.

బీజేపీ పట్ల మధ్యతరగతిలో ఒక రకమైన ఉదాసీనత పెరుగుతూ వస్తోంది. ఈ విషయం గ్రహించినందువల్లే బీజేపీ తన మార్గాన్ని మార్చుకుంది. ఒకప్పుడు ఉచితాలను వ్యతిరేకించిన మోదీ రాష్ట్రాల ఎన్నికల్లో ఉచితాలను ప్రకటించడానికి అనుమతించారు. ఇప్పుడు మధ్యతరగతిని కూడా ఆకట్టుకోవడం తప్పనిసరి అని బీజేపీ గ్రహించింది. ఢిల్లీ ఎన్నికలను మాత్రమే కాదు, రాబోయే ఎన్నికలను కూడా దృష్టిలో ఉంచుకుని దేశ వ్యాప్తంగా తన ఆర్థిక విధానాలపై అభిప్రాయాన్ని మార్చేందుకు మోదీ ప్రయత్నాలు ప్రారంభించినట్లు స్పష్టమవుతోంది. 'నేను కూడా మనిషిని. తప్పులు చేయడం సహజం. నేనేమీ దేవుడిని కాదు..' అని జనవరి మొదటి వారంలో ఒక పాడ్‌కాస్ట్‌లో నరేంద్రమోదీ అనడంలో అంతరార్థం ఆయన తదుపరి చర్యల్లో కనపడుతోంది. గత పదేళ్లుగా లేని ఆదాయ పన్ను మినహాయింపులను ప్రకటించడం ఇందుకు నిదర్శనం. మొత్తానికి మోదీ, ఆయన బృందం తమ తప్పులు సరిదిద్దుకోవడానికి పెద్దగా సమయం తీసుకోరని, రాజకీయంగా పట్టుకోల్పోకుండా చూడడమే వారి ప్రధాన లక్ష్యమని స్పష్టంగా అర్థమవుతుంది. అందుకే గిగ్ వర్కర్లతో సహా తమ ఓటు బ్యాంకుతో ముడిపడి ఉన్న పలు వర్గాలను సంతృప్తిపరిచేందుకు త్వరితంగా చర్యలు చేపట్టేందుకు ప్రయత్నించింది. ఒక్క బీమా రంగంలో వంద శాతం పెట్టుబడులను అనుమతించడం తప్ప ఏ రంగంలోనూ విధానపరమైన మార్పులు చేయలేదు. అభివృద్ధి పగ్గాలను ప్రైవేట్ రంగానికి అప్పగించాలని ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు తయారు చేసిన ఆర్థిక సర్వే చెప్పినప్పటికీ ప్రభుత్వం బడ్జెట్‌లో మాత్రం ఆచితూచి చర్యలు తీసుకుంది. ఈ సారి పన్ను చెల్లించేవారికి రాయితీలు కల్పించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టంగా చెప్పారని ఫైనాన్స్ సెక్రటరీ తెలిపారు.

భారతదేశంలో మధ్యతరగతి జనాభా రోజురోజుకూ పెరుగుతుందని ఒక అంచనా. జనాభాలో 31 శాతం మధ్య తరగతి వారే కాగా వారి సంఖ్య 2031 నాటికి 38 శాతం, 2047 నాటికి 70శాతానికి చేరుకుంటుందని, దాదాపు వంద కోట్ల మేరకు మధ్యతరగతి ప్రజలే ఉంటారని పీపుల్ రీసర్చ్ ఆన్ ఇండియన్ ఎకానమీ (ప్రైస్) వంటి సంస్థలు చెబుతున్నాయి. అందుకే పాశ్చాత్య బహుళ జాతి సంస్థల యజమానులు ప్రధానంగా ఎఫ్ఎంసిజి రంగానికి చెందిన వారి దృష్టి భారతదేశంపై పడుతోంది. 2019 ఎన్నికలతో పోలిస్తే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నష్టపోవడానికి కారణం మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ఓటర్లు బీజేపీకి దూరం కావడమేనని లోక్‌నీతి– సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సిఎస్‌డిఎస్) ఎన్నికల అనంతరం నిర్వహించిన సర్వేలో తేల్చింది. తక్కువ ఆదాయవర్గాలవారు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని, మధ్యతరగతి వర్గాల ఆదాయం పెరుగుతున్న కొద్దీ వారు బీజేపీకి ఎడం అవుతున్నారని ఈ సర్వే పేర్కొంది. మధ్యతరగతి ఓట్లలో మొత్తంగా 3 శాతం తగ్గినప్పటికీ లోక్‌సభలో మెజారిటీ సాధించలేకపోయింది. బీజేపీ పట్ల బలంగా ఉన్న 11 శాతం మధ్యతరగతి ఓటు దూరమైతే ఆ పార్టీ సమస్యలో పడుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2004లో మధ్యతరగతి ఓట్లు దూరమైనందు వలన అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వం ఓడిపోయిందని వారి అభిప్రాయం.

అయితే పన్ను మినహాయింపులు ప్రకటించినంత మాత్రాన మధ్యతరగతి సంతృప్తి చెందుతుందా అన్న ప్రశ్నకు జవాబు చెప్పలేము. 2024లో దేశంలో కేవలం 8.6 కోట్ల మంది మాత్రమే ఆదాయపన్నును చెల్లించారు. అయినప్పటికీ ప్రభుత్వం మధ్యతరగతి వర్గాలకు అనుకూలంగా మారిందనే అభిప్రాయం ఏర్పర్చేందుకు ఈ చర్య ఉపయోగపడింది.. అనేకమంది పేదలు మధ్యతరగతి వర్గానికి మారుతున్నారని, అందువల్ల మధ్యతరగతిని సంతోషపెట్టే చర్యలు తీసుకోవడం సరైనదేనని తెలుగుదేశం అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బడ్జెట్‌పై ఢిల్లీలో వ్యాఖ్యానిస్తూ అన్నారు. అయితే అత్యధిక సంపన్నులు అట్టడుగు వర్గాలకు చేయూతనిచ్చే మార్గాలపై చర్చ జరగాలని, జీఎస్టీని సరళీకృతం చేయాలని ఆయన సూచించారు. అదే సమయంలో సంపద సృష్టించకుండా సంపదను పంచిపెట్టే విధానాలపై చర్చించాలని ఆయన కోరారు. ఎన్డీఏలో కీలక భాగస్వామి అయిన చంద్రబాబు సూచనలను ఎన్డీఏ ప్రభుత్వం సానుకూలంగా పట్టించుకునే అవకాశాలు లేకపోలేదు.

అదే సమయంలో దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న నిరుద్యోగం, ఆదాయ అసమానతలు, శ్రామిక శ్రేణుల్లో నవీన నైపుణ్యాలు కొరవడడం వంటివాటిపై కూడా వాస్తవప్రాతిపదికన ఒక రోడ్ మ్యాప్ (మార్గదర్శక ప్రణాళిక) రూపొందించాల్సిన అవసరం ఉన్నది. చట్టసభల్లో సామాన్యులు, మధ్యతరగతివారు ప్రవేశించేందుకు తగిన రాజ్యాంగ సంస్కరణలు తీసుకురావాల్సిన ఆవశ్యకత కూడా స్పష్టంగా కనిపిస్తోంది. బిలియనీర్ల సంఖ్య పెరిగిపోతోంది. చట్టసభల్లో సంపన్నుల సంఖ్య సైతం అధికమవుతోంది. ఈ పరిణామాలు వ్యవస్థలకూ ప్రజలకూ మధ్య అంతరాలకు సూచికలు కావా? కేవలం పన్ను రాయితీలు, మినహాయింపులతో ఈ అగాధాలను అధిగమించగలుగుతామా?



బిలియనీర్ల సంఖ్య పెరిగిపోతోంది. చట్టసభల్లో సంపన్నుల సంఖ్య సైతం అధికమవుతోంది. ఈ పరిణామాలు వ్యవస్థలకూ ప్రజలకూ మధ్య అంతరాలకు సంకేతాలు కావా? కేవలం పన్ను మినహాయింపులతో ఈ అగాధాలను అధిగమించగలుగుతామా?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

గోవా విమోచనలో రేడియో యోధురాలు

ఈ ఏడాది రిపబ్లిక్ డే సందర్భంగా ప్రకటించిన 139 మంది పద్మవిజేతలలో లిబియా లోబో సర్దేశాయి ఉండడంతో మళ్లీ గోవా విముక్తి పోరాటానికి దన్నుగా నిలిచిన సీక్రెట్ రేడియో 'వాయిస్ ఆఫ్ ఫ్రీడమ్' వార్తల్లోకి వచ్చింది. 2024 మే 25న తన నూరవ పుట్టినరోజును గోవా రాజధాని పనాజీ నగరంలో జరుపుకున్న అపురూప వనిత లిబియా లోబో. గోవాలో ప్రాక్టీస్ చేసిన తొలి లాయరు మాత్రమే కాదు; స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గోవా, దమన్, దయ్యు కేంద్రపాలిత ప్రాంతానికి టూరిజం డైరెక్టరుగా కూడా ఆమె సేవలందించారు. అంతేకాదు గోవా కాలేజ్ ఆఫ్ హోమ్ సైన్స్‌ను ప్రారంభించారు. ఆమె విలక్షణంగా నెలకొల్పిన గోవా ఉమెన్ కోఆపరేటివ్ బ్యాంక్ ఇప్పటికీ కేవలం మహిళా ఉద్యోగులతో దిగ్విజయంగా నడుస్తోంది. Voz da Liberdabe అని పోర్చుగీసు భాషలో, Goenche SodvonechoAwaz పేరుతో కొంకణి భాషలో ప్రసారాలు చేసిన సీక్రెట్ రేడియో చరిత్ర అద్వితీయం.

1961 డిసెంబరు 19న గోవాకు స్వేచ్ఛ సిద్ధించిన వేళ అత్యంత ఆశ్చర్యమనిపించే సంఘటన జరిగింది. లిబియా లోబో, వామన్ సర్దేశాయి ఇద్దరూ విమానానికి రేడియో ట్రాన్స్‌మీటర్ బిగించి, ఇంకో లౌడ్ స్పీకర్ అమర్చి, పూలూ కరపత్రాలూ చల్లుతూ, గోవా స్వాతంత్ర్యాన్ని ప్రకటిస్తూ ఒక రెండు గంటలపాటు ఆకాశయాన ప్రసారం చేశారు! 1955 నవంబరు 25న వారి ఆధ్వర్యంలో మొదలైన సీక్రెట్ రేడియో 'వాయిస్ ఆఫ్ ఫ్రీడమ్' గోవాకు స్వాతంత్ర్యం లభించిన రోజు ఇలా విజయోత్సవంలో పాల్గొని, ఆ తర్వాత ప్రసారాలు ఆపివేసి విలువైన చరిత్రగా మారిపోయింది.

1510లో గోవా ప్రాంతం పోర్చుగీసు స్థావరంగా మారిపోయింది. బ్రిటీషువారు భారతదేశపు చాలా భాగాలు ఆక్రమించినా పాండిచ్చేరి ఫ్రెంచి వారి చేతిలోకి వెళ్ళిపోయినట్టు గోవా, డయ్యు, డమన్ పోర్చుగీసు చేతిలో ఉండిపోయాయి. గోవాకూ, మిగతా భారతదేశానికి పెద్దగా సంపర్కం లేకుండా సాగిపోయింది. 1932లో గోవా గవర్నర్‌గా యాంటోనియో డి ఒలివీరా సలాజార్ వచ్చిన తర్వాత ఆంక్షలు పెరగడం, ప్రజల హక్కులు హరించడం మొదలైంది. భారత్–పోర్చుగల్ సంబంధాలు రెండవ ప్రపంచ యుద్ధం అనంతర పరిణామాల మీద ఆధారపడి బెడిసికొట్టాయి. 1940వ దశకం నుంచి స్వాతంత్ర్య పోరాటం గురించి ఆలోచనలు, ప్రయత్నాలు మొదలయ్యాయి. 1954లో దాద్రానగర్, హవేలీ విముక్తి పొందడం కొత్త ఆలోచనలకు ద్వారాలు తీసింది. 1954లో గోవాకు విముక్తి కావాలని సరిహద్దు ప్రాంతంలో శాంతియుతంగా ప్రవేశించిన సత్యాగ్రహులను అప్పటి పోర్చుగీస్ క్రూరంగా చంపివేసింది. దాంతో 1955లో భారత ప్రభుత్వం 'ఎకనమిక్ బ్లాకేడ్' ప్రకటించాల్సి వచ్చింది. దీని ఫలితంగా గోవా బంగాళదుంపలను నెదర్లాండ్ నుంచి; కూరలు, బియ్యాన్ని పాకిస్తాన్ నుంచి, టీని శ్రీలంక నుంచి, వైన్‌ను పోర్చుగీసు నుంచి; సిమెంటును జపాన్ నుంచి; ఉక్కును బెల్జియం నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితి ఏర్పడింది. 1961లో చేపలు పట్టే భారతీయుల పడవలపై గోవా కాల్పులకు దిగడంతో పరిస్థితి తారాస్థాయికి చేరింది.

గోవా లిబరేషన్ కోసం బొంబాయి నుంచి రహస్యంగా పోరాడుతున్న నికోలోవ్ మేనెంజీస్, వామన్ సర్దేశాయి, లిబియా లోబో కలసి రెండు వైర్లెస్ రేడియో సెట్లతో రేడియో ట్రాన్స్‌మిటర్‌ను సిద్ధం చేశారు. 1955 నవంబరు 25న ఉదయం 7 గం.లకు 'వాయిస్ ఆఫ్ ఫ్రీడమ్' అనే సీక్రెట్ రేడియోను వంద కిలోమీటర్ల దూరంలో ఉండే అంబోలి (Amboli) అడవుల నుంచి ప్రారంభించారు. తర్వాత మేనెంజీస్ ఆ బృందం నుంచి వెళ్లిపోవడంతో ప్రసారాలు 50 కిలోమీటర్లు దూరంలో ఉండే కన్నడ ప్రాంతం క్యాజువల్ రాక్‌కు మారాయి. ట్రాన్స్‌మీటర్‌ను ఒక ట్రక్కుకు బిగించి ప్రసారాలు చేసేవారు. గోవా అధికారికంగా చేసే ప్రాపగాండాను వమ్ము చేస్తూ నడిచిన ఈ సీక్రెట్ రేడియో ప్రసారాలకు భారతదేశంతోపాటు ఇతర దేశాల నుంచి కూడా మద్దతు లభించేది. ఆసియా, ఆఫ్రికా ఖండాలలో వలస పాలనకు వ్యతిరేకంగా నడిచే ఉద్యమాల వార్తలను కూడా ఇచ్చేవారు. ఈ విషయంలో గోవా ఒంటరి కాదనే భావం కలిగించి, ధైర్యం నూరిపోయడానికి వారి వార్తల పరిధిని పెంచారు. ఈ రేడియో ఇండియా భూభాగం నుంచి ప్రసారం అయ్యేది కనుక గోవాలో జరిగే పోరాటానికి మద్దతు ఇస్తూ భారతీయ నాయకుల ప్రసంగాలు కూడా ప్రసారం చేశారు. 1956 జూలై 15న వినోబాభావే తన రేడియో ప్రసంగంలో శాంతియుతంగా గోవాను వదిలి వెళ్ళిపొమ్మని పోర్చుగీసు వారిని కోరారు. భారత పార్లమెంటులో, ఇతర దేశాలలో ఈ విషయంపై జరిగే చర్చల సారాంశాలను కూడా శ్రోతలకు ఎప్పటికప్పుడు అందించేవారు.

1961 డిసెంబరులో ఆపరేషన్ విజయ్ మొదలయ్యాక 'వాయిస్ ఆఫ్ ఫ్రీడమ్' బృందం అడవుల నుంచి బెల్గాం ప్రాంతానికి వచ్చింది. ఆ సమయం నుంచి ప్రతి గంటకూ ప్రసారాలు చేశారు. గోవా ఆర్మీని ఉద్దేశించి భారత రక్షణమంత్రి వి.కె. కృష్ణ మీనన్ 1961 డిసెంబరు 15న ఈ సీక్రెట్ రేడియోలో ప్రసంగిస్తూ చర్చలకు ఆహ్వానించారు. భారత సైన్యం లోపలికే రాకుండా గోవా ఆర్మీ డిసెంబరు 17న బ్రిడ్జిని కూల్చివేసింది. సుమారు 36 గంటలు వాయు, సముద్ర, భూ తలాలపై కూడా భీకర పోరాటం నడిచింది. తర్వాత డిసెంబరు 19న గోవా ప్రాంతం భారత భూభాగంలో కలసిపోయింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విమానం నుంచి 'వాయిస్ ఆఫ్ ఫ్రీడమ్' రేడియో బృందం గోవా విముక్తి వార్తను ఆకాశ మార్గం గుండా ప్రకటించింది.

1924 మే 25న పనాజీ నగరానికి దగ్గరలో ఉన్న పొర్వోరి గ్రామంలో లిబియా లోబో జన్మించింది. ఆమె కుటుంబం బొంబాయి తరలి వెళ్ళింది. అంబేద్కర్ ప్రారంభించిన సిద్ధార్థ కళాశాల నుంచి డిగ్రీ పొందిన లిబియా లోబో రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఇటలీకి చెందిన కారాగారవాసుల ఉత్తరాలను చదివి పరిష్కరించేవారు. ఆల్ ఇండియా రేడియో, బొంబాయి కేంద్రంలో స్టెనోగానూ, లైబ్రేరియన్‌గాను సేవలందించిన ఆమెకు కవి నిజీమ్ ఎజ్కిల్ ద్వారా ఎం.ఎన్.రాయ్ పరిచయమవడం విశేషం. గోవా విమోచన మూడవ వార్షికోత్సవం అంటే 1964 డిసెంబర్ 19న వామన్ సర్దేశాయి, లిబియా లోబో వివాహం చేసుకున్నారు. వామన్ సర్దేశాయ్ 1992లో పద్మశ్రీ పొందగా, లిబియా లోబో 2025లో ఆ అవార్డు పొందారు. 1994లో వామన్ సర్దేశాయి మరణించిన తర్వాత ఆయన పేరిట పేదలకు చేయూత నిస్తూ వేదాంత ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించిన లిబియా లోబో ప్రస్తుతం పనాజీలో ఉంటున్నారు.

1961 డిసెంబరు 19న గోవాకు స్వేచ్ఛ సిద్ధించిన వేళ అత్యంత ఆశ్చర్యమనిపించే సంఘటన జరిగింది. లిబియా లోబో, వామన్ సర్దేశాయి ఇద్దరూ విమానానికి రేడియో ట్రాన్స్‌మీటర్ బిగించి, ఇంకో లౌడ్ స్పీకర్ అమర్చి, పూలూ కరపత్రాలూ చల్లుతూ గోవా స్వాతంత్ర్యాన్ని ప్రకటిస్తూ రెండు గంటలపాటు ఆకాశయాన ప్రసారం చేశారు. 1955 నవంబరు 25న వారి ఆధ్వర్యంలో మొదలైన సీక్రెట్ రేడియో 'వాయిస్ ఆఫ్ ఫ్రీడమ్' గోవాకు స్వాతంత్ర్యం లభించిన రోజున విజయోత్సవంలో పాల్గొని, ఆ తర్వాత ప్రసారాలు ఆపివేసి విలువైన చరిత్రగా నిలిచింది.



■ **డా. నాగసూరి వేణుగోపాల్**

చిరస్మరణీయులు
డా. చెరియన్

హృద్రోగ శస్త్రచికిత్సా రంగంలో జాతీయ, అంతర్జాతీయంగా పేరొందిన వ్యక్తి డా. కె.ఎం.చెరియన్. 1975లో పెరంబూర్ (చెన్నై) రైల్వే ఆసుపత్రిలో దేశంలోని ప్రప్రథమంగా గుండె బైపాస్ శస్త్ర చికిత్స చేశారు. పసిపాపలకు, పిల్లలకు కష్టసాధ్యమైన శస్త్ర చికిత్సలు నిర్వహించారు. అనేక మంది ప్రాణాలను కాపాడడమే గాక, ఆ రంగంలో అనేక మందిని తయారు చేశారు. సాంకేతికంగా ఎన్నో కొత్త విధానాలను ఆవిష్కరించారు.

కొత్తూరుతు మామెన్ చెరియన్ 1942, ఆగస్టు 3న కేరళలోని అలప్పులాలో జన్మించారు. 1964లో ఎంబీబీఎస్, మంగుళూరులోని కస్తూర్బా మెడికల్ కాలేజీలో 1970లో ఎంఎస్ చేశారు. వెల్లూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజీలో సర్జరీ లెక్చరర్‌గా పనిచేశారు. ఆస్ట్రేలియా వెళ్లి 1973లో కార్డియోథొరాసిక్ సర్జరీలో శిక్షణ పొంది ఎఫ్ఆర్ఏసిఎస్ డిగ్రీ పొందారు. న్యూజిలాండ్‌లోనూ పనిచేశారు. విద్య పూర్తిచేసుకున్నాక అమెరికాలోని బర్మింగ్‌హాం (అలబామా) లోను, ఒరెగాన్ విశ్వవిద్యాలయంలోను ప్రముఖ సర్జన్ల వద్ద శిక్షణ పొందారు.



ఫ్రాంటియర్ లైఫ్‌లైన్ ఆస్పత్రిని స్థాపించి 1995లో మన దేశంలోనే రెండవ గుండె మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించారు. దేశంలో ప్రథమంగా చిన్న పిల్లల్లో గుండె శస్త్ర చికిత్సను, గుండె–ఊపిరితిత్తుల మార్పిడి శస్త్ర చికిత్సను చేశారు. 1992లో డా. చెరియన్ ఫిజిషియన్ అసిస్టెంట్లకు శిక్షణనిచ్చారు.

కేంద్ర ప్రభుత్వం 1991లో డా. చెరియన్‌కు పద్మశ్రీ అవార్డును బహూకరించింది. 1990–93 సంవత్సరాల్లో భారత రాష్ట్రపతి గౌరవ సర్జన్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. 2005లో హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో చెరియన్‌ను 'మెడికల్ ఎక్సలెన్స్' అవార్డుతో సత్కరించారు. 2008లో గ్రీస్‌లో జరిగిన అంతర్జాతీయ కార్డియో థొరాసిక్ సర్జన్స్ సమావేశం సందర్భంగా ముగ్గురు భారతీయ సర్జన్ల పేర్లను రాతిపై చెక్కారు, అందులో చెరియన్ ఒకరు. 2010లో అంతర్జాతీయ కార్డియోథొరాసిక్ సొసైటీ అధ్యక్షునిగా ఎన్నికైన తొలి భారతీయుడు ఆయన.

చెన్నైలోని మద్రాస్ మెడికల్ మిషన్ (ఎం.ఎం.ఎం.) ఆసుపత్రి వ్యవస్థాపక డైరెక్టర్‌గా పనిచేశారు. కేరళలోని 'పరుమల'లో చెరియన్ ధార్మిక సంస్థ పెద్ద హృద్రోగ కేంద్రాన్ని, అంతర్జాతీయ స్థాయిలో సీబీఎస్ఈ స్కూలును నడుపుతున్నది. చెన్నై గన్నూరులో 2021లో అధునాతన పరికరాలతో కె.ఎం. చెరియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆస్పత్రిని నిర్మించారు. వీరి కుమారుడు సంజయ్ చెరియన్ తండ్రి అడుగుజాడల్లో హృద్రోగ శస్త్రచికిత్సా నిపుణునిగా సేవలందిస్తున్నారు. జనవరి 25న బెంగుళూరులో మృతి చెందిన డా. చెరియన్ భారత ప్రజలకు, వైద్యులకు గర్వకారణమైన వ్యక్తి, చిరస్మరణీయులు.

–డా. పాటిబండ్ల దక్షిణామూర్తి, సీనియర్ ఫిజిషియన్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
బుధవారం 5 ఫిబ్రవరి 2025


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

ప్రభుత్వ ఆస్పత్రులకు నిరంతర విద్యుత్ ఇవ్వాలి

- అధికారులను ఆదేశించిన వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవిలో ప్రభుత్వ ఆస్పత్రులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. మంగళవారం వరంగల్ కలెక్టరేట్‌లో ఎన్‌పీడీసీఎల్, ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎంజీఎంలో జనరేటర్లను ఎప్పటికప్పుడు ఆటోమోడ్‌లో ఉంచుతూ సక్రమంగా పనిచేసే విధంగా పర్యవేక్షించాలన్నారు. సీకేఎం ప్రసూతి ఆస్పత్రి, ప్రాంతీయ కంటి ఆస్పత్రులలో జనరేటర్లు నిత్యం పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో జనరేటర్ల ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ మధుసూదన్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు, పర్యవేక్షకులు కిశోర్, పద్మావతి, ఆర్ఎంవోలు మురళి, వంశీప్రియ, సత్యజిత్‌రే తదితరులు పాల్గొన్నారు.



కొత్త లైన్లకు రెడ్ సిగ్నల్

కేటాయింపులకు నోచుకోనివి..

- డోర్నకల్-మిర్యాలగూడ, డోర్నకల్- గద్వాల్ వరకు కొత్త లైన్లు
- హసన్‌పర్తి- కరీంనగర్ మధ్య 62కి.మీల లైన్
- రామగుండం నుంచి భూపాలపల్లి, రామప్ప, మేడారం మీదుగా మణుగూరు వరకు కోల్‌రైల్
- కాజీపేట-భూపాలపల్లి నూతన మార్గం
- కాజీపేట- సికింద్రాబాద్ మూడో లైన్ నిర్మాణం

'అమృత్'కు ఎంపికైన స్టేషన్లు.. | కాజీపేట, వరంగల్, జనగామ, మహబూబాబాద్

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తద్వారా ఇక్కడ మల్టిపుల్ రైల్వే మ్యాను ఫాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభించనున్నారు.

- రైల్వే బడ్జెట్‌లో పట్టాలెక్కని ఓరుగల్లు రైలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు కొత్త మార్గాల ఊసెత్తని కేంద్రం
- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి సానుకూలత
- అమృత్ స్టేషన్ పథకానికి పలు రైల్వేస్టేషన్ల ఎంపిక

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)


బడ్జెట్‌లో ఓరుగల్లు రైలుకు రెడ్‌సిగ్నలే ఎదురైంది. రైల్వేశాఖ కొత్త మార్గాల ఊసే ఎత్తలేదు. కాజీపేట, డోర్నకల్ జంక్షన్ల నుంచి పలు ప్రాంతాలకు కొత్త లైన్లతో పాటు కోల్ రైల్ కోసం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారనే ఆశలపై కేంద్రం నీళ్లు చల్లింది. డోర్నకల్ నుంచి మిర్యాలగూడ, డోర్నకల్ నుంచి గద్వాల్ వరకు నిర్మించాల్సిన కొత్త లైన్లపై ఎలాంటి ప్రకటన చేయలేదు. 62కిలోమీటర్ల హసన్‌పర్తి-కరీంనగర్ మార్గానికి రైల్వేబోర్డు క్లియరెన్స్ ఇవ్వకపోగా, కాజీపేట- భూపాలపల్లి, రామగుండం నుంచి భూపాలపల్లి, మేడారం మీదుగా మణుగూరు వరకు నిర్మించాలని ప్రతిపాదించిన కోల్ రైల్ ప్రాజెక్టుకు కూడా కేటాయింపులు చేయలేదు. దీంతో ఓరుగల్లువాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే కాజీపేటతో పాటు మరో నాలుగు రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు గాను అమృత్‌స్టేషన్ల పథకం కింద ఎంపిక చేయగా, రైల్వేకోచ్ ఫ్యాక్టరీకి సానుకూల ప్రకటన చేయటం కొంత ఊరటనిస్తోంది. అయితే అతికీలకమైన కాజీపేట టు సికింద్రాబాద్ మధ్య మూడో లైన్‌కు రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకపోవడంపై ప్రజల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

పెండింగ్‌లో పలు ప్రతిపాదనలు..

ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పలు ప్రాంతాలకు కొత్త రైల్వే లైన్ల కోసం చేసిన ప్రతిపాదనలు పెండింగ్‌లో పెట్టారు. గత శనివారం ప్రకటించిన బడ్జెట్‌తో అప్పటి వరకు రైల్వేశాఖపై ఓరుగల్లువాసులు పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. ప్రధానంగా సికింద్రాబాద్ నుంచి కాజీపేటకు మూడో లైన్ నిర్మించాలని 2018లోనే రైల్వేబోర్డుకు నివేదికలు వెళ్లాయి. ఈ లైన్‌కు మంత్రి వర్గం ఆమోదం కూడా ఇచ్చింది. అయితే ఈ బడ్జెట్‌లో మూడో లైన్‌కు నిధులు కేటాయింపులు లేకపోవటంపై ప్రయాణికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

అలాగే కాజీపేట(నష్కల్)- కరీంనగర్ మధ్య రూ.464కోట్ల అంచనా వ్యయంతో 62కి.మీ రైల్వేలైన్‌కు ప్రతిపాదనలు చేశారు. ఆ ఫైల్ కూడా రైల్వేబోర్డు వద్దే ఫైల్ పెండింగ్‌లో ఉందని, దాంతో గ్రీన్‌సిగ్నల్ రావటం లేదనే చర్చ జరుగుతోంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ లైన్ కోసం రైల్వేశాఖపై ఒత్తిడి తీసుకరావాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్ నుంచి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వరకు 105కి.మీ లైన్ కోసం రైల్వేశాఖ రూ.2,100కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు చేశారు. డోర్నకల్ నుంచి మహబూబాబాద్, ఖమ్మం జిల్లా ముదిగొండ, రాజేశ్వరపురం, నేలకొండపల్లి, కోదాడ

మిగతా 7వ పేజీలో...



కోల్ రైల్ కూత పెట్టేదెప్పుడో?

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైల్వే రూట్‌లేని జిల్లాలు భూపాలపల్లి, ములుగు మాత్రమే. ఈ రెండు జిల్లాలకు రైల్వేలైన్ లేకపోవటంతో కొత్త లైన్లను ఏర్పాటు చేసేందుకు కొన్ని దశాబ్దాలుగా కసరత్తు జరుగుతోంది. కోల్ కారిడార్‌గా రామగుండం నుంచి మణుగూరు వరకు రైల్వే లైన్ నిర్మాణం చేయాలని 2013-14లో నిర్ణయించారు. 2023-24లో రామగుండం నుంచి భూపాలపల్లి, రామప్ప, మేడారం మీదుగా మణుగూరు వరకు సుమారు రూ.4,100కోట్ల అంచనా వ్యయంతో 207కిలో మీటర్ల రైల్వేలైన్ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఇప్పటికే సర్వేల కోసం రెండు విడతల్లో రూ.15కోట్లు నిధులు బడ్జెట్‌లో కేటాయించారు. మట్టి సేకరణ, పరీక్షలు పూర్తి చేసిన అధికారులు, రూట్ మ్యాప్‌తో పాటు భూసేకరణ, స్టేషన్లు తదితర వాటితో డీపీఆర్ సిద్ధం చేశారు. ఈ లైన్ నిర్మాణం పూర్తయితే బొగ్గు రవాణాతో పాటు మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు రైల్ కనెక్టివిటీ పెరగనుంది. అలాగే మునెస్కో గుర్తింపు పొందిన రామప్పకు కూడా వచ్చే పర్యాటకులకు కూడా రైల్ సౌకర్యం ఏర్పడనుంది. ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు లేకపోవటంపై గిరిజనుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక కాజీపేట-భూపాలపల్లి మధ్య రైల్వేలైన్‌కు 2023-24 బడ్జెట్‌లో కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఫైనల్ లోకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్) కోసం రైల్వే శాఖ రూ.1,152కోట్ల నిధులు మంజూరు చేసింది. కాజీపేట నుంచి హసన్‌పర్తి లైన్ మీదుగా కరీంనగర్ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వే స్టేషన్ నుంచి రెండు కిలో మీటర్ల దూరంలోని మర్రిపల్లి గ్రామం వద్ద సైడ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. మర్రిపల్లి ట్రాక్ నుంచి చిట్యాల మండలం జడలపేట మీదుగా భూపాలపల్లి వరకు ఈ లైన్ నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ బడ్జెట్‌లో భూపాలపల్లికి రైల్వే కలసాకారం అవుతుందని భావించనప్పటికి నిరాశే మిగిలింది. దీంతో గిరిజన జిల్లాలైన ములుగు, భూపాలపల్లిలకు రైల్‌కనెక్టీవిటి కలగానే మిగిలి పోతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

గ్రామాభివృద్ధిలో 'ఉపాధి' సిబ్బంది సేవలు కీలకం

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- ఘనంగా ఈజీఎస్ పథకం ఆవిర్భావ దినోత్సవం


ఈజీఎస్ ఆవిర్భావ సభలో మాట్లాడుతున్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హసన్‌పర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి అభివృద్ధిలో ఉపాధి హామీ సిబ్బంది పాత్ర కీలకమని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. మండల కేంద్రంలోని సంస్కృతి విహార్ టీటీడీసీ సమావేశ మందిరంలో మంగళవారం డీఆర్‌డీఏ, ఎంపీడీవోల సంయుక్త ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రావీణ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. గ్రామ అవసరాలను గుర్తించి ప్రాధాన్యత పనులు చేపట్టడం ద్వారా గ్రామాభివృద్ధి సాధిస్తామన్నారు. ఇటీవల నిర్వహించిన ఆత్మీయ భరోసా సర్వే కార్యక్రమం తక్కువ సమయంలో లక్ష్యాన్ని పూర్తి చేయడంలో సహకరించిన ప్రతీ ఒక్క ఉద్యోగికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ యేడు జిల్లా వ్యాప్తంగా 2.91 లక్షల పనిదినాలను అధిగమించి ఉపాధి హామీ పనులను పూర్తి చేయాలని సిబ్బందిని కోరారు. లక్ష్యం చేరుకోవడానికి తక్కువ సమయం ఉన్నందున గ్రామాలలో ప్రాధాన్యత అంశాలు పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ షెడ్, ప్లాంటేషన్, మరుగుదొడ్ల నిర్మాణం వంటి వాటికి అధిక ప్రాధాన్యత ఇచ్చి లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఇతర పథకాల కంటే గ్రామాభివృద్ధి ఎక్కువ సాధించుకుంటామన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల సర్వే పనులలో లక్ష్యాన్ని పూర్తి చేయడంలో కృషి చేసిన ఎంపీడీవోలు, ఏపీవోలు, ఈసీలు, టీఏలతో పాటు ఉపాధి హామీ సిబ్బందికి కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మేన శ్రీను, అడిషనల్ పీడీ శ్రీనివాస్, ఎంపీడీవోలు కర్నాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, వీరేశం, ధనుంజయ, ప్రసూనతో పాటు వివిధ మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలు, ఈసీలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

టీఎస్ ఐపాస్ అనుమతులు త్వరితగతిన ఇవ్వాలి

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): టీఎస్ ఐపాస్ అనుమతులు త్వరితగతిన ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. టీఎస్ ఐపాస్ అనుమతులపై కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంబంధిత శాఖల వారిగా కలెక్టర్ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. టీఎస్ ఐపాస్ కింద వివిధ పరిశ్రమలదారుల నుంచి 36 అనుమతుల కోసం దరఖాస్తు చేశారని, వీటిలో 18 అనుమతులు వివిధ శాఖల నుంచి ఇచ్చారమన్నారు. మిగతా అనుమతులు కూడా త్వరగా ఇవ్వాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ కార్యక్రమంపై ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత శాఖలకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసంబద్ధంగా మునిసిపాలిటీలో గ్రామాల విలీనం

- లోప భూయిష్టంగా ఎంపీటీసీ స్థానాల డీలిమిటేషన్
- కాంగ్రెస్ ప్రతిపాదనలనే పరిగణలోకి తీసుకున్న అధికారులు
- బీఆర్ఎస్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ధ్వజం


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట మునిసిపాలిటీలో పలు గ్రామాలను గ్రామ సభలు నిర్వహించకుండా, ప్రజాభిప్రాయం తీసుకోకుండా విలీనం చేయడం సరి కాదని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఎంపీటీసీ స్థానాలకు చేసిన డీలిమిటేషన్ ప్రక్రియ సైతం లోపభూయిష్టమని ఉందని అన్నారు. నర్సంపేట పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల భాగస్వామ్యం, ప్రతిపక్షాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా కాంగ్రెస్ పార్టీ సూచనలు, ఎమ్మెల్యే నిర్ణయం మేరకే అధికారులు నర్సంపేట మండలంలోని కొన్ని గ్రామాలను మునిసిపాలిటీలో కలిపారన్నారు. అలాగే ఎంపీటీసీ స్థానాలకు డీలిమిటేషన్ చేశారని ఆయన ఆరోపించారు. చెన్నారావుపేట మండలంలోని పాతముగ్ధుంపురం గ్రామాన్ని నర్సంపేట మండలంలోని గురిజాల ఎంపీటీసీ పరిధిలోకి తీసుకురావడం ప్రజలకు అన్యాయం చేయడమేనని అన్నారు. గురిజాల ప్రజలను చీల్చే అధికారం అధికారులకు ఉందా? అని ఆయన ప్రశ్నించారు. నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామాన్ని మునిసిపాలిటీలో కలుపుతున్నట్లు మొదట గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారని, తర్వాత విలీనాన్ని రద్దుచేస్తున్నామంటూ మళ్లీ నోటిఫికేషన్ విడుదల చేశారని పేర్కొన్నారు. ప్రజాఅభిప్రాయం స్వీకరించకుండా, గ్రామసభలు నిర్వహించకుండా ప్రజలు రేషన్‌షాపునకు వెళ్లి పెట్టిన సంతకాలు సేకరించి గ్రామ సభలు జరిగి ప్రజలు ఆమోదించినట్లు రికార్డులు సృష్టించి ఈ విలీనానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడిందని ఆయన ఆరోపించారు.

గ్రామాలు విలీనం కావడం వల్ల నిధులు ఎక్కువగా వస్తాయని దుష్ప్రచారం చేశారని, ముఖ్యమంత్రికి, ఇక్కడి ఎమ్మెల్యే అసలే పడదని, అలాంటప్పుడు నిధులు ఎలా వస్తాయని పెద్ది ప్రశ్నించారు. విలీన గ్రామాల పరిధిలోని అసైన్డ్ భూములు, ఇతర భూములపై ముఠాల కన్నుపడడం వల్లనే ఈ గ్రామాలను విలీనం చేశారని ఆయన పేర్కొన్నారు. ఇంత పెద్ద ప్రక్రియ జరుగుతున్నప్పుడు ఒక్కసారైనా స్థానిక ఎమ్మెల్యే, మునిసిపల్ ఉన్నతాధికారులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో ఎప్పుడైనా సమీక్ష జరిపారా? అని ఆయన ప్రశ్నించారు. నర్సంపేట మునిసిపాలిటీలో విలీన ప్రక్రియలో ఏ ఏ గ్రామాలను ఎందుకు కలిపారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రూరల్ మండలంలో ఏడు ఎంపీటీసీ స్థానాలను ఏ విధంగా, ఏ ప్రాతిపదికన డీలిమిటేషన్ చేశారో జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్, విలీన గ్రామాల ప్రక్రియ విషయంలో మునిసిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారుల మధ్య సమన్వయంలేకుండా పోయిందని అన్నారు. మునిసిపాలిటీలో మండలంలోని పలు గ్రామాలను విలీనం చేయడం వల్ల జాతీయ ఉపాధి హామీ పథకం వర్తించక, కూలీలకు పనులు దొరకక ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం అందిస్తానన్న రూ.12వేల సహాయం పొందకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మునిసిపాలిటీలో గ్రామాలను విలీనం చేసే విషయంలో, ఎంపీటీసీ స్థానాల కోసం చేపట్టిన డీలిమిటేషన్ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కినట్లు ఉందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాయిడి రవీందర్‌రెడ్డి, మునిగాల వెంకట్‌రెడ్డి, గోనె యువరాజు, నామాల సత్యనారాయణ, నాగిశెట్టి ప్రసాద్, ఈర్ల నర్సింహరాములు, మచ్చిక నర్సయ్య, వేణుముద్దల శ్రీధర్‌రెడ్డి, కొమాండ్ల గోపాల్‌రెడ్డి, కొడారి రవి తదితరులు పాల్గొన్నారు.

"క్యాన్సర్‌ను జయించా

- అందరూ అవగాహన పెంచుకోవాలి
- ప్రతీ ఒక్కరు పౌష్టికాహారం తీసుకోవాలి
- 'వాకథాన్'లో సినీ నటి గౌతమి
- హాజరైన ఎంపీ కడియం కావ్య


కాళోజీ కళాక్షేత్రంలో జరిగిన సదస్సులో సినీనటి గౌతమి అభివాదం



హనుమకొండలో క్యాన్సర్‌పై నిర్వహించిన అవగాహన ర్యాలీలో వాకథాన్‌కు హాజరైన నగర యువత

7

సమగ్ర సమాచారంతో డీపీఆర్ రూపొందించాలి

- బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే


బల్దియా కార్యాలయంలో కన్సల్టెన్సీ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సమగ్ర సమాచారంతో డీపీఆర్ రూపొందించాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే పేర్కొన్నారు. మంగళవారం బల్దియా క్యాంపు కార్యాలయంలో యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) డీపీఆర్ రూపకల్పనపై కన్సల్టెంట్ ప్రతినిధులు, బల్దియా ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బల్దియా పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పరిధిలోకి వచ్చే అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని డీపీఆర్ తయారు చేయాలన్నారు. ఎస్‌టీపీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, వాటి సమాచారం పొందుపర్చి త్వరితగతిన డీపీఆర్ తయారుచేసి అందించాలని కన్సల్టెంట్ ప్రతినిధులకు ఆమె సూచించారు. ఈ సమావేశంలో బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, మహేందర్, కన్సల్టెంట్ ప్రతినిధి మనోజ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన అనంతరం నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ, పాత రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఉమామహేశ్వర్‌తో కొత్త రిస్ట్రార్ సుశీల్ కుమార్ మెహతా (ఎడమ వైపు)

నిట్ రిజిస్ట్రార్‌గా సుశీల్ కుమార్ మెహతా

హనుమకొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్ రిజిస్ట్రార్‌గా సుశీల్ కుమార్ మెహతా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి సమక్షంలో ప్రస్తుత వరంగల్ నిట్ రిజిస్ట్రార్ ఎస్‌వీ ఉమా మహేశ్ నుంచి సుశీల్ కుమార్ మెహతా బాధ్యతలు తీసుకున్నారు. సుశీల్‌కుమార్ మెహతా ప్రస్తుతం కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఉన్నత విద్యా విభాగం బోర్డు ఉత్తర ప్రాంత డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. వరంగల్ నిట్ రిజిస్ట్రార్‌గా ఆయన డిప్యూటేషన్ పై వచ్చారు. మెహతాకు 25 ఏళ్లకుపైగా పరిపాలనా అనుభవం ఉంది. రిజిస్ట్రార్‌గా ఆయన అయిదేళ్ల పాటు సేవలు అందించనున్నారు.

17 నుంచి ఎంబీఏ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూక్యాంపస్ ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ రెగ్యులర్ ఎంబీఏ కోర్సుల మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 17 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొ పెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ అసీం ఇక్బాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 17, 19, 21, 25, 28, మార్చి 3, 5వ తేదీల్లో పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. పరీక్షలన్నీ మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం గంటల వరకు జరుగుతా యని పేర్కొన్నారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

కేయూ సైన్స్ విభాగాల పీహెచ్‌డీ అడ్మిషన్ల దరఖాస్తులకు ఆహ్వానం

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ అడ్మిషన్ల నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు కేయూ సైన్స్ విభాగాల డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోటనీలో-6, కెమిస్ట్రీలో-3, జియాలజీలో-1, మ్యాథ్స్‌లో-1, ఫిజిక్స్‌లో-2, జువాలజీలో-11 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తులను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకువాలని, ఫీజులను డీన్ కార్యాలయంలో చెల్లించాలని తెలిపారు. అలాగే ఫిబ్రవరి 12లోగా దరఖాస్తులను సమర్పించాలని కోరారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ www.kakatiya.ac.inలో చూడాలని పేర్కొన్నారు.

జువాలజీలో శ్రీనివాస్‌కు డాక్టరేట్



ఎర్రోజు శ్రీనివాస్

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం పరిశోధకుడు ఎర్రోజు శ్రీనివాస్ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు బుధవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌కు డాక్టరేట్ ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ 'స్క్రీనింగ్ ఆఫ్ మెడిసినల్ ప్లాంట్ ఎక్స్‌ట్రాక్ట్స్ ఫర్ యాంటీ ఫెర్టిలిటీ ఇన్ మెల్ అల్బినో రాట్స్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రకటించారు. జువాలజీ విభాగం ప్రొఫెసర్ వై.వెంకయ్య పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా జనగామకు చెందిన శ్రీనివాస్ పలు అంతర్జాతీయ, జాతీయ సదస్సుల్లో విలువైన పరిశోధన పత్రాలను ప్రచురించారు. డాక్టరేట్ సాధించిన ఎర్రోజు శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

వృద్ధుడి అదృశ్యం



కోటేశ్వర్‌రావు

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ కాపువాడకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి కోటేశ్వర్‌రావు (80) అదృశ్యమైనట్లు హనుమకొండ సీఐ వై.సతీష్ తెలిపారు. జనవరి 31 నుంచి కనిపించడం లేదని, ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్ నెంబర్ 8712685002 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

వర్సిటీలో బోధన, పరిశోధనకు మరిన్ని నిధులు

కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం

కేయూక్యాంపస్ ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో బోధన, పరిశోధనకు మరిన్ని నిధులు విడుదల చేసినట్లు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం కేయూ పరిపాలన భవనంలోని సెనెట్ హాల్‌లో వర్సిటీ రెగ్యులర్ ప్రొఫెసర్ల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీసీ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేయూ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచాలన్నారు. వర్సిటీలో అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సు పెంచడంపై హర్షం వ్యక్తంచేశారు. మూడేళ్లుగా రావాల్సిన రూ.31కోట్ల బడ్జెట్ అర్డర్ వెలువడిందన్నారు. ఈనెల రెండో వారంలో జరిగే సమావేశంలో రుసా నిధులు అందుబాటులోకి వస్తాయన్నారు. కేయూను న్యాక్ ఏ ప్లస్ ప్లస్‌గా తీర్చిదిద్దాలని అన్నారు. వర్సిటీలో అకడమిక్ వాతావరణాన్ని పెంపొందిద్దామని, అన్ని విభాగాలకు రూ.40వేల నిధులు విడుదల చేస్తామన్నారు. రెండేళ్లకోమారు సిలబస్‌ను రివిజన్ చేయాలని హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన సమావేశంలో తీర్మానించినట్లు వెల్లడించారు. ప్రొఫెషనల్, సంప్రదాయ కోర్సులన్నీ స్కిల్ బేస్డ్, బాజ్ ఓరియంటేషన్, ప్రాంగణ నియామకాల కోసం ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. తరగతుల బోధన సీరియస్‌గా జరుగలన్నారు. అటెండెన్స్ ఫేస్ రికగ్నజైస్డ్ సిస్టంను తెస్తామన్నారు. ఐక్యూఏసీ సెల్‌ను మరింత బలోపేతం చేస్తామన్నారు. డేటాబేస్‌ను పెంచాలన్నారు. వర్సిటీ గోల్డెన్ జూబ్లీ ఏడాదిలోకి, వర్సిటీ ఆర్ట్స్ కళాశాలల 100 ఏళ్లలోకి అడుగిడుతోందని వెల్లడించారు. వర్సిటీలో మరిన్ని మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తెస్తామన్నారు. తదనుగుణంగా ప్రభుత్వం నుంచి నిధులను తెస్తామన్నారు. ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్ చేసేందుకు ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. వర్సిటీ అభివృద్ధిలో అధ్యాపకుల ఆలోచన పంచుకోవాలని కోరారు. పారదర్శకంగా, నిబంధనల మేరకు పనులు చేస్తామన్నారు. అధ్యాపకులకు రావాల్సిన బెనిఫిట్స్, క్యాష్ ప్రమోషన్లు పూర్తి చేస్తామన్నారు. అల్యూమినీలను బలోపేతం చేస్తామని వీసీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ పరిపాలన అధికారులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

జీవిత పర్యంతం నేర్చుకుంటూనే ఉండాలి

ప్రతీ పనిలో జీవితాంతం నేర్చుకుంటూనే ఉంటేనే ఆయా ఉద్యోగాల్లో రాణిస్తామని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఉద్బోధించారు. రెండు వారాలుగా కేయూ కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఎన్‌సీసీ జవాన్లకు నిర్వహిస్తున్న 'ఇంటెన్సివ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఆన్ ఎక్సెల్ టూ పవన్ ఐబీ ఫర్ ఎన్‌సీసీ జవాన్' ముగింపు సమావేశంలో వీసీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులకు స్కిలింగ్, రీ స్కిల్లింగ్ అవసరమన్నారు. సైనిక కార్యకలాపాల్లో కంప్యూటర్ టెక్నాలజీ వినియోగం పెరిగిందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. భవిష్యత్ అవసరాలకు కంప్యూటర్ ట్రైనింగ్ అవసరమన్నారు. ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రాముదుర్రై, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి.రమలు మాట్లాడుతూ.. రెండు వారాల శిక్షణలో అనేక నూతన అంశాలను జవాన్లు నేర్చుకున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో జవాన్లకు సర్టిఫికెట్లు అందచేశారు.

శాసనమండలిలో బీఆర్ఎస్ విప్‌గా సత్యవతిరాథోడ్

- స్పీకర్‌కు నిర్ణయపత్రాన్ని అందించిన 'గులాబీ' ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- నెల రోజుల్లో ముగియనున్న ఎమ్మెల్సీ పదవీకాలం
- విప్‌గా నియామకంతో మళ్లీ ఆమెకే ఎమ్మెల్సీ అవకాశం!



ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

మహబూబాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : శాసన మండలిలో బీఆర్ఎస్ పార్టీ విప్‌గా మహబూబాబాద్ జిల్లాకు చెందిన మాజీమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ నియమితులయ్యారు. ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. సత్యవతి రాథోడ్‌ను విప్‌గా నియమించేందుకు నిర్ణయపత్రాన్ని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి మంగళవారం అందించారు. మరోనెల రోజుల్లో ఆమె ఎమ్మెల్సీ పదవీ కాలం ముగుస్తున్నప్పటికీ పార్టీ విప్ పదవికి ఎంపిక చేయడంతో.. ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా మరోసారి సత్యవతిరాథోడ్‌కు అవకాశమివ్వబోతున్నట్టు స్పష్టమవుతోంది. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగు శివారు పెద్దతండాకు చెందిన సత్యవతిరాథోడ్ 2009-2014 వరకు డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పని చేశారు. స్వరాష్ట్రం సిద్ధించాక 2018లో రెండోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక 2019లో సత్యవతిరాథోడ్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. మాజీ సీఎం కేసీఆర్ మంత్రి వర్గంలో స్త్రీ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు. అంతకు ముందు బీఆర్ఎస్ స్టీరింగ్ కమిటీ సభ్యురాలిగా, సంస్థాగత నిర్మాణ బాధ్యురాలిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణలో వివిధ ఎన్నికలకు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. బీఆర్ఎస్‌లో క్రియాశీలకంగాఎదిగిన ఆమెకు మంగళవారం శాసన మండలిలో బీఆర్ఎస్ విప్‌గా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీ ఆర్ అవకాశం కల్పించారు.

బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తా : సత్యవతిరాథోడ్

తనపై ఉంచిన బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తానని శాసనమండలిలో బీఆర్ఎస్ విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. గిరిజన మహిళనైన తనను గుర్తించి శాసనమండలి బీఆర్ఎస్ పార్టీ విప్‌గా అత్యున్నత పదవినందించిన రాష్ట్రసాధకుడు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా వ్యతిరేక పాలనపై పోరాడతానని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



వెంకటమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మందకృష్ణ మాదిగ

'అరూరి'ని పరామర్శించిన మందకృష్ణ, ఎర్రబెల్లి

ముగిసిన వెంకటమ్మ అంత్యక్రియలు

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకులు అరూరి రమేశ్ తల్లి వెంకటమ్మ మృతికి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, దళిత ప్రజా సంఘాల, వివిధ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. వెంకటమ్మ అనారోగ్యంతో ఉప్పుగల్లులో సోమవారం మృతి చెందిన విషయం విదితమే. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, మాజీ ఎంపీ సీతారాంనాయక్, మాజీ మంత్రి డాక్టర్ విజయరామారావు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేశ్ రెడ్డి, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్, ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులు, బంధు మిత్రులు మంగళవారం ఉప్పుగల్లుకు చేరుకుని వెంకటమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వెంకటమ్మ అంత్యక్రియలు ఉప్పుగల్లులో నిర్వహించారు.

మావోయిస్టు లేఖ ఒక బూటకం

- నాపై వచ్చిన వార్తలు నిరాధారం
- కార్మికసంఘాల నాయకుడు సుద్దాల నాగరాజు



ఖిలావరంగల్‌లో మాట్లాడుతున్న సుద్దాల నాగరాజు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ వరంగల్ కార్యదర్శి వెంకటేష్ పేరుతో విడుదలైన లేఖ ఒక బూటకమని తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల నాగరాజు అన్నారు. మంగళవారం ఆయన ఖిలావరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో మీడియాతో మాట్లాడారు. ఆ లేఖ విడుదల చేసింది మావోయిస్టు పార్టీ కాదని, ఒకవేల వాళ్లు ఇచ్చి ఉంటే తన వివరణ తీసుకునేవారని, ఉన్నత సిద్ధాంతాలు కలిగిన మావోయిస్టు పార్టీ ఇలా ఏకపక్షంగా వ్యవహరిస్తుందని తాను అనుకోవడంలేదని వివరించారు. ఈ ప్రకటన రావడం వెనక వరంగల్ జిల్లా సీఎల్‌సీ నాయకులు కాంపెల్లి ప్రవీణ్, రమేష్ చంద్ర, బండి దుర్గప్రసాద్, టీపీఎఫ్ నాయకురాలు బి.రమాదేవి పాత్ర ఉందని ఆరోపించారు. ఈ నలుగురు రెండు నెలలుగా తనతో పాటు హైకోర్టు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్‌పై నిందారోపణలు చేస్తూ కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. నాలుగున్నర దశాబ్దాలుగా ఎంతో నిర్బంధం అనుభవించి అశేష పీడిత ప్రజానీకానికి, కార్మికులకు అండగా నిలబడడమే కాకుండా తెలంగాణ ఉద్యమంలో తాను పోరాడానని అన్నారు. 318 మంది కార్మికులకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలు కేటాయించక పోతే హైకోర్టు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ సుప్రీంకోర్టులో కేసు వేసి వారికి పట్టాలిప్పించారని గుర్తుచేశారు. అజాంజాహి మిల్లు కార్మిక భవనం స్థలం విషయంలో అతడికి ఎటువంటి సంబంధం లేకున్నా ఆయనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇద్దరిపై నిందారోపణలు చేస్తూ మావోయిస్టు పార్టీతో సదరు నలుగురు వ్యక్తులు లేఖ రాసి విడుదల చేశారని ఆరోపించారు. దీనిపై సంఘం నాయకులు, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు నిజనిర్ధారణ చేయాలని కోరారు. సంఘాల పేరు చెప్పి వీరు దళారుల దగ్గర డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తామని, త్వరలో వారి బండారం బయటపెడుతామని ఆయన స్పష్టం చేశారు.

బాలికపై అత్యాచారం

- గర్భం దాల్చిన బాధితురాలు
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

కరీమాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రేమపేరుతో వెంటపడి.. మాయమాటలు చెప్పి.. పెళ్లిచేసుకుంటానని నమ్మించి.. పలుమార్లు అత్యాచారానికి పాల్పడి.. ఓ బాలికను గర్భవతిని చేసిన నిందితుడిపై వరంగల్ జిల్లా మిల్స్‌కాలనీ పోలీసులు మంగళవారం పోక్సో కేసు నమోదు చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, బాధిత కుటుంబం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ నగరం మిల్స్‌కాలనీ ప్రాంతానికి చెందిన ఓ బాలిక ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అయితే అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడు గతేడాది ఆమె పదో తరగతిలో ఉండగా ప్రేమపేరుతో వెంటపడ్డాడు. తనకు ఇష్టంలేదని చెప్పినా వెంటపడి.. మాయమాటలు చెప్పి పెళ్లిచేసుకుంటానని నమ్మించాడు. ఆ తర్వాత పలుమార్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో ఆ బాలిక గర్భం దాల్చగా.. విషయం ఎవరికైనా చెబితే చంపుతానంటూ ఆ యువకుడు బాలికను బెదిరించడంతో భయపడిన బాలిక ఇంట్లో చెప్పకుండా దాచిపెట్టింది. అయితే కొద్ది రోజులుగా తమ కూతురు ఆరోగ్యంలో వస్తున్న మార్పులు, బుధవారం తీవ్ర కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు బాలికను ప్రశ్నించడంతో ఆమె వారికి అసలు విషయం చెప్పింది. దీంతో తమ కూతురిని మాయమాటలతో లొంగదీసుకున్న సదరు యువకుడిని చట్టపరంగా శిక్షించాలని కోరుతూ తల్లిదండ్రులు మంగళవారం మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేశామని మిల్స్‌కాలనీ సీఐ జూపల్లి వెంకటరత్నం తెలిపారు. అయితే వెంటనే దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

న్యాయవాదిపై దాడిచేసిన పోలీసులను సస్పెండ్ చేయాలి

- ఉభయ జిల్లాల బార్ అసోసియేషన్ న్యాయవాదుల డిమాండ్
- సర్వసభ్య సమావేశంలో తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్‌గౌడ్

వరంగల్ లీగల్, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది గంధం శివపై దాడిచేసిన సీఐ, సంబంధిత పోలీసుల పైకేసు నమోదు చేసి వెంటనే సస్పెండ్ చేయాలని హనుమకొండ, వరంగల్ జిల్లాల న్యాయవాదులు డిమాండ్ చేశారు. అకారణంగా న్యాయవాదిపై ఏకపక్షంగా దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన సీఐ సీతారెడ్డి, కానిస్టేబుళ్లపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్లు అత్యవసరంగా నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. న్యాయవాదిపై పోలీసులు దాడి చేయడం అమానుషమైన, హేయమైన చర్యగా న్యాయవాదులు ఉద్ఘాటించారు. సోమవారం రాత్రి 8.10గంటలకు కాకతీయ యూనిర్సిటీ చౌరస్తాలో న్యాయవాది గంధం శివపై దాడి చేసి సెల్‌ఫోన్ లాక్కొని పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి విచక్షణారహితంగా కొట్టడమే కాకుండా న్యాయవాదిపై కేసు నమోదు చేయడం శోచనీయమని న్యాయవాదులు పేర్కొన్నారు. ఈ మేరకు సర్వసభ్య సమావేశంలో దాడిని ఖండిస్తూ సీఐ, సంబంధిత పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి సస్పెండ్ చేయాలని తీర్మానించారు. పోలీసుల ఏకపక్ష దాడికి నిరసనగా బుధవారం న్యాయవాదులంతా విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేయాలని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్‌బాబు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్స జనార్ధన్, వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల కార్యదర్శులు ముదసిర్ అహ్మద్, లాడే రమేష్, ఇతర కార్యవర్గ సభ్యులు సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

న్యాయవాది గంధం శివపై కేసు నమోదు

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న సమయంలో సోమవారం రాత్రి కేయూ జంక్షన్‌లో మద్యం తాగి పట్టుబడ్డ న్యాయవాది గంధం శివపై కేసు నమోదు చేశారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల ముసాయిదా ప్రచురణ

హనుమకొండ, వరంగల్ జడ్పీ కార్యాలయాల్లో నోటీసు బోర్డులపై ప్రదర్శన

హనుమకొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో మండల ప్రజాపరిషత్ (ఎంపీటీసీ), జిల్లా ప్రజాపరిషత్ (జడ్పీటీసీ) స్థానాల ముసాయిదా జాబితాను సోమవారం ప్రకటించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం కిందటేడు జూలై 24న ముగిసింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచ్‌ల ఎన్నికల్లాగే ఎంపీటీసీ, జడ్పీసీటీ ఎన్నికలను కూడా వాయిదా వేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం సమాయత్తం అవుతున్న నేపథ్యంలో ఎంపీటీసీ, జడ్పీటీసీలకు కూడా ఎన్నికలు జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తుది ముసాయిదా జాబితాలను ప్రచురించారు. వీటిని సుబేదారిలో ఒకే ప్రాంగణంలో ఉన్న వరంగల్, జడ్పీ కార్యాలయాల నోటీసు బోర్డుపై ఉంచారు. హనుమకొండ జిల్లా పరిధిలో 129 ఎంపీటీసీలు, 12 జడ్పీటీసీలు ఉండగా, వరంగల్ జిల్లా పరిధిలో 130 ఎంపీటీసీలు, 11 జడ్పీటీసీలు ఉన్నాయి. రెండు మూడు రోజుల్లో ఓటర్ల జాబితాలతో పాటు పోలింగ్ స్టేషన్ల వారిగా ముసాయిదా జాబితాలను కూడా ప్రచురించారు. కిందటేడు జూలై నుంచి జడ్పీలు, ఎంపీటీసీలు ప్రత్యేక పాలనలో కొనసాగుతున్నాయి. జడ్పీలకు కలెక్టర్లు, మండలాలకు ఎంపీడీవోలు ప్రత్యేకాధికారులుగా కొనసాగుతున్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	-	-
పల్లికాయ (సూక)	6220	4600
పల్లికాయ (పచ్చిది)	4400	3100
కందులు	6750	5540
పెసళ్లు	6009	5133
పత్తి	6960	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13500	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్ ఏసీ	15000	11500
యూఎస్341ఏసీ	16000	13500
యూఎస్ 341 కొత్తది	14200	11500
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

మహా ఘట్టం.. ఎంతో ముఖ్యం


ఆలయ గోపురం వద్ద పనులు

కుంభాభిషేకంతో పెరగనున్న ఆలయమూర్తి తేజస్సు
7, 8, 9 తేదీల్లో కాళేశ్వరంలో జరిగే వేడుకకు ఏర్పాట్లు పూర్తి

మహదేవపూర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : 'శివం శాంతం.. జగన్నాథం.. లోకానుగ్రహకారణం.. శివమేకం.. పరంవందే శివోహం నమఃనమః'.. ప్రతీ పుష్కరానికోసారి మహాకుంభాభిషేకం చేస్తే ఆలయ తేజస్సు పెరుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఈనేపథ్యంలో కాళేశ్వర ఆలయ మహా కుంభాభిషేక ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, అర్చకులు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవతామూర్తి తేజోబింబం, యంత్రమూర్తి తేజస్సు పెరగడంతో భక్తులు కోరిన కోర్కెలు తీరుతాయని పురాణాలు చెబుతున్నాయి. సప్త నదీ జలాలు తెచ్చి.. ఆలయమూర్తులకు, ఆలయ రాజగోపురానికి మంత్రయుక్తములతో కుంభాభిషేకం నిర్వహించనున్నారు. మహా కుంభాభిషేక ఘట్టం ఎంతో ప్రముఖమైందని.. దీని ద్వారా ఆలయ చరిత్ర మరింత పురోగవిస్తుందని.. ఆలయ ప్రాశస్త్యం పెరుగుతుందని పలువురు వేద పండితులు, అర్చకులు తెలుపుతున్నారు. 1982లో జగద్గురు ఆచార్యుల కరములచే మహా కుంభాభిషేక ఘట్టం జరిగింది. ఈ మహా కుంభాభిషేకంలో భాగంగా శతచండీయాగం, మహారుద్రాభిషేకం, శతఘటాభిషేకం, మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో జరిగే మహా కుంభాభిషేక ఘట్టాన్ని మరింత వైభవంగా చేసేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని అలయ అర్చకులు, అధికారులు కోరుతున్నారు.

1982లో ఆలయ జీర్ణోద్ధరణ జరిగింది



1982లో ఆలయ జీర్ణోద్ధరణ జరిగింది. ఈ సమయంలో ఫిబ్రవరి నెలలో మహా కుంభాభిషేకం నిర్వహించాం. 42 సంవత్సరాల ఈ కుంభాభిషేకాన్ని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించడం జరుగుతుంది. కుంభాభిషేకం ద్వారా ఆలయ మూర్తి తేజస్సు మరింత పెరుగనుంది. దీంతో భక్తుల కోర్కెలు తీరనున్నాయి. అప్పుడు జగద్గురు శంకాచార్యులు హాజరయ్యారు.

- త్రిపురారి కృష్ణమూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు

ఉత్సవమూర్తులను దర్శించుకుంటే పుణ్యం



మహాకుంభాభిషేకం తర్వాత ఉత్సవమూర్తులను దర్శించుకుంటే మహా పుణ్యం.. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందాలి. తుని తపోవనం ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామివారు ముఖ్య అతిథులుగా రానున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలు శుక్రవారం నుంచి మొదలై ఆదివారం వరకు జరుగనున్నాయి.

- నగేష్‌శర్మ, ఆలయ అర్చకుడు

ఏర్పాట్లు పూర్తి చేశాం..



మహాకుంభాభిషేకానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. స్వాములు గోపురం పైకి ఎక్కేందుకు పరంజాలు ఏర్పాటు చేశాం. విద్యుత్ లైట్లు, తాగునీటి వసతి, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు మెరుగుపరిచాం. ఉత్సవాన్ని విజయవంతం చేసేందుకు భక్తులు తరలిరావాలి. వేద పండితులు, కళశాలను సిద్ధం చేశాం.

- మహేష్, ఆలయ ఈవో, కాళేశ్వరం

ఆధ్యాత్మికం

వనదేవతల గుడుల్లో నేడు శుద్ధి పండుగ

12వ తేదీ నుంచి 15వరకు మినీజాతర


మేడారంలో సమ్మక్క గుడి


కన్నేపల్లిలో సారలమ్మ గుడి

తాడ్వాయి, ఫిబ్రవరి 4, (ఆంధ్రజ్యోతి): మేడారం మినీజాతరకు సమయం ఆసన్నమైంది. మినీజాతర ప్రారంభ సూచకంగా బుధవారం వనదేవతల గుడుల్లో శుద్ధి పండుగ నిర్వహించనున్నారు. మేడారంలో సమ్మక్క సారలమ్మల గుడుల్లో నిర్వహించే ఈ కార్యక్రమం కోసం పూజారుల కుటుంబాలు వేకువజామున నిద్రలేచి జంపన్నవాగులో పుణ్యస్నానాలాచరిస్తారు. మేడారంలోని సమ్మక్క గుడిని, కన్నేపల్లి గ్రామాల్లో ఉన్న సారలమ్మ గుడిని శుద్ధి చేస్తారు. అనంతరం వనదేవతల ప్రతిమలు, మంగళహారతులతో పాటు వివిధ రకాల పూజాసామగ్రి, ప్రతిమలను బయటకు తీసి శుద్ధి చేస్తారు. గుడిలోపల దేవతల పీటలను పూజారుల కుటుంబాల మహిళలు అలుకువేసి ముగ్గులతో సుందరంగా అలంకరిస్తారు. ఈక్రమంలో పూజారులు ధూపదీప నైవేద్యాలు సమర్పించి పూజాసామగ్రిని రహస్య పూజలకు సిద్ధం చేస్తారు. తదుపరి బుధవారం మినీ జాతర వేడుకలు ఘనంగా నిర్వహించడానికి సమాయత్తమవుతున్నారు. ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు మినీ జాతర వేడుకలు జరగనుండగా రహస్య పూజలు చేసి జాతరను కొనసాగిస్తారు. అయితే నేటి నుంచి జాతర వేడుకలు ప్రారంభంగా భావించి ఉపవాసాలతో, నియమనిష్ఠలతో పూజారులు దేవతలకు పూజలు చేస్తుంటారు. దీంతో జాతరలో శివసత్తుల పూనకాలు, డోలివాద్యాల మధ్య అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రధాన పూజారులు కొక్కెర క్రిష్ణయ్య, కాక సారయ్య, ధూపదీప నైవేద్యాలకు దోబె నాగేశ్వరరావు, కాక భుజంగరావు, కోమ్మువడ్డెలుగా సిద్దబోయిన స్వామి, సిద్దబోయిన జనార్దన్, సిద్దబోయిన నర్సింగరావు, సిద్దబోయిన వసతంరావు, రక్షకులుగా మునేందర్, పోలం వెంకన్న, పూజారుల సంఘం నాయకులు, సభ్యులుపలువురు పాల్గొనున్నారు.

బయ్యక్కపేటలో మండెమెలిగే పండుగ

మండలంలోని బయ్యక్కపేటలో సమ్మక్క దేవత పూర్వీకులు మండే మెలిగే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈసందర్భంగా గ్రామంలో పుట్టుపూర్వం ఉన్న సమ్మక్కతల్లి గుడిని చెంద వంశీయులు శుద్ధిచేసి సమ్మక్క దేవతను ఆడబిడ్డగా కొలిచి పూజప్రతిమలను శుద్ధి చేస్తారు. అనంతరం ఆడబిడ్డలతో గుడిలో అలుకుపూతలు చేసి గుడికప్పులను సరిచేస్తారు. తల్లుల శక్తి పీఠాన్ని పూలతో అలంకరించి పసుపు, కుంకుమను సమర్పించి ధూపదీప నైవేద్యాలతో కొబ్బరికాయాలు కొట్టి, యాటమొక్కులు చెల్లించుకుంటారు. వచ్చేవారం జరుపుకొనే మినీజాతరలో ఎలాంటి అవాంతరాలు రాకుండా చూసుకోవాలని కోరుకుంటారు. జాతరకు సిద్ధమవుతున్నట్లుగా ఆడబిడ్డకు లాంచనాలను సమర్పించి జాతరకు ముందు వారం నుంచి నియమనిష్ఠలతో పూజ కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఈక్రమంలో బయ్యక్కపేటలో ఉన్న దేవతల గద్దెలను శుద్ధి చేసి పూజలు చేస్తారు. ఈకార్యక్రమంలో చెందవంశీయులు, కులపెద్దలు, గ్రామస్థులు పాల్గొంటారు.

కుంభాభిషేక పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్

మహదేవపూర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కాళేశ్వర ముక్తీశ్వర కుంభాభిషేక వాల్ పోస్టర్లను కాళేశ్వర ఆలయ నిర్వాహకులు మంగళవారం హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. అనంతరం కుంభాభిషేకానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కొత్తలైన్లకు రెడ్‌సిగ్నల్!

(5వ పేజీ తరువాయి)

మీదుగా మిర్యాలగూడ చేరుతుంది. ఈ లైన్‌తో హైదరాబాద్, విజయవాడ, చెన్నై, న్యూఢిల్లీ మార్గం అనుసంధానమవుతుంది. మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం నుంచి ధాన్యం, బియ్యం, గ్రానైట్ పరిశ్రమలకు, సిమెంట్ పరిశ్రమలకు సరుకులను రవాణా, షుగర్ ఫ్యాక్టరీల నుంచి చెక్కర సరఫరా చేసేందుకు మార్గం సుగమమవుతుంది. ఎంతో కీలకమైన ఈ రైల్వేలైన్‌కు బడ్జెట్‌లో చోటు దక్కకపోవటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. అలాగే డోర్నకల్ నుంచి గద్వాల వరకు 296కిలో మీటర్ల రైల్వేలైన్ కోసం రూ.5వేల కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ఈ లైన్‌తో వరంగల్ మీదుగా హైదరాబాద్, విజయవాడ సాగే లైన్‌తో మహబూబ్‌నగర్ మీదుగా హైదరాబాద్, బెంగళూరు లైన్‌ను అనుసంధానం చేసేందుకు డోర్నకల్-గద్వాల లైన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేశారు. అయితే ఈ లైన్‌కు కూడా రెడ్ సిగ్నల్ పడింది. ఎంతో కీలకమైన ఈ నాలుగు లైన్లను పూర్తిచేసేందుకు ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకరావాలన్నారు.

కోచ్.. అమృత్ స్టేషన్లకు గ్రీన్‌సిగ్నల్

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మల్టిపుల్ రైల్వే మ్యానుఫాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తామని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. కానీ దీని కోసం ఎన్ని నిధులు కేటాయించారో వెల్లడించలేదు. అయితే 160 ఎకరాల్లో రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు రూ.521కోట్లు కేటాయించారు. ఇప్పటికే 60శాతం వ్యాగన్ తయారీ పరిశ్రమ పనులు పూర్తి కావచ్చాయి. ఈ నేపథ్యంలో గత నవంబరులో వ్యాగన్‌ను కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. దీంతో వ్యాగన్లతో పాటు రైల్‌కోచ్‌ల తయారీ, ఇతర రైల్వే అవసరాలకు కావాల్సిన యంత్రాల తయారీకి కాజీపేట జంక్షన్‌ను మల్టిపుల్‌గా వినియోగించుకోనున్నారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న కాజీపేట, వరంగల్, జనగామ, మహబూబాబాద్ రైల్వేస్టేషన్లను అమృత్ స్టేషన్ పథకం కింద ఎంపిక చేశారు. ఈ స్టేషన్లను ఆధునికీకరించనున్నారు. ప్రయాణికులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించనున్నారు. రూ.20కోట్ల నుంచి రూ.35కోట్ల వరకు నిధులు కేటాయిస్తున్నారు. ఇప్పటికే వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్ల ఆధునీకరణ పనులు మొదలయ్యాయి. అయితే ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కాజీపేట రైల్వే డివిజన్ హోదాపై మాత్రం రైల్వేశాఖ ఏలాంటి ప్రకటన చేయలేదు.

సాహితీ ప్రేమికుడు గుర్రపు

- రెండు దశాబ్దాలుగా పలు రచనలతో గుర్తింపు
- వ్యాపారంలో స్థిరపడినా.. సాహిత్యంపై తగ్గని ఆసక్తి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆయన వృత్తి దుస్తుల వ్యాపారం.. ప్రవృత్తి రచనలు చేయడం.. కవిగా, రచనా ప్రియుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు మానుకోటకు చెందిన గుర్రపు సత్యనారాయణ. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో 1967 జూలై 19న గుర్రపు నర్సయ్య, సారమ్మలకు మూడో సంతానంగా జన్మించిన ఆయన బాల్యమంతా ధర్మసాగర్‌లో గడిపారు. ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ధర్మసాగర్‌లో చదివారు. ఆ తర్వాత తల్లిదండ్రులు వ్యాపార రీత్యా మహబూబాబాద్‌లో స్థిరపడడంతో పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన ఆయన తండ్రి ద్వారా వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. ఇంటర్మీడియట్ నుంచే మినీ కవితలు రాయడం ప్రారంభించిన ఆయన రచనా వ్యాసంగంపై ఉన్న మక్కువతో తాను ప్రారంభించిన క్లాత్‌స్టోర్‌కు 'రచన' పేరు పెట్టుకోవడం ఆయనకు సాహిత్యం మీద ఉన్న ప్రేమను తెలియజేస్తోంది.

సాహితీ ప్రస్థానం ఇలా..

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో 1991లో జరిగిన సాంస్కృతిక సమాఖ్య యువ సాహితీ వికాస వేదిక రాష్ట్ర రచయితల మహాసభలకు తొలిసారిగా వరంగల్ జిల్లా ప్రతినిధిగా గుర్రపు సత్యనారాయణ పాల్గొన్నారు. 1992 నుంచి 1994 వరకు ఆంధ్రప్రదేశ్ కేంద్ర కమిటీలో సెక్రటేరియట్ కమిటీ సభ్యుడిగా కొనసాగారు. 1992లో అంతర్జాతీయ తెలుగు రైటర్స్ అసోసియేషన్‌లో సభ్యత్వం పొందారు. 2007లో నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు హాజరయ్యారు. విజయవాడలో 2009 జనవరిలో నిర్వహించిన ప్రపంచ తెలుగు సమాఖ్య ఎనిమిదో అంతర్జాతీయ మహాసభలకు హాజరయ్యారు. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడిగా, తెలంగాణ జాగృతి జిల్లా సాహిత్య విభాగంకన్వీనర్‌గా, శ్రీశ్రీ కళావేదిక మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా, తెలుగు భాషా పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్‌గా, అఖిల భారత పద్మశాలి సంఘం సాహిత్య, సాంస్కృతిక విభాగం చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.

సాహితీ రంగంలో గుర్తింపు..

గుర్రపు సత్యనారాయణ రెండు దశాబ్దాలుగా రచనలు రాస్తూ కవి, రచయితగా సాహితీ రంగంలో రాణిస్తూ మంచి గుర్తింపు పొందారు. అంతే కాదు తన దుస్తుల షాపునకు కూడా రచన అని పేరు పెట్టి సాహితీరంగంపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ప్రవృత్తిగా ఆయన అనేక కవితలు, కథలు, గేయాలు, పాటలు రచిస్తున్నారు. సమాజంలో జరుగుతున్న ఘటనలపై స్పందిస్తున్నారు. గుడుంబా నిర్మూలనలో ప్రజలను చైతన్య పరచేందుకు 'లేవాలి.. నిద్రలేవాలి.. మహిళాలోకం అనే గేయాల సంకలనాన్ని రచించి ఆవిష్కరించారు. మాజీ ప్రధాన మంత్రి పీవీ నర్సింహరావు జీవిత చరిత్రపై స్థితప్రజ్ఞుడు అనే పుస్తకాన్ని రాశారు. అంతేకాదు సాహిత్య ప్రక్రియల్లో పద్యం, నవల మినహా మిగతా అన్నిప్రక్రియలు మినీ కవితలు, కథ, గేయం, పాట, వ్యాసం, జీవిత చరిత్ర, సన్మాన పత్రాలు రాయడంలో ప్రావీణ్యముంది. ఆయన రాసిన ఎన్నో రచనలు ప్రముఖ దిన, వార, మాస పత్రికల్లో కూడా ప్రచురితమై ప్రజల ఆదరాభిమానాలు పొందాయి.


పీవీ నర్సింహరావు శతజయంత్యుత్సవాల్లో ఆయన జీవిత చరిత్ర స్థిత ప్రజ్ఞుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సత్యవతిరాథోడ్, శంకర్‌నాయక్, మాజీ కలెక్టర్ వీపీ గౌతమ్ (ఫైల్)

అందుకున్న అవార్డులు, సత్కారాలు..

ఎక్స్‌రే ఉత్తమ కవిగా అవార్డు రూ.5వేల నగదు, కళా సాహితీ అవార్డు, రూ.3 వేల నగదు, ఆంధ్రనాటక కళాసమితి అవార్డు, మట్టి కవితకు మానస సాహిత్య సాంస్కృతిక అకాడమీ అవార్డు, 2010లో రాష్ట్ర బెస్ట్ సిటిజన్ అవార్డు, 2012లో దాశరథి స్మారక పురస్కార అవార్డు (చెలిమి సాంస్కృతిక త్యాగరాయ గన సభలో, 2014లో తెలుగు పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఉగాది పురస్కారం అందుకున్నా రు. ఇక హైదరాబాద్ రవీంద్రభారతిలో కొన్నేళ్లక్రితం అప్పటి సీఎం నారా చంద్రబాబు చేతుల మీదుగా ఉత్తమకవిగా, రచయితగా సన్మానం పొందారు. దివంగత మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావు జీవిత చరిత్ర పుస్తకాన్ని రచించినందుకు గాను హైదరాబాద్‌లో నాటి జమ్మూకశ్మీర్ గవర్నర్ కేవీ కృష్ణారావు నుంచి సన్మానం పొందారు. 2007లో తిరుపతిలో జరిగిన తెలుగు భాష బ్రహ్మోత్సవాల్లో, 2012 డిసెంబరులో తిరుపతిలో జరిగిన నాలుగో ప్రపంచ తెలుగు మహాసభల్లో సత్కారాలు అందుకున్నారు. ఈ ఏడాది జనవరిలో విజయవాడలో తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు.


భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు నుంచి అవార్డు అందుకుంటున్న కవి, రచయిత గుర్రపు సత్యనారాయణ (ఫైల్)

రచనలకు మంచి గుర్తింపు..

సత్యనారాయణ తారణ, ఒక విజేత, విక్రమ, చిత్రభాను, ఊపిరి తదితర రచనలు చేయగా.. వాటికి మంచి గుర్తింపు వచ్చింది. మట్టి, మేలుకొలుపు, తదితర కవిత సంకలనాలు అందించారు. అభినందన చందనం, కల్యాణహారం, స్నేహశిఖరం, బ్యాలెట్ బ్యాలెట్, జయహో, రసగుళికలు మొదలగు గేయాలు రాసి పలువురి మన్ననలు పొందారు. అంతే కాకుండా దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ. నరసింహరావు జీవిత చరిత్ర, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిపై జయహో పేరుతో కవితా సంకలనం చేశారు.




వాకథాన్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి గౌతమి, ఎంపీ కడియం కావ్య

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

క్యాన్సర్‌ను జయించా..

అందరూ అవగాహన పెంపొందించుకోవాలి

- ప్రతీ ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి
- 'వాకథాన్'లో సినీ నటి గౌతమి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న గౌతమి, చిత్రంలో ఎంపీ కావ్య తదితరులు

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : తాను క్యాన్సర్ బారిన పడినప్పుడు.. భయపడకుండా.. దాన్ని జయించానని, అందరూ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని సినీనటి గౌతమి పిలుపునిచ్చారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి కాళోజీ కళాక్షేత్రం వరకు సుమారు రెండువేల మందితో వాకథాన్ నిర్వహించారు. అనంతరం బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో క్యాన్సర్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో గౌతమి మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, క్యాన్సర్ లక్షణాలను తొలిదశలోనే గుర్తించి మహమ్మారిని నాశనం చేయాలన్నారు. ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అనేక అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారని, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా అవసరమన్నా రు. గతంలో క్యాన్సర్ అంటే భయపడేవార ని, తనకు 32 రెండేళ్ల వయస్సులో క్యాన్సర్ వచ్చినా భయపడలేదన్నారు. సమాజంలో అవగాహన కల్పించాలని, క్యాన్సర్‌ను జయించి వచ్చానని పేర్కొన్నారు. తాను క్యాన్సర్ బారిన పడినప్పుడు చిన్న పాప ఉండేదని, పరీక్షలు చేసి చెప్పడానికి కూడా డాక్టర్లు చాలా బాధపడ్డారని గుర్తు చేశారు. ఇది తనకు మరో జన్మ అని అందరితోపాటు మూడు కిలోమీటర్లు నడిచానని తెలిపారు. ధూమపానం, మద్యపానం, పాన్, గుట్కా తదితర దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే ఎలాంటి వ్యాధులు దరిచేరవన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా క్యాన్సర్ రోగులకు పోషక ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని గౌతమి కోరారు. అనంతరం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల్లో సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్ యాక్సిడెంట్ లాంటిందని అభిప్రాయపడ్డారు.

క్యాన్సర్ చికిత్స ఖర్చుతో కూడుకున్న వైద్యం అయినందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్యాన్సర్ చికిత్స కోసం మరిన్ని నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతిమ ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ హరిణి బోయినపల్లి, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు, వైద్య విద్యా సంస్థల, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


కాళోజీ కళాక్షేత్రంలో అవగాహన సదస్సుకు హాజరైన వారు

మేడారం చిన్న జాతరకు ప్రత్యేక బస్సులు

- ఫిబ్రవరి 9 నుంచి హనుమకొండలో ఏర్పాటు
- మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం : ఆర్ఎం విజయభాను

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఈ నెలలో జరిగే మినీ మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మినీ మేడారం జాతర సందర్భంగా ఈనెల 9 నుంచి 16వ తేదీ వరకు 200 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు హనుమకొండ బస్టాండ్ ప్రాంగణం నుంచి ఉదయం 6 గంటల నుంచి మేడారానికి బస్సు సర్వీసులను నడపనున్నట్లు తెలిపారు. మహిళలకు ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సులలో మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని తెలిపారు. 24 గంటల పాటు ప్రయాణికుల రద్దీని బట్టి బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రైవేటు వాహనాల్లో వెళ్లకుండా సురక్షితమైన ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసి సమ్మక్క- సారలమ్మ దేవతల దర్శనం చేసుకోవాలని డి.విజయభాను తెలిపారు. వివరాల కోసం సెల్ నంబర్: 9959226056కు సంప్రదించాలని ఆయన కోరారు.

కలెక్టరేట్ ఎదుట సీపీఎం నాయకుల ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు కట్టివ్వాలని సీపీఎం నాయకులు మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు అందజేశారు. ధర్నాలో సీపీఎం నాయకులు సీపీఎం నాయకులు ఉపేందర్, రమేష్, మదన్ చారితో పాటు పెద్ద సంఖ్యలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లల హక్కులను పరిరక్షించాలి

సీపీకి చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫోరం వినతి

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పిల్లల హక్కుల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను మంగళవారం కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫోరం బాధ్యులు మండల పరుశురాములు ఒక ప్రకనటలో తెలిపారు. పిల్లల కూలీ పని నివారణ, బాల్య వివాహాల అరికట్టే చర్యలపై ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. కమిటీల్లో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్స్, స్వయం సహాయ సంఘాల సభ్యులు, స్థానిక స్వచ్ఛంద సంస్థలు, రిటైర్డు ఉద్యోగులను చేర్చి నెలనెలా సమీక్ష నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన సీపీ.. అడ్మిన్ డీసీపీకి మార్గనిర్దేశం చేసినట్లు పేర్కొన్నారు. సీపీని కలిసిన వారిలో తనతో పాటు సీఆర్ఏఎఫ్ కో-కన్వీనర్ పాలడుగుల సురేందర్ ఉన్నారన్నారు.

ప్రొఫెసర్ల పదవీ కాలం పొడిగింపు



ఉత్తర్వులు అందుకున్న ప్రొఫెసర్లతో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్యల పదవీ కాలం మరో ఏడాది పొడిగించారు. ఈ మేరకు బుధవారం నారాయణకు, వెంకయ్యలకు కేయూ పరిపాలన భవనంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు అందచేసి అభినందించారు. ప్రొఫెసర్ ఈసం నారాయణ, ప్రొఫెసర్ వై.వెంకయ్య ఇద్దరూ జువాలజీ విభాగానికి చెందినవారు. వీరిని పలువురు బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

20 నుంచి పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ రెగ్యులర్ పీజీ కోర్సుల మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి20 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫె సర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ ఎల్ సౌజన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 20, 22, 24, 27, మార్చి 1,3వ తేదీల్లో పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. పరీక్షలన్నీమధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రంగంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు వర్సిటీవెబ్‌సైట్‌లోచూడాలని కోరారు.



ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మంద రాజు

వడ్డెపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటీ సర్వసభ్య సమావేశం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో జాతీయ అధ్యక్షుడు కొమ్ముల బాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా మంద రాజు (వరంగల్ జిల్లా), రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అద్దంకి దేవదాసు (నల్గొండ జిల్లా), రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా భాస్కర్ దయాల్ (మహబూబ్‌నగర్ జిల్లా), రాష్ట్ర చీఫ్ అడ్వయిజర్‌గా బండారు రవి వర్ధన్ (యాదాద్రిభువనగిరి జిల్లా) ఎన్నికయ్యారు. జాతీయ అధ్యక్షుడు కొమ్ముల బాబు మాట్లాడుతూ ఉపాధ్యా యుల సంక్షేమం కోసం రాష్ట్ర కమిటీ కృషి చేయాలని కోరారు.

పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పరకాల శివారులో గుట్టుగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి ఐదుగురుని అదుపులోకి తీసుకొని రూ.13,600 నగదు, 4 ద్విచక్రవాహనాలు, 5 సెల్‌ఫోన్‌లు సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. పరకాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పట్టణ శివారులో పేకాట బెట్టింగ్‌కు పాల్పడుతున్నారనే పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్ టీం ఆధ్వర్యంలో శిబిరంపై దాడులు నిర్వహించగా ఐదుగురు పట్టుబడగా ముగ్గురు పరారైనట్లు తెలిపారు. పట్టుబడ్డ పేకాటరాయుళ్లను పరకాల పోలీసులకు అప్పగించామన్నారు.

అమర జవాన్‌కు ఘన నివాళి

మడికొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): భారత సైన్యంలో పని చేస్తూ వీర మరణం పొందిన మడికొండకు చెందిన ఆమంచ కోదండపాణి వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, స్థానికులు కోదండపాణి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమంచ శ్రీనివాస్, గుండా రవికుమార్, రమణమోహన్‌రావు, లడ్డు వెంకటేశ్, కాళేశ్వరపు రాము, బేరింగ్ రమేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మల్లారెడ్డిపల్లిలో పశు వైద్య శిబిరం

హసన్‌పర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పశువుల పెంపకంతోనే రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయమని పశువైద్యాధికారి అర్చనక్రాంతి అన్నారు. మండలంలోని మల్లారెడ్డిపల్లిలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం మంగళవారం నిర్వహించారు. శిబిరంలో పాడి పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పశువైద్య సిబ్బంది అల్తాఫ్, అజీమ్‌పాషా, ఎల్లస్వామి, రమేష్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ వై. రాజేశ్వర్‌రావు, గోపాలమిత్ర గూడ రాజేష్, రాజు, రజాక్ పాల్గొన్నారు.

అరూరి రమేశ్‌కు సంతోష్‌రెడ్డి పరామర్శ

రాంనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ తల్లి వెంకటమ్మ సోమవారం మృతి చెందింది. మంగళవారం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి వెంకటమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరూరి రమేశ్‌ను ఓదార్చారు. సంతోష్‌రెడ్డి వెంట హనుమకొండ బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, కార్యదర్శి బైరపాక వెంకటేశ్, వెంకటస్వామి ఉన్నారు.



వెంకటమ్మ మృతదేహానికి పూలమాల వేస్తున్న సంతోష్‌రెడ్డి

వర్గీకరణను అడ్డుకుంటేే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం



కాజీపేటలో మాట్లాడుతున్న గబ్బెట శ్రీనివాస్



ర్యాలీలో డీన్ సమ్మయ్య, ఎమ్మార్పీఎస్ నేతలు, ప్రొఫెసర్లు, స్కాలర్లు

మీడియా సమావేశంలో మాదిగ మహాజనుల వేదిక నేతలు

కాజీపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని, వర్గీకరణ సాధనలో భాగంగా ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన 'లక్ష డప్పులు - వెయ్యి గొంతుకల' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ మహాజనుల వేదిక కన్వీనర్ గబ్బెట శ్రీనివాస్ అన్నారు. కాజీపేట మీడియా పాయింట్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో మాదిగ సంఘ నాయకులు పసునూరి మనోహర్, బొల్లె కుమారస్వామి, ఆరూరి సాం బయ్య, కుమ్మరి కోటిలింగం, కుమ్మరి సాంబయ్య, మేకల రవీందర్‌లు మాట్లాడారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి మేధావులతో పాటు అన్ని రాజకీయ పార్టీల మాదిగ నేతలు భుజాన డప్పు వేసుకుని రావాలన్నారు. మాదిగల కోసం మందకృష్ణ మాదిగ చేస్తున్న న్యాయ పోరాటానికి మన వంతు కృషిచేయాలని చెప్పారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి ప్రభుత్వం వెంటనే అనుమతివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మీడియా పాయింట్ నుంచి డప్పు దరువు వేస్తూ కాజీపేట చౌరస్తా, సిద్ధార్థనగర్, అక్కడి నుంచి మళ్లీ కాజీపేట చౌరస్తా వరకు నాయకులు డప్పు దరువేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బరిగెల వినయ్, సందెల విజయ్, గాదెపాక రమేశ్, ఇమ్మడి రవి, బొక్క స్వామి, బొడ్డు దేవయ్య, మాతంగి నర్సింగరావు, గడ్డం అశోక్, గబ్బెట ఎల్లేశ్, సిరిపాక కుమారస్వామితోపాటు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలి

కేయూక్యాంపస్ : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాదిగలకు న్యాయం చేయాలని కేయూ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య డిమాండ్ చేశారు. బుధవారం కే యూ క్యాంపస్‌లో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే 'లక్ష డప్పులు - వేల గొంతుకలు' ర్యాలీకి మద్దతుగా వర్సిటీ ప్రొఫెస ర్లు, ఎమ్మార్పీఎస్ శ్రేణులు, స్కాలర్లు, విద్యార్థులు మహాప్రదర్శనలు చేశా రు. డప్పులతో వర్సిటీలో దూం.. ధాం.. చేశారు. రెండో గేటు నుంచి వర్సిటీ ప్రధాన లైబ్రరీ వరకు సాగిన ప్రదర్శనకు డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సినీ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్, ఎమ్మార్పీఎస్ నేత లు మంద కుమార్, బొడ్డు దయాకర్, పుల్లా శ్రీనివాస్, సంకి నేని వెంకట్, గజ్జెల మల్లేశ్, మంద వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు సీఎం కట్టుబడి ఉండాలి



వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లో డప్పులు మోగిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

వడ్డెపల్లి : ఎస్సీ వర్గీకరణ రాష్ట్రంలో మొదటిసారిగా అమ లు చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన ప్రకటనకు కట్టుబడి ఉండాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి తాళ్లపల్లి విజయ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణను జాప్యం చేయ కుండా వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన 'లక్ష డప్పులు - వేల గొంతుకల' సాంస్కృతిక మహా ప్రదర్శనను విజయ వంతం చేయాలని కోరుతూ మంగళవారం హనుమకొండ వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు డప్పులను మోగించారు. ఈ కార్యక్రమంలో వడ్డెపల్లి డప్పు కళాకారుల సంఘం అధ్యక్షుడు చింటు రత్నం, పవన్, ఎమ్మార్పీఎస్ జిల్లా నేతలు కోటి, ఇల్లందుల భాస్కర్, రాసమల్ల రూపోస్, బాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ కావ్యారావు

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని ఒయాసిస్ ఫెర్టిలిటీ రీజినల్ మెడికల్ హెడ్ డాక్టర్ జలగం కావ్యారావు అన్నారు. మంగళవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. క్యాన్సర్ నిర్ధారణ అయిన తర్వాత కెనియో థెరపీకి వెళ్లాల్సి వచ్చినప్పుడు పిల్లలు లేని యువతీ, యువకుల స్పెర్మ్ సంరక్షించి ఐవీఎఫ్ ప్రక్రియ ద్వారా ఆరోగ్యకరమైన శిశువును పొందే అత్యాధునిక సౌకర్యం ఒయాసిస్ ఫర్టిలిటీలో ఉందని తెలిపారు. రఘునాథపల్లి మండలం జాఫర్‌గూడెంకు చెందిన వరాల స్వరూప- రవి దంపతులకు ఫెర్టిలిటీ ద్వారా ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిచ్చారని ఆమె అన్నారు.

32 మంది వాహనదారులకు జరిమానా

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘించిన 32 మంది వాహనదారులకు న్యాయమూర్తి రాజశేఖర్‌రెడ్డి జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి ఒక ప్రకనటలో తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 32 మందిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా 30 మందికి రూ. 35,500 జరిమానా విధించగా, కన్నెబోయిన సత్యం, సయ్యద్ సలీంలకు కమ్యూనిటీ సర్వీసింగ్ శిక్ష విధించి మున్సిపాలిటి సర్కిల్ ఇన్‌చార్జ్ కార్యాలయానికి అప్పగించినట్లు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి పట్టుబడ్డ రూ.1,000 జరిమానా విధించారన్నారు. మైనర్‌కు రూ. 600 జరిమానా విధించామన్నారు.

ఏపీవోను వెంటనే రిలీవ్ చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ డీఈవో కార్యాలయంలో ఏపీవోగా పనిచేస్తున్న ఆర్.రాజగోపాల్ రెడ్డితో పాటు జూనియర్ అసిస్టెంట్ కె.మనోజ్‌కుమార్‌ను వెంటనే రిలీవ్ చేయాలని ఈ నెల 1న కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 31న కలెక్టర్ కార్యాలయంలో డీఈవో కార్యాలయ సిబ్బంది, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో రాజగోపాల్ రెడ్డిపై వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు చేసిన ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ ఏపీవోను వెంటనే రిలీవ్ చేసి 24 గంటల్లో రిపోర్టును అందజేయాలని ఆమె డీఈవోను ఉత్తర్వుల్లో ఆదేశించారు. కాగా మనోజ్‌కుమార్‌ను రిలీవ్ చేయగా రాజ్‌గోపాల్‌రెడ్డిని ఇప్పటి వరకు రిలీవ్ చేయలేదు.

అనాథ వృద్ధురాలికి సీఐ ఆదరణ



అనాథ వృద్ధురాలిని చేరదీస్తున్న ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్

మడికొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మడికొండలోని బురుజు వద్ద అస్వస్థతకు గురై కింద పడిపోయి బాధపడుతున్న అనాథ వృద్ధురాలిని మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ చేరదీసి వైద్య చికిత్స చేయించి మానవత్వం చాటుకున్నారు. తమిళ నాడుకు చెందిన షర్మిలాదేవి కొన్నేళ్ల కిందట మడికొండకు చేరు కొని ఇక్కడే ఉంటూ యాచిస్తోంది. కాగా, మంగళవారం ఆమె తీవ్ర అస్వస్థతకు గురై స్థానిక బురుజు వద్ద కింద పడిపోయి ఉండటాన్ని గమనించిన ఓవ్యక్తి స్థానిక ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన ఆ ప్రదేశానికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ కిషన్.. వృద్ధురాలిని చేరదీసి దర్గా కాజీపేటలోని మదర్ ఫౌండేషన్ అనాథ శరణాలయానికి తరలించారు. అక్కడ ఫౌండేషన్ నిర్వాహకులు వృద్ధురాలికి స్నానం చేయించి నూతన వస్త్రాలు ధరింపజేసి చికిత్స అందించారు.



మడికొండలో స్వాధీనం చేసుకున్న గుట్కాలతో పోలీసులు

భారీగా గుట్కాల పట్టివేత

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు భారీ మొత్తంలో ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. కాజీపేట పీఎస్ పరిధిలోని బాపూజీనగర్ మెయిన్ రోడ్డులో వ్యాపారం నిర్వహిస్తున్న మల్లయ్య ఇంట్లో టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్ సోదాలు చేసి ఆయన నుంచి రూ.50 వేల విలువ చేసే గుట్కాలు స్వాధీనం చేసుకున్నారన్నారు. కేయూసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భీమారం క్రిష్ణకాలనీకి చెందిన లింగంపల్లి వెంగళ్‌రావు నుంచి సీఐ మేకల రంజిత్ టీం రూ.10,700 విలువ చేసే గుట్కాలు స్వాధీనం చేసుకోగా, హసన్‌పర్తి పీఎస్ పరిధిలోని ఆర్‌టీసీ కాలనీలో వ్యాపారి కామారపు బుచ్చిరాజులు నుంచి రూ.29,240 విలువ చేసే గుట్కాలు స్వాధీనం చేసుకున్నారన్నారు. మడికొండ పీఎస్ పరిధిలో బీసీ కాలనీకి చెందిన రవికంటి చంద్రశేఖర్ నుంచి సీఐ లవణ్‌కుమార్ టీం రూ.1,96,800 విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారన్నారు.

ఆర్‌అండ్‌బీలో కానరాని సమయపాలన

- 11 గంటలు దాటినా ఆఫీస్‌కు రాని అధికారులు
- వచ్చిన వారు కూడా మధ్యాహ్నం 2 గంటలకే బయటకు..



ఆర్‌అండ్‌బీ ఆఫీస్‌లో అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు లేక ఎంతో మంది నిరుద్యోగులు రోడ్లపై చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వ కొలువు సాధించి సమయ పాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా అధికారుల తీరుపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. హనుమకొండలోని నక్కలగుట్ట ఆర్అండ్‌బీ జిల్లా కార్యాలయంలో మంగళవారం అధికారులు ఉదయం 11 గంటలు దాటినా కొంతమంది అధికారులు వివిధ కారణాలతో కార్యాలయానికి రాలేదు. కొంతమంది అధికారులు, కార్యాలయ సిబ్బంది మధ్యాహ్నం 2గంటలకే కార్యాలయ కుర్చీలు ఖాళీ చేసి వ్యక్తిగత పనుల కోసం గంటల తరబడి బయటకు వెళ్లి వస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఆర్అండ్‌బీ సెక్షన్ కార్యాలయంలో అధికారులు ఎవరూ లేకపోవడంతో కార్యాలయం బోసి పోయింది. ఈ విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడగా ఇంజనీరింగ్ విభాగంలో సమయ పాలన అనేది ఏమీ ఉండదని, వ్యక్తిగత పనుల కోసం వెళ్లి మళ్లీ వస్తారని, అవసరం ఉన్నప్పుడు ఎక్కువ సమయం పని చేస్తారని చెప్పడం గమనార్హం. ఇప్పటికైనా కార్యాలయంలో పని చేసే సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించేలా ఉన్నతాధికారులు సిబ్బందిపై దృష్టి సారించి విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బతుకమ్మ బండ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలి



బతుకమ్మ బండ భూమి స్థలంలో మాట్లాడుతున్న నాగరాజు

వడ్డెపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ 60వ డివిజన్‌లోని వడ్డెపల్లి ప్రాంతంలో గల బతుకమ్మ బండ ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత, మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. బతుకమ్మ బండ భూమిని వడ్డెపల్లికి చెందిన కొందరు చదును చేస్తుండగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అడ్డుకొని పనులను నిలిపివేయించారు. ఈ సందర్భంగా ఎనుకొంటి నాగరాజు మాట్లాడుతూ.. వడ్డెపల్లి శివాలయం ప్రాంతంలో రిజిస్ట్రేషన్ ఆఫీస్ దగ్గర వడ్డెపల్లి రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 690లో 33 గుంటల విస్తీర్ణం గల ప్రభుత్వ భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉందన్నారు. కొంత మంది భూ కబ్జాదారులు ఈ ప్రభుత్వ భూమిపై కన్నేసి కబ్జాకు యత్నిస్తున్నారని, దీన్ని పలుమార్లు అడ్డుకున్నామని పేర్కొన్నారు. మంగళవారం వడ్డెపల్లికి చెందిన కొందరు ఈ భూమిని చదును చేస్తుండగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులంతా కలిసి అడ్డుకున్నామని చెప్పారు. కబ్జా విషయాన్ని కలెక్టర్‌తోపాటు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో వడ్డెపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలు మిడిదొడ్డి భిక్షపతి, అడప రాజేందర్, అల్లం రాజన్న, ఎనుకొంటి పున్నం చందర్, తాళ్లపల్లి విజయ్ కుమార్, రవీందర్, ఏ నాగరాజు, శేఖర్, కమల్, బీ నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



మాట్లాడుతున్న కిట్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధీర్

హసన్‌పర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే నిరుపేద విద్యార్థులే చదువులో ఉన్నతంగా రాణించి కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఫలితాలు సాధించాలని కిట్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగమల్ల సుధీర్ పిలుపునిచ్చారు. మంగళవారం కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని హరిజన వాడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బొక్క కుమార్, సభ్యులు కాలె యాదగిరి, కీర్తి సూరయ్య, మండల భిక్షపతి, చెన్నూరి సత్యనారాయణ, గుండమీది భాస్కర్, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రిజిస్ట్రార్ రామచంద్రానికి అభినందనలు



రిజిస్ట్రార్‌ను సన్మానిస్తున్న డాక్టర్ కొట్టే భాస్కర్, తదితరులు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా నియమితులైన ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రానికి మంగళవారం వర్సిటీ మండలి సభ్యులు, ఉద్యోగ సంఘాల నేతలు శాలువా, పుష్పగుచ్ఛం అందచేసి ఘనంగా సన్మానించారు. వర్సిటీ రిజిస్ట్రార్ చాంబర్‌లో కలిసిన వారిలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేశ్‌లాల్, చిర్రా రాజుగౌడ్, ఎం.నవీన్, బి.రమ, సుకుమారి, ఎస్డీఎల్‌సీఈ ఎస్సీ, ఎస్టీ సంఘం అధ్యక్షకార్యదర్శులు కొట్టే భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా సుదర్శన్



రాంనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా హనుమకొండ మచిలీబజార్‌కు చెందిన సీనియర్ నాయకుడు రావుల సుదర్శన్‌ను నియామకమైనట్లు జిల్లా ఎన్నికల అధికారి పెద్దోళ్ల గంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, 40 యేళ్లుగా పార్టీకి సేవలందిస్తున్న తనను గుర్తించి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమించినందుకు బీజేపీ పార్టీ పెద్దలకు సుదర్శన్ కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్యాషన్




కాటన్ వస్త్రాల్లో 'బగ్రు' ప్రింట్లకు ప్రపంచవ్యాప్త ఆదరణ ఉంది. వేసవి కాలం రాబోతోంది కాబట్టి ఆకట్టుకునే డిజైన్లలో రూపొందుతున్న బగ్రు కాటన్ కుర్తీల గురించి తెలుసుకుందాం!

భలే బగ్రు

ఇలా మ్యాచ్ చేయాలి

మొక్కలు, మట్టి, సేంద్రియ పదార్థాల నుంచి సేకరించిన రంగులతో భిన్నమైన డిజైన్లను ముద్రించుకున్న బగ్రు కుర్తీలు ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. మెత్తగా, సౌకర్యంగా ఉండే ఈ కుర్తీలను లెగింగ్, జీన్స్‌తో కలిపి ధరించవచ్చు. ఎక్కువగా ముదురు రంగులను కలిగి ఉండే బగ్రు కుర్తీలు అన్ని వయసుల మహిళలకూ అనువుగా ఉంటాయి. టెర్రకోటా, ఆక్సిడైజ్‌డ్ జ్యువెలరీ ఈ రకం దుస్తులకు చాలా బాగా నప్పుతుంది. ఒంటె తోలుతో తయారయ్యే రాజస్థానీ జూతీలు ఇలాంటి కుర్తీలకు బ్రహ్మాండంగా మ్యాచ్ అవుతాయి. ప్రింటెడ్ కాటన్‌ను ఇష్టపడేవాళ్లు, ఉద్యోగస్తులు వెలసిపోని, మన్నికైన, సౌకర్యవంతమైన బగ్రు కుర్తీలను నిస్సందేహంగా ఎంచుకోవచ్చు.

బగ్రు ప్రింట్ ఒక రకానికి చెందిన హ్యాండ్ బ్లాక్ ప్రింట్. వందేళ్ల క్రితం చిప్ప అనే కులానికి చెందినవాళ్లు, సహజ రంగులను ఉపయోగించి ఈ ప్రింట్లను ముద్రించడం మొదలుపెట్టారు. రాజస్థాన్‌లోని బగ్రు అనే ప్రాంతానికి పరిమితమైన ఈ బగ్రు ప్రింట్లు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందాయి. వీటిని ముద్రించడం కోసం, డిజైన్లతో కూడిన చెక్క బ్లాకులను ఉపయోగించడం విశేషం. ప్రింట్లు వినూత్నంగా ఉండడం, వాటి కోసం సహజ రంగులను ఉపయోగించడం, కాటన్ వస్త్రాల మీదే ప్రింట్లను ముద్రించడం వల్ల, ప్రత్యేకించి వేసవిలో బగ్రు ప్రింట్ల దుస్తులకు ఆదరణ పెరుగుతూ ఉంటుంది.





ఇలా గుర్తించాలి

బగ్రు వస్త్రాలు పక్షులు, పూలు, వాటిని కలుపుతూ అల్లుకునే లతల డిజైన్లతో రూపొందుతూ ఉంటాయి. జామెట్రిక్ డిజైన్లలో కూడా ఈ వస్త్రాలు రూపొందుతూ ఉంటాయి. అయితే పెద్ద ప్రింట్లు ఉండేవే అసలైన బగ్రు అని గుర్తించాలి. అలాగే ప్రింట్ చుట్టూరా కొట్టొచ్చినట్టుండే నల్లని గీత గీసి ఉంటుంది.

\- ఉన్నతి సిల్క్స్ సౌజన్యంతో...

పల్లె వెలుగు

అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చిన ఆమె ఎన్నో అవహేళనలు ఎదుర్కొన్నారు. ఒత్తిడులను, వేధింపులను తట్టుకొని నిలబడ్డారు. నిధులకోసం కోర్టు మెట్లు సైతం ఎక్కారు.అందుబాటులో ఉన్న వనరులన్నిటినీ సద్వినియోగం చేసుకున్నారు. అన్ని పనుల్లో స్వయంగా శ్రమిస్తూ, గ్రామాన్ని ప్రగతి పథంలో నిలిపారు. తన కృషికి గుర్తింపుగా ఇటీవల కేంద్ర పంచాయతీరాజ్ శాఖ నుంచి పురస్కారం అందుకున్న గుంటూరు జిల్లా గొడవర్రు గ్రామ సర్పంచ్ బీరం జానకీదేవితో 'నవ్య' సంభాషణ.



"సర్పంచ్‌గా గెలవగానే అభినందనలతోపాటు అవహేళనలు కూడా నాకు తీవ్రంగానే ఎదురయ్యాయి. "చదివింది ఇంటర్. పరిపాలన ఏం చెయ్యగలవు?" అని కొందరు, "మహిళవు. ఊరికోసం చొరవ తీసుకొని కష్టపడలేవు" అని ఇంకొందరు... ఇలా ఎంతో మంది నిరుత్సాహపరిచారు. పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే... "ప్రతి వివరం మీతో చెప్పలేం కదా! అయినా కార్యాలయాల చుట్టూ మీరెక్కడ తిరుగుతారు? ఎవరినైనా పంపవచ్చు కదా" అనే సలహాలు వినిపించేవి. ఈ మాటలన్నీ నాలో పట్టుదల పెంచాయి. సాధారణంగా మహిళలు పదవుల్లో ఉంటే... పెత్తనం, పాలన పురుషులు చేస్తూ ఉంటారు. ఈ సంస్కృతికి నేను వ్యతిరేకం. ఇల్లు చక్కదిద్దగలిగే మహిళలకు ఊరు బాగు చేయడం కూడా తెలుసని నిరూపించాలని నిశ్చయించుకున్నాను.

కత్తిమీద సాము...

మాది గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలోని గొడవర్రు గ్రామం. మా నాన్న ఇక్కుర్తి శివనాగేశ్వరరావు, తల్లి ఉమామహేశ్వరి. వ్యవసాయమే జీవనాధారమైన మధ్యతరగతి కుటుంబం. నన్ను ఇంటర్ వరకూ చదివించాక... పెళ్లి చేశారు. నా భర్త వెంకటేశ్వరరావు కూడా రైతే. మాకున్న ఎకరా పొలంతోపాటు మరి కొంత భూమి కౌలుకు తీసుకున్నాం. ఇంటి పనులు, పొలం పనులతో కాలం గడిచేది. కాగా... మా మామగారు 1995లో... గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. అప్పటినుంచి మా కుటుంబం రాజకీయాలకూ దూరంగానే ఉంటూ వచ్చింది. కానీ మా కుటుంబంలో ఎవరో ఒకరు సర్పంచ్ కావాలనేది ఆయన బలమైన కోరిక. కిందటి ఎన్నికలలో ఆ అవకాశం నాకు అనూహ్యంగా, నన్ను వెతుక్కుంటూ వచ్చింది. మొదట వద్దనుకున్నాను. కానీ కుటుంబం, సన్నిహితులు ప్రోత్సహించడంతో పోటీ చేశాను. ప్రజలు కూడా మద్దతు ఇచ్చారు. పార్టీలతో సంబంధం లేకుండా అన్ని వర్గాలవారు ఓటు వేసి గెలిపించారు. పదవి అంటే అలంకారప్రాయం కాదనీ, ఎన్నో రాజకీయాలను, కుట్రలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, జనం మెప్పు పొందడం కత్తి మీద సాము అని తక్కువ కాలంలోనే తెలుసుకున్నాను.

కూలీగా వెళ్లాను...

మాది మూడువేల మంది జనాభా ఉన్న గ్రామం. అయితే ఏ పని చెయ్యాలన్నా గత ప్రభుత్వ కాలంలో నిధులు లేని పరిస్థితి. దీంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల్‌జీవన్ మిషన్, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, స్వచ్ఛ భారత్ సద్వినియోగం చేసుకోవాలనుకున్నాను. అయితే వాటిని కూడా సరిగ్గా అందనివ్వలేదు. దానికోసం పోరాడాను. అధికారులను నిలదీశాను. చివరకు ఒక దశలో... పంచాయతీలకు దామాషా ప్రకారం అందాల్సిన నిధుల కోసం కోర్టుకు వెళ్లాల్సి వచ్చింది. న్యాయపరంగా పోరాడి నిధులు సాధించుకోగలిగాం. మరోవైపు గ్రామాన్ని పీడిస్తున్న సమస్యల పరిష్కారం మీద దృష్టి పెట్టాను. గ్రామానికి వస్తున్న నీరు ఆకుపచ్చగా, దుర్గంధభరితంగా ఉండడంతో... వాటిని తాగినవారు రోగాల బారిన పడేవారు. ఇది నన్ను తీవ్రంగా కలచివేసింది. సురక్షిత జలాల సరఫరా కోసం జల్‌జీవన్ మిషన్ నిధులు రూ .4.8 లక్షలతో 980 మీటర్ల పొడవున కొత్త పైప్‌లైన్లు, కొత్త కొళాయిలు వేయించాం. చెరువులో నీటిని శుద్ధి చేసి పంపడానికి కావలసిన ఫిల్టర్ బెడ్స్ దెబ్బతిన్నాయి. వాటిని బాగుచేయించడానికి నిధులు అడిగితే పట్టించుకున్నవారు లేరు. ఆఖరుకు దాతల సహకారంతో తాత్కాలిక మరమ్మతులు చేయించి, సురక్షిత నీటిని అందించగలిగాం. జల్‌జీవన్ మిషన్ నిధులను సద్వినియోగం చేసుకొని, అభివృద్ధి సాధించిన సర్పంచ్‌లుగా... ఆంధ్రప్రదేశ్ నుంచి అయిదుగురు ఎంపికైతే... వారిలో నేనూ ఉన్నాను. ఇక, ఉపాధిహామీ నిధులతో చెరువును బాగుచేయాలనుకున్నప్పుడు మరో సమస్య ఎదురయింది. కూలీల హాజర్లు పడుతున్నాయి, పనులు మాత్రం జరగడం లేదు. అలా వదిలేస్తే లాభం లేదని... నేను కూడా ఒక కూలీగా వెళ్లి, వారితో కలిసి పని చేశాను. పూడిక తీత, చెరువు కట్టలను పటిష్టం చేయడం లాంటి పనులన్నీ వారి వెంటే ఉండి చేయించాను. ఈ పథకంతో ఒక క్లినిక్ కూడా నిర్మించుకోగలిగాం. ఉపాధి హామీ నిధులతో సాధించిన అభివృద్ధిలో... రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచాం. గ్రామంలో... రూ. 50 లక్షలతో మొత్తం సిమెంట్ రోడ్లను దాదాపు పూర్తి చేశాం. కాలువల అంచులపై గడ్డి మొలవకుండా... నేనూ వెళ్లి మందులను పిచికారీ చేస్తాను. అవసరమైతే నీరు కూడా మోసుకొస్తాను. ఏదీ నామోషీగా భావించను.

ఎన్నారైల చొరవతో...

మా గ్రామం చిన్నది కావటంతో జనాభా ప్రాతిపదికన వచ్చే నిధులు చాలక దాతల సహకారం తప్పనిసరి అయింది. దూర ప్రాంతాల్లో స్థిరపడిన మా గ్రామస్తులు, ముఖ్యంగా ఎన్నారైలు ఎప్పుడు ఊరికి వచ్చినా... గ్రామాభివృద్ధి కోసం సాయం చేయమని నిర్మొహమాటంగా అడుగుతాను. ఇటీవలే ఎన్నారై మద్దినేని శ్రీనివాస్ గ్రామంలో తాగునీటి ఇబ్బందులు గుర్తించి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు రూ. 10 లక్షలు సాయం చేయటానికి ముందుకు వచ్చారు. నా సోదరుడు, మరికొందరు కలసి గ్రామంలో ఎల్.ఇ.డి లైట్లను రూ. 3 లక్షలతో వేయించారు. మైకులు పెట్టించి వాటిద్వారా జనానికి సమాచారం ఇవ్వటం, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన దరఖాస్తుల వివరాలు తెలియచెయ్యటం లాంటివి చేస్తున్నాం. ఇటీవలే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుగారిని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌గారిని కలిశాం. గ్రామాభివృద్ధికి సహకారం అందించాలని కోరాం. వారినుంచి సానుకూల స్పందనే వచ్చింది. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ గణతంత్ర దినోత్సవం రోజున... దేశంలోని వివిధ గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు పురస్కారాలు అందించింది. స్వచ్ఛ భారత్, జాతీయ ఉపాధి హామీ పథకం, జల్‌జీవన్ మిషన్ లాంటి వాటిని సద్వినియోగం చేసుకుని గ్రామాన్ని ఉన్నత స్థానంలో నిలిపినందుకు వీటిని ఇచ్చారు. మిగిలిన సర్పంచ్‌లంతా స్వచ్ఛ పురస్కారాలను అందుకుంటే, నాకు అదనంగా కేంద్ర జలవనరుల శాఖ నుంచి కూడా పురస్కారం దక్కింది. ఈ గౌరవం గ్రామాభివృద్ధికి సహకరించినవారందరికీ చెందుతుంది."

రాజకీయంగా దెబ్బతియ్యాలని చూశారు..

గత ప్రభుత్వ కాలంలో... రెండున్నరేళ్ల క్రితం ఒక్క రూపాయైనా పంచాయతీ దగ్గర లేకపోవడంతో... మాకు రావలసిన నిధుల కోసం పోరాడాను. అప్పుడు కొందరు కక్షగట్టి, రాజకీయంగా దెబ్బతియ్యాలని చూశారు. నా చెక్ పవర్ రద్దు చేయించటానికి ప్రయత్నించారు. సర్పంచ్‌గా గెలిచినప్పుడు అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబుగారిని కలిశాం. సర్పంచ్‌లందరం టీడీపీ కండువాలు వేసుకుని వెళితే... ఆయన కండువాలు తీయించేశారు. "మీరు సర్పంచ్‌లు. ఊరికోసం పాటుపడండి. రాజకీయాలు పక్కనపెట్టండి" అన్నారు. ఆ స్ఫూర్తితో... నన్ను శత్రువుగా భావించినవారినికూడా సొంతవారిగా మార్చుకోగలిగాను. 'వైఎస్ఆర్ ఆసరా' అందాల్సిన అర్హులను తొలగించినప్పుడు, సచివాలయాన్ని ఆలయ భూముల్లో ఊరికి దూరంగా నిర్మించేందుకు ప్రయత్నించినప్పుడు ప్రతిఘటించాను. తమకు అనుకూలంగా తీర్మానం చెయ్యాలని అనేక విధాలుగా ఒత్తిడి తెచ్చారు. బెదిరించారు. భయపడలేదు. కోర్టుకు వెళ్లి 'ఆసరా'ను మంజూరు చేయించగలిగాను. ఇవన్నీ చూశాక నాపై గ్రామస్తులకు చాలా నమ్మకం కలిగింది. ఒకానొక సమయంలో ఊరికోసం వ్యతిరేకంగా పనిచేసేవారిని ఒప్పించడం కోసం... వారి కాళ్లు పట్టుకోటానికి కూడా వెనకాడలేదు.




• తిరుమలశెట్టి శేషగిరిరావు, తెనాలి
ఫొటోలు: ధూళిపాళ్ల శ్రీధర్

నకిలీ కుంకుమ పువ్వుని గుర్తించండి ఇలా..!

తీపి పదార్థాలతోపాటు కొన్ని రకాల గ్రేవీల తయారీలో కుంకుమపువ్వును ఉపయోగిస్తుంటారు. కుంకుమ పువ్వు... ఘాటైన వాసనతో కొద్దిపాటి చేదు రుచితో ఉంటుంది. ఈ కారణంగానే ఆహార పదార్థాలకు ప్రత్యేక రుచి చేకూరుతుంది. నకిలీ కుంకుమపువ్వు వల్ల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉంటుంది. కొన్ని చిట్కాల ద్వారా నకిలీని గుర్తించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

- ఒక చిన్న గ్లాసు నీటిలో కుంకుమపువ్వు రేకులు మూడింటిని వేసి కలపాలి. నీళ్ల వెంటనే రంగు మారితే అవి నకిలీవని గుర్తించాలి. నిజమైన కుంకుమపువ్వు రేకులు రంగు విడవడానికి చాలా సమయం తీసుకుంటాయి. ఇవి పాలు, నీళ్ల సహా ఏ ద్రవంలోనూ కరగవు.
- కుంకుమ పువ్వు రేకులు ఎరుపు రంగులో ఉంటాయి. కానీ వాటిని ఆహార పదార్థాల్లో కలిపినప్పుడు లేత పసుపు రంగుని విడుస్తాయి. రేకులు వేసిన నీళ్ల లేదా పాలు ఎరుపు రంగులోకి మారినా రేకులు రంగు వెలిసి కనిపించినా అవి నకిలీవని తెలుసుకోవచ్చు.
- రెండు రేకులను నోట్లో వేసుకుని నమిలితే నోరంతా చేదుగా అవుతుంది. అలా కాకుండా నాలుకమీద తీపిదనం తెలిస్తే అవి నకిలీవని గుర్తించాలి.
- రేకులకు నిప్పు పెడితే అవి మండని పక్షంలో శుద్ధమైన కుంకుమ పువ్వుగా గుర్తించాలి. నకిలీ రేకులు వెంటనే మండిపోతాయి.
- శుద్ధమైన కుంకుమ పువ్వు ...మట్టి, గడ్డి, తేనె వాసనల కలయికతో ఉంటుంది. నకిలీదానికి ఎటువంటి వాసన ఉండదు.
- ఒక కప్పు నీటిలో రెండు కుంకుమ పువ్వు రేకులు వేసి పది నిమిషాలు నానబెట్టాలి. తరవాత ఈ రేకులను నీళ్లలో నుంచి తీసి వేళ్లతో నలిపితే అవి చిన్న ముక్కలు కాని పక్షంలో శుద్ధమైనవని గుర్తించాలి. రేకులు తెగిపోతుంటే మాత్రం నకిలీవని తెలుసుకోవచ్చు.



గోరింటాకుతో కురులు ఆరోగ్యంగా...

గోరింటాకులో యాంటీ ఫంగల్, యాంటీ మైక్రోబియల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శిరోజాలు ఆరోగ్యంగా పెరగడానికి దోహదం చేస్తాయి. గోరింటలోని ఫ్రీరాడికల్స్... మాడు మీద హానికారక సూక్ష్మక్రిములను నాశనం చేస్తాయి. గోరింటాకుతో శిరోజాలను అందంగా ఎలా మార్చుకోవాలో తెలుసుకుందాం!

- గోరింటాకును మెత్తగా రుబ్బి తలకు పట్టించాలి. అరగంటసేపు ఆరిన తరవాత తేలికపాటి షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే శిరోజాలకు పోషణ అంది చక్కగా పెరుగుతాయి. మాడు మీద దురద, చుండ్రు, కురుపులు లాంటి సమస్యలు రావు.
- గుప్పెడు గోరింట ఆకులను ఒక కప్పు కొబ్బరి నూనెలో వేసి బాగా మరిగించి వడకట్టాలి. రాత్రి పడుకునే ముందు ఈ నూనెని చేతి వేళ్లతో తీసుకుని మాడుకు పట్టేలా మర్దన చేయాలి. పలుచని వస్త్రాన్ని తలకు కట్టుకోవాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో తల స్నానం చేయాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే వెంట్రుకల కుదుళ్లు గట్టిపడి జుట్టు రాలడం, నెరవడం లాంటి సమస్యలు తగ్గుతాయి.
- ఒక కప్పు గోరింటాకు పొడిలో రెండు చెంచాల మెంతి పొడి, ఒక చెంచా శీకాయ పొడి, ఒక చెంచా ఉసిరి పొడి వేసి అర కప్పు టీ డికాషన్‌తో ముద్దలా కలపాలి. దీనిని తల వెంట్రుకలకు, మాడుకు పట్టించాలి. అరగంట తరవాత గోరువెచ్చని నీళ్లతో తల స్నానం చేస్తే శిరోజాలు రాలడం తగ్గి నల్లగా ఒత్తుగా నిగారిస్తాయి.
- ఒక కప్పు గోరింటాకు పొడిలో రెండు చెంచాల కాఫీ పొడి, ఒక చెంచా మందార నూనె వేసి నీళ్లతో కలిపి తలకు పట్టిస్తే జుట్టు నెరవడం తగ్గుతుంది.
- గోరింట పొడిని గుడ్డు తెల్లసొనతో కలిపి తలకు పట్టించి రెండు గంటల తరవాత శీకాయ పొడితో తలస్నానం చేస్తే తల వెంట్రుకలు నున్నగా మెత్తగా మెరుస్తాయి.
- ఒక కప్పు బ్లాక్ టీలో అర కప్పు గోరింట పొడిని కలిపి రాత్రంతా నాననివ్వాలి. ఉదయాన్నే ఈ మిశ్రమంలో కొద్దిగా పెరుగు కలిపి తలకు పట్టించి ఇరవై నిమిషాల తరవాత తలస్నానం చేస్తే జుట్టు రాలడం తగ్గుతుంది.



విజేత



ప్రియమైన విజయం

ప్రియాంక ఇంగ్లే... నిన్నటివరకు ఈ పేరు పెద్దగా తెలియదు. కానీ మొట్టమొదటి ఖోఖో ప్రపంచ కప్ గెలిచిన జట్టు సారథిగా ఇప్పుడామె దేశమంతటికీ సుపరిచితురాలు. అనుభవం... నైపుణ్యం... పటిష్టమైన వ్యూహాలతో భారత మహిళా జట్టుకు అపురూప విజయాన్ని అందించిన ఆమె... ఈ స్థాయికి రావడానికి ఎన్నో సవాళ్లను అధిగమించింది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా... అహర్నిశలూ శ్రమించి తన కలను నిజం చేసుకున్న 24 ఏళ్ల ప్రియాంక కథ ఇది.

'ఎంతో గర్వంగా అనిపిస్తోంది'... భారత మహిళల జట్టు మొట్టమొదటి ఖోఖో ప్రపంచ కప్ గెలిచిన తరువాత ప్రియాంక ఇంగ్లే ఉద్వేగంగా చెప్పిన మాటలివి. వాస్తవానికి దానికి మించిన ఆనందం ఆమెకు మరొకటి ఉంది. అదే ఖోఖోకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు రావడం... తనలాంటి గ్రామీణ క్రీడాకారులు ప్రతిభను నిరూపించుకోవడానికి అద్భుతమైన అంతర్జాతీయ వేదిక ఒకటి అవతరించడం. గత నెల ఢిల్లీలో జరిగిన ఈ మెగా టోర్నీలో పాతిక దేశాలు తలపడ్డాయి. ప్రియాంక నేతృత్వంలోని భారత జట్టు... మ్యాచ్ మ్యాచ్‌కూ పరిణతి కనబరుస్తూ... వరుస విజయాలతో దూసుకుపోయింది. ప్రపంచ కప్‌ను ముద్దాడింది. 'ఇంతకుముందు చాలామందికి ఈ ఆట గురించి తెలియదు. ఖోఖో అనగానే అదేదో పాఠశాల స్థాయి క్రీడగా భావించేవారు. ఇప్పుడు దీనికి మంచి వేదిక దొరికింది. ముఖ్యంగా మన ఆటకు ప్రపంచ స్థాయి గుర్తింపు దక్కింది. అందుకే నా దృష్టిలో ఇది ఒక చారిత్రక విజయం. ఇది గ్రామీణ క్రీడాకారుల్లో ఎనలేని స్ఫూర్తి నింపుతుంది' అంటూ తన సంతోషాన్ని పంచుకుంది ప్రియాంక.

రైతు బిడ్డ...

మహారాష్ట్రలోని కరువు ప్రాంతమైన బీడ్ జిల్లాకు చెందిన ప్రియాంక కుటుంబం... తరువాత పూణె శివారు దిఘికి వలస వెళ్లింది. ఆమె తల్లితండ్రులు హనుమంత్, సవిత చిన్నకారు రైతులు. సొంత ఊళ్లో సాగు లేకపోవడంతో దిఘికి వచ్చి చిన్న పనుల్లో చేరారు. వచ్చే ఆదాయం ఇంటి ఖర్చులకు సరిపోయేది కాదు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు. ఒకేఒక్క ఇరుకు గదిలో కుటుంబమంతా తల దాచుకునేది. కానీ ఇవేవీ ప్రియాంక ఆకాంక్షకు అవరోధం కాలేదు. తనకు ఇష్టమైన ఖోఖోలో అత్యున్నత స్థాయికి చేరాలని కలలు కన్నది. ఐదో తరగతిలోనే ఆట మొదలుపెట్టింది. క్రమంగా అదే తన లోకం అయింది. 'చిన్నప్పుడు స్కూల్లో ఆడుతుంటే చూశాను. అప్పటి నుంచీ ఖోఖో తప్ప ఇక నాకు ఏ ఆటా నచ్చలేదు. మొదట్లో మా స్కూలు జట్టుకు ఆడాలని తపించేదాన్ని. అక్కడ మెరుగ్గా రాణించాను. ఆటపై పట్టు దొరికింది. నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. అది నా ఆలోచనల్ని మార్చేసింది. జాతీయ స్థాయిలో ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. కష్టపడ్డాను. ఆ కల నిజమైంది. భారత జట్టుకు ఎంపికయ్యాను. నేడు ప్రపంచ కప్ గెలవడం నా జీవితంలోనే అత్యంత విలువైన, ప్రత్యేకమైన సందర్భం' అంటుంది ఆమె.

చదువులోనూ ముందే...

'శ్రీ సయాజీనాథ్ మహారాజ్ విద్యాలయ'లో ఐదో తరగతి చదువుతుంగా ఖోఖో మొదలుపెట్టిన ప్రియాంక... స్కూల్ జట్టులో చేరాలనుకుంది. కానీ అందుకు ఆమె తల్లితండ్రులు ఒప్పుకోలేదు. 'ఆటవల్ల నా చదువు దెబ్బతింటుందని అమ్మానాన్న భావించారు. మా బంధువుల్లో ఒకరు డాక్టర్. తనలా నన్ను కూడా ఎంబీబీఎస్ చదివించాలని అనుకున్నారు. అయితే ఆటలో నేను బాగా రాణిస్తుండడంతో మనసు మార్చుకున్నారు. నన్ను ప్రోత్సహించారు. మా నాన్న కోరుకున్నట్టు డాక్టర్‌ను కాలేదు కానీ... చదువులో కూడా నేను ముందున్నాను. ఎనభై శాతం మార్కులతో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాను. పన్నెండో తరగతిలో, ఆ తరువాత డిగ్రీలో కూడా మంచి మార్కులే తెచ్చుకున్నాను' అంటూ ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చిన ప్రియాంక ఎంకాం పూర్తి చేసింది.

విజయాలకు గుర్తుగా...

ఖోఖోనే తన ప్రపంచంగా సాగిపోతున్న ప్రియాంక... ఎన్నో అపురూప విజయాలను తన ఖాతాలో వేసుకుంది. వీటికి గుర్తుగా రెండేళ్ల కిందట మహారాష్ట్ర ప్రభుత్వం 'రాణి లక్ష్మీబాయి అవార్డు'తో పాటు 'శివ్ ఛత్రపతి స్టేట్ స్పోర్ట్స్ అవార్డు'నిచ్చి గౌరవించింది. అంతకముందు సబ్‌జూనియర్ జాతీయ ఖోఖో టోర్నీలో కనబరిచిన ప్రతిభకు గానూ... ఉత్తమ క్రీడాకారిణి అవార్డు గెలుచుకుంది. ఇవికాకుండా స్థానికంగా ఎన్నో పురస్కారాలు, ప్రశంసలు అందుకుంది. ప్రపంచ కప్ గెలిచాక ప్రియాంకతో పాటు జట్టు సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్‌పవార్ ప్రకటించారు.



పదిహేనేళ్లుగా...

ఈ ప్రయాణంలో అడుగడుగునా ఇబ్బందులు ఎదురైనా లక్ష్యం నుంచి పక్కకు తప్పుకోలేదు ప్రియాంక. కుటుంబ పరిస్థితులు, చదువు పేరు చెప్పి తప్పించుకొనే ప్రయత్నం చేయలేదు. పట్టుదలగా ప్రయత్నించి పదిహేనేళ్లుగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తోంది. ప్రొఫెషనల్ క్రీడాకారిణిగా అదరగొడుతోంది. పన్నెండేళ్లకే రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆమె పేరు... జాతీయ సబ్‌జూనియర్ ఖోఖో టోర్నమెంట్‌తో వెలుగులోకి వచ్చింది. ఆ టోర్నీలో అత్యుత్తమ క్రీడాకారిణిగా అవార్డు అందుకుంది. 2016 ఆసియా ఖోఖో చాంపియన్‌షిప్ ప్రియాంక కెరీర్‌లోనే పెద్ద మలుపు. అందులో భారత జట్టు స్వర్ణ పతకం గెలుచుకుంది. తరువాతి ఎడిషన్‌లో రజతం సాధించింది. ఇప్పటివరకు 23 జాతీయ స్థాయి టోర్నీల్లో పాల్గొంది. ఎనిమిదేళ్లుగా అంతర్జాతీయ వేదికపై సత్తా చాటుతోంది.

ఆటలో తిరుగులేదు...

అపార అనుభవంతో పాటు మెరుపు వేగం, నైపుణ్యం, ప్రత్యర్థులను చిత్తు చేసే వ్యూహాలు రచించడంలో ప్రియాంక దిట్ట. ఇవే ఆమెను తిరుగులేని క్రీడాకారిణిగా నిలిపాయి. ప్రపంచ కప్‌లో భారత జట్టును నడిపించే బాధ్యతను అప్పజెప్పాయి. 'మొదటి ప్రపంచ కప్. అందులో పాల్గొనే మన దేశ జట్టు నాయకత్వ బాధ్యతలు నాకు అప్పగించడం... నిజంగా ఇది అద్భుతమైన అనుభూతి' అంటూ టోర్నీకి ముందు ప్రియాంక భావోద్వేగానికి లోనైంది. భారత్‌లో ఖోఖో భవిష్యత్తుకు ఈ టోర్నీ బంగారు బాట వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేసిన ఆమెను మహారాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సత్కరించింది.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

» ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి: సినీ నటి గౌతమి



వాకథాన్ ప్రారంభిస్తున్న సినీ నటి గౌతమి, ఎంపీ కడియం కావ్య

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని సినీనటి గౌతమి సూచించారు. ప్రపంచ క్యాన్సర్ దినాన్ని పురస్కరించుకొని ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి కాళోజీ కళాక్షేత్రం వరకు సుమారు రెండు వేలమందితో మంగళవారం వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సినీనటి గౌతమి పాల్గొని మాట్లాడారు. గతంలో క్యాన్సర్ అంటే భయపడేవారని, తనకు క్యాన్సర్ వచ్చినా భయపడలేదన్నారు. 32 ఏళ్ల వయస్సులో తనకు క్యాన్సర్ వచ్చిందని, ఒక్కో పరీక్ష చేసి చెప్పడానికి కూడా వైద్యులు బాధపడ్డారని గుర్తుచేసుకున్నారు. ప్రతి ఒక్కరూ ధూమపానం, మద్యపానం, పాన్, గుట్కా తదితర దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. దీనికి చికిత్స ఖర్చుతో కూడుకున్నది అయినందున, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్ని నిధులు విడుదల చేయాలని కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై అవిశ్వాసం పెడతాం

అక్బరుద్దీన్‌తో స్వయంగా చర్చిస్తా: బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందని బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఆరోపించారు. ఇలాంటి ప్రభుత్వాన్ని త్వరలోనే అవిశ్వాస తీర్మానం పెట్టి ప్రజాస్వామ్యబద్ధంగా దించుతామని ఆయన అన్నారు. ఇందుకోసం మజ్లిస్ అగ్రనేత అక్బరుద్దీన్‌తో తాను స్వయంగా చర్చిస్తానని చెప్పారు. వచ్చే దసరాకల్లా రాష్ట్రంలో కొత్త ముఖ్యమంత్రి వస్తారని జోస్యం చెప్పారు. మంగళవారం అసెంబ్లీ లాబీలో మీడియాతో రాకేశ్‌రెడ్డి చిట్‌చాట్‌గా మాట్లాడారు. "కాంగ్రెస్‌లో ఇప్పటికే పది మంది ఎమ్మెల్యేలు అసంతృప్తిగ ఉన్నరు. అవసరమైతే మరో పది మంది ఎమ్మెల్యేలను కూడా కలుస్తం. ఫాంహౌజ్‌లో ఉన్నవాళ్లను కూడా కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజా ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాలని కోరుతం" అని రాకేశ్‌రెడ్డి చెప్పారు.

లోకేశ్‌తో ప్రశాంత్ కిశోర్ భేటీ!

» తెలంగాణలో పార్టీ బలోపేతంపై చర్చ!?

న్యూఢిల్లీ/అమరావతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్(పీకే) టీడీపీ యువనేత, ఏపీ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయ్యారు. మంగళవారం ఢిల్లీలోని ముఖ్యమంత్రి నివాసం 1-జన్‌పథ్‌కు పీకే వచ్చారు. అక్కడ దాదాపు గంటకు పైగా లోకేశ్‌తో చర్చలు జరిపారు. ఈ సమావేశ వివరాలపై ఇరువర్గాల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనరాలేదు. కానీ.. తెలంగాణలో టీడీపీ బలోపేతంపై వీరి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. బిహార్‌తోపాటు దేశ రాజకీయ పరిస్థితులపైనా వీరు చర్చించుకున్నట్లు సమాచారం. తెలంగాణలో టీడీపీ బలోపేతంపై పీకే ఇప్పటికే కొన్ని ప్రణాళికలను టీడీపీ పెద్దల ముందు ఉంచినట్లు తెలుస్తోంది. ఏపీలో 2019 ఎన్నికల్లో పీకేకు చెందిన ఐప్యాక్ వైసీపీ తరఫున పనిచేసింది. ఆ తర్వాత ఐప్యాక్ నుంచి ఆయన బయటకు వచ్చేశారు. బిహార్‌లో 'జన్ సురాజ్' పేరుతో సొంతంగా పార్టీ ఏర్పాటు చేశారు.

చర్లపల్లిలో భారీ అగ్ని ప్రమాదం

» రసాయన పరిశ్రమలో చెలరేగిన మంటలు
» కెమికల్ డ్రమ్ములు అంటుకుని పేలుళ్లు
» పక్కనున్న 3 కంపెనీలకూ మంటల వ్యాప్తి
» 3.5 గంటలపైగా శ్రమించిన 8 ఫైర్ ఇంజన్లు
» 16కోట్ల నష్టం..

షార్ట్ సర్క్యూట్‌తో ఘోరం..?


ప్రమాదం జరిగిన సర్వోదయ సాల్వెంట్స్‌లో ఎగసి పడుతున్న మంటలు

కుషాయిగూడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేజ్-1లోని రసాయన పరిశ్రమలో మంగళవారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. దట్టమైన పొగ వ్యాపించడం, భారీ పేలుళ్ల శబ్దాలతో స్థానికులు ఆందోళన చెందారు. చర్లపల్లిలోని సర్వోదయ సాల్వెంట్స్ కంపెనీలోని ఓ ప్లాంట్‌లో మంగళవారం సాయంత్రం మంటలు చెలరేగాయి. సిబ్బంది తేరుకునేలోపే అగ్నికీలలు మిగతా ప్లాంట్లకు విస్తరించాయి. భూగర్భంలో ఉన్న ట్యాంకుకు మంటలు అంటుకోవడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. రసాయనాలు నిల్వ చేసిన డ్రమ్ములు పేలిపోయి పెద్ద శబ్దాలతో మంటలు ఎగసిపడ్డాయి. కంపెనీ పక్కనే ఉన్న మహాలక్ష్మీ ప్లాస్టిక్స్, హరిత ఎంటర్‌ప్రైజెస్, హైటెక్ ఇండస్ట్రీస్‌కు కూడా మంటలు వ్యాపించడంతో కార్మికులు పరుగులు తీస్తూ బయటకు వచ్చారు. 3 కి.మీ మేర దట్టంగా పొగ కమ్మేయడంతో స్థానికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. మంటలను ఆర్పేందుకు దాదాపు 8 ఫైర్ ఇంజన్లు నిర్విరామంగా పనిచేశాయి. మూడున్నర గంటలు శ్రమించినా మంటలు పూర్తిగా అదుపులోకి రాలేదు. దాదాపు రూ.16కోట్ల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందని పోలీసులకు ప్రాథమికంగా ఫిర్యాదు అందింది. ఘటనా స్థలాన్ని రాచకొండ సీపీ సుధీర్ బాబు సందర్శించారు.

లావణ్య కేసులో తెరపైకి ఆర్జే శేఖర్ బాషా!

(మొదటిపేజీ తరువాయి)

మస్తాన్ సాయి తనను అన్యాయంగా డ్రగ్స్ కేసులో ఇరికించేందుకు ప్రయత్నించాడని ఆరోపించింది. తన ఇంట్లో పార్టీ ఏర్పాటు చేసి.. అక్కడ మత్తు పదార్థాలు దొరికేలా చేసేందుకు పథకం వేశారనీ ఫిర్యాదులో పేర్కొంది. దీనికి సంబంధించి మస్తాన్ సాయి-శేఖర్ బాషా మాట్లాడుకున్నట్లుగా చెబుతున్న ఓ ఆడియో క్లిప్‌ను పోలీసులకు ఆమె అందజేసింది. యువతులు, వివాహితలకు డ్రగ్స్ అలవాటు చేసి.. ఆ మత్తులో ఉన్న వారిపై అత్యాచారానికి పాల్పడి.. ఆ దృశ్యాలను చిత్రీకరించి.. ఆ వీడియోలతో బాధితులను మస్తాన్ బ్లాక్‌మెయిలింగ్‌కు తెగబడుతున్నాడంటూ ఆమె ఇప్పటికే తీవ్ర ఆరోపణలు చేసింది. మస్తాన్ చేతిలో వందల మంది మహిళలు మోసపోయారని చెబుతూ దీనికి 'ఆధారం'గా ఓ హార్డ్‌డిస్క్‌ను సోమవారమే ఆమె పోలీసులకు అందజేసింది. ఆ హార్డ్ డిస్క్‌లో 300 మంది యువతులకు సంబంధించిన అశ్లీల/నగ్న వీడియోలున్నట్లు సమాచారం. మంగళవారం కూడా లావణ్య తన న్యాయవాదితో కలిసి నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. తనను డ్రగ్స్ కుంభకోణంలో ఇరికించేందుకు మస్తాన్-శేఖర్ పథకం వేశారని.. దీనిపై ఇద్దరూ మాట్లాడుకున్నారని చెబుతూ ఓ ఆడియో క్లిప్‌ను పోలీసులకు అందజేసింది. లావణ్య ఇంట్లో ఓ పార్టీని ఏర్పాటు చేసి.. తాను చెప్పిన మరో యువతిని కూడా అక్కడికి పిలిపించి.. ఇంట్లో 150 గ్రాముల డ్రగ్స్ (ఎండీఎంఏ) పెట్టాలని, తర్వాత పోలీసులకు సమాచారమిస్తే అంతా వారే చూసుకుంటారని మస్తాన్‌కు శేఖర్ బాషా చెబుతున్నట్లుగా ఆ ఆడియోలో ఉన్నట్లు తెలుస్తోంది. లావణ్యపై పగ తీర్చుకునేందుకు, ఆమెను విల్లా నుంచి ఖాళీ చేయించేందుకు ఇదంతా శేఖర్ బాషా వేసిన పథకం అని లావణ్య తరఫు న్యాయవాది ఆరోపించారు. కాగా ఈ ఆడియో క్లిప్, లావణ్య ఇంట్లో మస్తాన్ వదిలేసిన ఫోన్లో లభ్యమైనట్లు చెబుతున్నారు. అయితే..


ఆర్జే శేఖర్ బాషా

లావణ్య ఇంట్లో పెట్టాల్సిన డ్రగ్స్‌ను వారు ఎక్కడి నుంచి తేవాలనుకున్నారు? అనేది ఆసక్తికరంగా మారింది. లావణ్య ఫిర్యాదు మేరకు సోమవారమే మస్తాన్ సాయిని పోలీసులు అరెస్టు చేసి.. రిమాండ్‌కు తరలించారు. తాజాగా శేఖర్ బాషాపై ఆరోపణలు రావడంతో అతడిని కూడా అదుపులోకి తీసుకొని విచారించే అవకాశం ఉంది. కాగా లావణ్య అందజేసిన హార్డ్‌డిస్క్‌కు సంబంధించి పోలీసులు ప్రాథమికంగా ఓ అంచనాకు వచ్చినట్లు సమాచారం. మస్తాన్ పథకం ప్రకారమే అమ్మాయిలను పార్టీలకు పిలిచి.. వారికి డ్రగ్స్ అలవాటు చేసి.. ఆ తర్వాత వారిపై అత్యాచారం చేసి.. ఆ దృశ్యాలను వీడియోగా చిత్రీకరించి దాచుకున్నట్లుగా నిర్ధారించినట్లు తెలుస్తోంది. అయితే డ్రగ్స్ కేసులో మస్తాన్‌ను విచారించాలని పోలీసులు భావిస్తున్నారు. మస్తాన్‌కు సినీ పరిశ్రమలో ఎవరెవరితో సంబంధాలున్నాయి? అతడికి డ్రగ్స్ ఎక్కడి నుంచి అందుతున్నాయి? తదితర విషయాల్లో దర్యాప్తు కోసం మస్తాన్‌ను వారం రోజుల పోలీసు కస్టడీ కోరుతూ పిటిషన్ వేశారు. అతడిని కస్టడీకి తీసుకొని విచారిస్తే మరిన్ని నేరాలకు సంబంధించిన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. కాగా లావణ్య ఇంట్లోంచి ఆమె ల్యాప్‌టాప్‌ను పోలీసులు ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారు. హార్డ్‌డిస్క్‌ను, ల్యాప్‌టాప్‌ను, మస్తాన్ ఫోన్లోని ఆడియో సంభాషణలను ఫొరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు.

..ఉల్టా తానే చస్తానని బెదిరింపులు

పోలీసుల విచారణలో మస్తాన్ సాయి గురించి విస్తుపోయే అంశాలు వెలుగులోకొచ్చాయి. యువతుల విషయంలో అతడు సైకోగా వ్యవహరించేవాడని తెలుస్తోంది. ప్రేమ.. పెళ్లి పేరుతో కొందరిని.. డ్రగ్స్ ఎరవేసి ఇంకొందరిని.. డబ్బు ఆశపెట్టి మరికొందరిని.. ఇలా ఎంతోమంది యువతులను లోబర్చుకొని ఆ దృశ్యాలను రహస్య కెమెరాలతో చిత్రీకరించినట్లు తెలిసింది. బాధితులకు ఫోన్‌చేసి చేసి అశ్లీల దృశ్యాలను పోర్న్‌సైట్లో పెడతానంటూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడేవాడని సమాచారం. ఈ క్రమంలో యువతులతో తన ఫోన్ సంభాషణలనూ రికార్డు చేసుకొని హార్డ్‌డిస్క్‌లో మస్తాన్ దాచుకునేవాడు. అయితే అశ్లీల వీడియోలను అడ్డం పెట్టుకొని బాధిత యువతులను బ్లాక్‌మెయిల్ చేసే మస్తాన్ సాయి, వారిలో ఎవరైనా తనపై తిరగబడితే ఉల్టా వారినే బెదిరించేవాడు. తనకు వ్యతిరేకంగా బాధిత యువతుల్లో ఎవరైనా పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్నారని తెలిస్తే.. వారికి అతడు వీడియో కాల్ చేసేవాడు. ఫిర్యాదు చేస్తే గనక తాను ఆత్మహత్య చేసుకుంటానని.. అందుకు మీరే కారణం అని రాసి మరీ చస్తానని బాధితులను బెదిరించేవాడు. దీంతో.. అతడు చస్తే.. తమ పేర్లు బయటకొచ్చి.. పరువు పోతుందనే భయంతో ఎంతోమంది బాధితులు ఫిర్యాదుకు వెనుకంజ వేసినట్లు సమాచారం. కాగా మస్తాన్‌లాంటి సైకోలకు తక్షణమే శిక్ష పడాలని ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి పేర్కొన్నారు.

గ్రామస్థాయి రెవెన్యూ సిబ్బంది నియామకానికి పరీక్ష

వివరణాత్మక విధానంలో!

ప్రశ్నపత్రాన్ని సిద్ధం చేసిన సీసీఎల్‌ఏ

తేదీలను ప్రకటించడమే తరువాయి

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి రెవెన్యూ సిబ్బంది నియామక ప్రక్రియకు సంబంధించిన పరీక్షను పూర్తిగా డిస్‌క్రిప్టివ్ (వివరణాత్మక) విధానంలో నిర్వహించనున్నారు. ఈమేరకు ప్రశ్నపత్రాన్ని సీసీఎల్‌ఏ (చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. గూగుల్‌ఫాం ద్వారా గతంలో పనిచేసిన వీఆర్‌వో, వీఆర్‌ఏల నుంచి ఐచ్ఛికాలను సేకరించిన సీసీఎల్‌ఏ అధికారులు.. వారందరికీ పరీక్ష నిర్వహించేలా ప్రశ్నపత్రాన్ని రూపొందించారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ శాఖ అందించే సేవలకు సంబంధించిన సిలబస్ నుంచే ప్రశ్నలు ఉంటాయని తెలిసింది. 2020కి ముందు రాష్ట్రంలో వీఆర్వోలు సుమారు 5400 మంది ఉండేవారు. వీరితోపాటు వీఆర్‌ఏలు కలిపి సుమారు 23,254 మంది పనిచేసేవారు. గ్రామస్థాయిలో భూ సంబంధిత సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమల్లో వీరు కీలకంగా వ్యవహరించేవారు. 10,954 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న సిబ్బందిని జీవో నంబరు 121 ద్వారా ఆగస్టు 2022న గత ప్రభుత్వం తొలగించింది. దీంతో రెవెన్యూ వ్యవస్థ కుప్పకూలిందనే విమర్శలు వచ్చాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ వ్యవస్థను పునరుద్ధరిస్తామని ప్రకటించింది. ధరణి సంస్కరణల్లో భాగంగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిన ప్రభుత్వం.. దాన్ని అమల్లోకి తీసుకొచ్చేలోపే గ్రామస్థాయి రెవెన్యూ సిబ్బందిని నియమిస్తామని తెలిపింది. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసి గ్రామ పరిధిలో మళ్లీ రెవెన్యూ రికార్డులను అందుబాటులోకి తీసుకొస్తామని కొత్త ఆర్వోఆర్ చట్టంలో పేర్కొంది. సీసీఎల్‌ఏ అధికారులు ప్రశ్నపత్రాన్ని సిద్ధం చేశారు. ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చిన వెంటనే పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

చిత్రజ్యోతి

SINCE 1965

పాన్ ఇండియా విజయాన్ని అందుకుంటాం

ఏ.ఎం.రత్నం



పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌తో నిర్మాత ఎ.ఎం.రత్నంకు ఎంతో అనుబంధం ఉంది. వీరి కలయికలో గతంలో 'ఖుషి', 'బంగారం' సినిమాలు వచ్చాయి. ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో మూడో చిత్రం 'హరి హర వీర మల్లు' రూపొందుతోంది. పవన్ కల్యాణ్ మొదటి పాన్ ఇండియా సినిమా ఇదే కావడం విశేషం. ఇందులో పవన్ కల్యాణ్ పోరాట యోధుడిగా నటిస్తున్నారు. కాగా, మంగళవారం ఏ.ఎం.రత్నం పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'హరి హర వీరమల్లు' పాన్ ఇండియా స్థాయిలో విడుదలై ఘన విజయం సాధిస్తుందని అన్నారు. పవన్ అభిమానుల అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా, ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందే గొప్ప చిత్రంగా నిలుస్తుందని తెలిపారు.

త్వరలో కలుసుకుందాం...

జూనియర్ ఎన్టీఆర్



తనను కలుసుకోవాలని ఎదురు చూస్తున్న అభిమానుల ఆసక్తిని అర్థం చేసుకున్నానని, త్వరలో సమావేశం ఏర్పాటు చేసి వారిని కలుస్తానని తెలిపారు జూనియర్ ఎన్టీఆర్. ఈ మేరకు ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. 'నా అభిమానులు చూపిస్తున్న అపారమైన ప్రేమ, గౌరవానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. మీ అందరినీ వ్యక్తిగతంగా కలవాలని నిర్ణయించుకున్నా. అందుకు సజావుగా సమావేశమవడానికి అనుమతుల కోసం పోలీస్, సంబంధిత అధికారులతో సంప్రదిస్తున్నాం. ఇంత పెద్ద సమావేశం నిర్వహించడానికి కొంత సమయం పడుతుంది. ఓర్పుగా ఉండాలని అభిమానులను కోరుతున్నా. నన్ను కలుసుకోవడానికి పాదయాత్రలు వంటివి చేయొద్దు. మీ ఆనందమే కాదు, మీ సంక్షేమం కూడా నాకు అత్యంత ప్రధానం' అని జూనియర్ ఎన్టీఆర్ పేర్కొన్నారు.

కొంత డోస్ తగ్గించా

వెంకటేశ్



జయాపజయాలతో సంబంధం లేకుండా, ఎలాంటి వివాదాలకు ఆస్కారం ఇవ్వకుండా సినిమాలు చేసుకుంటూ కెరీర్‌ను కొనసాగిస్తున్నారు నటుడు వెంకటేశ్. కుటుంబ కథా చిత్రాల హీరోగా మంచి గుర్తింపు కూడా పొందారు. అయితే 2023లో వచ్చిన 'రానా నాయుడు' వెబ్ సిరీస్ వెంకటేశ్ ఇమేజ్‌ను కొంతవరకు డ్యామేజ్ చేసింది. ఇందులో అనేక సన్నివేశాలు బోల్డ్‌గా ఉండటంతో పాటు, వెంకటేశ్‌తో అసభ్య సంభాషణలు పలికించడం వివాదాస్పదమైంది. వెంకటేశ్ లాంటి ఫ్యామిలీ హీరో బోల్డ్ కంటెంట్‌లో నటించడం, అభ్యంతరకరమైన డైలాగ్స్ చెప్పడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దానిపై అనేకసార్లు వెంకటేశ్ సంజాయిషీ కూడా ఇచ్చుకున్నారు. 'రానా నాయుడు సీజన్ 2' విషయంలో ఇలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త పడతామని తెలిపారు. కాగా, ఇటీవలె సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో ఫ్యామిలీ ఆడియన్స్‌ను థియేటర్స్‌కి రప్పించి అతిపెద్ద విజయాన్ని వెంకటేశ్ అందుకున్నారు. ఇప్పుడు 'రానా నాయుడు-2' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇటీవల నిర్వహించిన 'సంక్రాంతికి వస్తున్నాం' సక్సెస్ మీట్‌లో 'రానా నాయుడు-2'పై వెంకటేశ్ క్లారిటీ ఇచ్చారు. ఫస్ట్ సీజన్‌పై వచ్చిన విమర్శల దృష్ట్యా... సీజన్-2లో కొంత డోస్ తగ్గించినట్లు చెప్పారు. సీజన్ 2లో అర్జున్ రాంపాల్, కృతి కర్బందా కనిపించనున్నారు.

టాప్ ఫైవ్‌లో నిలుస్తుందని సుకుమార్ అన్నారు

దేవిశ్రీ ప్రసాద్



దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన చిత్రం 'తండేల్'. నాగచైతన్య సాయిపల్లవి జంటగా దర్శకుడు చందు మొండేటి తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మించారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ చిత్ర విశేషాలను మీడియాతో పంచుకున్నారు. "చాలా రోజుల తర్వాత నేను పనిచేసిన స్వచ్ఛమైన ప్రేమ కథ ఇది. ఇందులోని పాటలకు వస్తున్న అద్భుతమైన ఆదరణ పట్ల సంతోషంగా ఉన్నాను. సుకుమార్ 'తండేల్' పాటలు విని.. నీ కెరీర్‌లో టాప్ ఫైవ్ చిత్రాల్లో ఈ ఆల్బమ్ ఒకటిగా నిలుస్తుందన్నారు. కమర్షియల్ సినిమాలతో పాటు ప్రేమ కథలకు సంగీతాన్ని ఇవ్వడాన్ని ఆస్వాదిస్తా. ప్రేమ పాటలకు రీచ్ ఎక్కువ ఉంటుంది. అవి ఎవర్‌గ్రీన్. కెరీర్ పరంగా సంతృప్తికరంగా ఉన్నా. ఇప్పటివరకూ అన్ని రకాల సినిమాలకు పనిచేసే అవకాశం వచ్చింది. నా సంగీతం అన్ని వర్గాలకు రీచ్ అవడం ఎంతో సంతోషాన్నిస్తోంది. 'తండేల్' వాస్తవిక సంఘటనల ఆధారంగా తయారుచేసుకున్న కథ. ఇందులో నేపథ్య సంగీతం చాలా కొత్తగా ఉంటుంది. దర్శకుడు చందు విజన్ ఈ సినిమాకు ప్రధానాకర్షణ" అని చెప్పారు.



సీనియర్ నటి పుష్పలత కన్నుమూత



సీనియర్ నటుడు ఏవీఎం రాజన్ సతీమణి, నటి పుష్పలత (87) చెన్నైలో కన్నుమూశారు. స్థానిక టినగర్, తిరుమల పిళ్లై రోడ్డులోని నివాసంలో ఉంటున్న ఆమె వృద్ధాప్యం కారణంగా శ్వాసపీల్చడంలో సమస్యలు తలెత్తడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం తుది శ్వాస విడిచినట్టు ఆమె కుటుంబ సభ్యులు వెల్లడించారు. 1958లో వచ్చిన 'సెంగోట్టై సింగం' అనే చిత్రంతో వెండితెరకు పరిచయమయ్యారు. 1961లో 'కొంగునాట్టు తంగం' అనే చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఎంజీ రామచంద్రన్, శివాజీ గణేశన్, ఎంఎస్ రాజేంద్రన్ వంటి అగ్ర నటుల సరసన నటించారు. 'నానుమ్ ఒరు పెణ్' అనే చిత్రంలో నటుడు ఏవీఎం రాజన్‌తో నటించారు. ఆ తర్వాత ఆయనను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. తెలుగులో 'పెద్దకొడుకు', 'మేము మనుషులమే', 'అన్నదమ్ముల అనుబంధం', 'యుగపురుషుడు', 'రాజపుత్ర రహస్యం', 'శ్రీరామ పట్టాభిషేకం', 'వేటగాడు', 'రాధా కళ్యాణం', 'కొండవీటి సింహం' చిత్రాల్లో నటించారు. ఏవీఎం సంస్థ నిర్మించిన 'రాము' చిత్రంలో ఎన్టీఆర్ సరసన నటించారు.


భర్త ఏవీఎం రాజన్‌తో...

1963లో 'షైన్ బీ లక్కీ హరాన్' అనే హిందీ చిత్రంలో, 'నర్స్' అనే మలయాళ చిత్రంలోనూ నటించారు. 'సకలకళా వల్లభన్', 'నాన్ అడిమై ఇల్లై' వంటి చిత్రాల్లో సహాయ నటిగా నటించారు. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో కలిపి దాదాపు 100కు పైగా చిత్రాల్లో నటించిన ఆమె చివరగా మురళి నటించిన 'పూవాసమ్'(1999) చిత్రంలో కనిపించారు. ఆ తర్వాత ఆమె సినిమాల వైపు తిరిగి చూడలేదు. ఆమె మృతిపై పలువురు తమిళ సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలిపారు. కాగా, పుష్పలత కుమార్తె మహాలక్ష్మి 'రెండు జెళ్ల సీత', 'ఆనంద భైరవి', 'మాయదారి మరిది', 'రుణానుబంధం' చిత్రాల్లో హీరోయిన్‌గా నటించారు. చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఆగిపోలేదు.. బడ్జెట్ గురించే ఆలోచిస్తున్నాం



'అదుగో క్రిష్ 4 వస్తోంది.. ఇదిగో క్రిష్ 4 తయారవుతోంది'.. అంటూ చాలా కాలంగా వినిపిస్తున్న వార్తలపై ఆ చిత్ర దర్శకుడు రాకేశ్ రోషన్ ఎట్టకేలకు నోరు విప్పారు. ఆ సినిమా ఆగిపోయిందంటూ వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. 'క్రిష్ 4' చిత్రం ఆగిపోలేదు.. బడ్జెట్ గురించే ఆలోచిస్తున్నాం' అని ఆయన చెప్పారు. ఇండియా సూపర్ హీరో కాన్సెప్ట్‌తో హృతిక్ రోషన్ హీరోగా 'క్రిష్' చిత్రం ఇప్పటివరకూ మూడు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. నాలుగో భాగం నిర్మాణానికి వచ్చే సరికి కొత్త సమస్యలు మొదలయ్యాయి. ఇటీవలి కాలంలో ప్రేక్షకుల అంచనాలు భారీ స్థాయిలో ఉంటున్నాయి. కనుక ఆ స్థాయిలోనే ఖర్చు పెట్టి సినిమా తీస్తే తప్ప వారిని ఆకట్టుకోవడం కష్టమవుతోంది. హాలీవుడ్‌లో సూపర్ హీరోల చిత్రాలను ఐదు వందల మిలియన్ డాలర్ల బడ్జెట్‌తో తీస్తున్నారిప్పుడు. రూ. రెండు మూడొందల కోట్ల బడ్జెట్‌తో తను 'క్రిష్ 4' చిత్రాన్ని తీస్తే వర్కవుట్ అవుతుందా అని తీవ్రంగా ఆలోచిస్తున్నారు రాకేశ్ రోషన్. 'ఇప్పుడు స్క్రిప్ట్ మీద దృష్టి పెట్టా. ఇదివరకులా సినిమాలో పది అద్భుతమైన సీన్లు అని కాకుండా రెండు సూపర్ ఎపిసోడ్స్ ఉండేలా చూస్తున్నాం' అని ఆయన వివరించారు.

మన ఆర్థిక పునాదులు

మహా స్ట్రాంగ్



పాత పన్ను విధానం ఆగదు

జీఎస్‌టీ శ్లాబులు, రేట్ల కుదింపుపైనా దృష్టి

కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్

న్యూఢిల్లీ: కొన్ని సమస్యలున్నా భారత ఆర్థిక పునాదులు ఇంకా పటిష్ఠంగానే ఉన్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్‌పై ఇండియా టుడే-బిజినెస్ టుడే పత్రికలు నిర్వహించిన ఒక సదస్సులో ఆమె ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు. సంస్థాగతంగా చూసినా భారత ఆర్థిక వ్యవస్థ ఇంకా అభివృద్ధి బాటలోనే ఉందన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే తమ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో మధ్య తరగతిని మురిపించిందన్న అనుమానాలను సీతారామన్ తోసిపుచ్చారు. పన్ను చెల్లింపుదారులకు ప్రధాని మోదీ ఇచ్చిన హామీల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఐటీ రిటర్న్‌ల ఫైలింగ్‌కు సంబంధించి కొత్త పన్ను విధానంతో పాటు పాత పన్ను విధానమూ కొనసాగుతుందన్నారు.

పెట్టుబడులు తగ్గలే

కేంద్ర బడ్జెట్‌లో మూలధన పెట్టుబడులు తగ్గించారన్న ఆరోపణలను ఆర్థిక మంత్రి తోసిపుచ్చారు. నిజానికి ఈ పెట్టుబడులు సవరించిన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో నమోదైన రూ.10.18 లక్షల కోట్లతో పోలిస్తే రూ.1.03 లక్షల కోట్లు ఎక్కువన్నారు. ప్రస్తుత జీడీపీలో ఇది 4.3 శాతానికి సమానమన్నారు.

జీఎస్‌టీ రేట్లపైనా త్వరలో నిర్ణయం

జీఎస్‌టీ శ్లాబులు, రేట్ల హేతుబద్ధీకరణపైనా జీఎస్‌టీ మండలి త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని నిర్మలా సీతారామన్ తెలిపారు. మూడేళ్ల క్రితం ఇందుకోసం ఏర్పాటైన రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన కమిటీ త్వరలోనే తన నివేదిక సమర్పిస్తుందన్నారు. జీఎస్‌టీ శ్లాబులతో పాటు సామాన్య ప్రజలు ఉపయోగించే వస్తువులపై పన్ను రేట్లు తగ్గించాలన్నదే తమ ధ్యేయమన్నారు.

ఆర్‌బీఐ కూడా కలిసి రావాలి

ధరల సెగ లేకుండా ద్రవ్యలోటును కట్టడి చేసేందుకు మొన్నటి బడ్జెట్‌లో, కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి తుహిన్ కాంత పాండే చెప్పారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్‌బీఐ కూడా జీడీపీ వృద్ధి రేటుకు సహకరించాలని పరోక్షంగా వడ్డీ రేట్లు తగ్గించాలని కోరారు. శుక్రవారం ప్రకటించే ద్వైమాసిక ద్రవ్య, పరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) కీలక రెపో రేటుపైనా నిర్ణయం తీసుకోనుంది. ఈ నేపథ్యంలో పాండే చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

స్వర్ణం.. సులభ రుణం!



బ్యాంకుల బంగారం తనఖా రుణాల్లో 71.3 శాతం వృద్ధి

గత డిసెంబరు నాటికి రూ.1.72 లక్షల కోట్లకు చేరిక

గత ఏడాది నుంచి బంగారం ధర వేగంగా పెరుగుతూ వస్తోంది. సామాన్యులు కొనగలరా..? అనే స్థాయికి చేరుకుంది. దాంతో కొత్తగా బంగారం కొనుగోలు చేసే వారు కాస్త తగ్గినప్పటికీ.. ఉన్న నగలను తాకట్టు పెట్టే రుణాలు పొందే ట్రెండ్ మాత్రం ఊపందుకుంది. తాజా గణాంకాలే ఇందుకు నిదర్శనం. గత ఏడాది డిసెంబరు నాటికి బ్యాంకుల బంగారం రుణాల పోర్ట్‌ఫోలియో వార్షిక ప్రాతిపదికన 71.3 శాతం వృద్ధితో రూ.1.72 లక్షల కోట్లకు చేరుకుంది. అంతక్రితం ఏడాదిలో ఇదే సమయానికి పసిడి రుణ పోర్ట్‌ఫోలియో వృద్ధి కేవలం 17 శాతమే. గడిచిన కొన్ని సంవత్సరాల్లో బంగారం విలువ బాగా పెరగడంతో పాటు బ్యాంకులు తనఖా రహిత వ్యక్తిగత రుణాల మంజూరులో ఆచితూచి వ్యవహరిస్తుండటం ఇందుకు ప్రధానం కారణాలుగా తెలుస్తోంది. వ్యక్తిగత రుణం లభించే అవకాశం లేని వారికి బంగారం తనఖా రుణాలు మెరుగైన ప్రత్యామ్నాయంగా మారాయని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి. వ్యక్తిగత రుణంతో పోలిస్తే, గోల్డ్ లోన్స్‌పై వడ్డీ కూడా తక్కువగా ఉండటం మరో కారణమని వారు పేర్కొన్నారు.

- గత ఏడాది మార్చి-డిసెంబరు మధ్యలో బంగారం తనఖా రుణాల్లో 68 శాతం వృద్ధి నమోదైందని.. అదే కాలంలో బంగారం ధరలు 21 శాతం పెరిగాయని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ అజిత్ వెలోనీ అన్నారు.
- 2023 నవంబరులో ఆర్‌బీఐ తనఖా రహిత రుణాలపై రిస్క్ వెయిటేజీని 125 శాతానికి పెంచింది. దాంతో బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లు తాకట్టుపై ఇచ్చే బంగారం రుణాలపై దృష్టి సారించాయి. వ్యక్తిగత రుణాలను తగ్గించాయి. దాంతో గత ఏడాది డిసెంబరుతో ముగిసిన 9 నెలల్లో వ్యక్తిగత రుణాలు కేవలం 5-6 శాతం వృద్ధి చెందాయి. అంతక్రితం సంవత్సరంలో ఇదే కాలానికి పర్సనల్ లోన్స్‌లో 16.5 శాతం వృద్ధి నమోదైంది.
- గత డిసెంబరుతో ముగిసిన మూడు త్రైమాసికాల్లో తనఖా రహిత రుణాలకు చెందిన ఇతర విభాగాల్లోనూ కేవలం 9.7 శాతం వృద్ధి నమోదైంది. 2023లో ఇదే కాలానికి ఆ విభాగాల రుణ వృద్ధి 20.8 శాతంగా ఉంది. కాగా, రిటైల్ రుణాల పరిధిలోకి వచ్చే హౌసింగ్, వెహికిల్, క్రెడిట్ కార్డ్, పర్సనల్ లోన్స్ విభాగాలన్నింటి రుణ వృద్ధి కూడా 17.6 శాతం నుంచి 14.9 శాతానికి జారుకుంది.

అమెరికా-చైనా కయ్యం మనకు లాభమే

న్యూఢిల్లీ: అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం మన దేశానికి మేలు చేస్తుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. ఈ నెల 10 నుంచి చైనా దిగుమతులపై 35 శాతం సుంకాలు విధిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా ప్రకటించారు. దీంతో అమెరికా మార్కెట్లో చైనా వస్తువులు ప్రియం కానున్నాయి. ఈ లోటును భర్తీ చేసుకునేందుకు అమెరికా కంపెనీలు భారత్‌వైపు చూసే అవకాశం ఉందని భావిస్తున్నాయి. అయితే మన దేశానికి ఈ లాభం ఏ మేరకు ఉంటుందనే విషయం మన ఉత్పత్తి సామర్థ్యం, పోటీతత్వాలపై ఆధారపడి ఉంటాయని భారత ఎగుమతి సంఘాల సమాఖ్య (ఫియో) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ చెప్పారు. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధంతో మన దేశం నుంచి ఆ దేశానికి ఎలక్ట్రిక్ మెషినరీ, వాటి విడి భాగాలు, ఆటో మొబైల్ విడి భాగాలు, మొబైల్, ఫార్మా, రసాయనాలు, బట్టలు, వస్త్రాల ఎగుమతి పుంజుకునే అవకాశం ఉందని సహాయ్ అంచనా వేశారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	500
వరంగల్	442	గోదావరి	452
చిత్తూరు	513	విశాఖపట్నం	470
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	103	విజయవాడ	119
వరంగల్	103	గుంటూరు	114
కరీంనగర్	103	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	92
కర్నూలు	103	నెల్లూరు	97
విశాఖపట్నం	111	అనంతపురం	97
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	85,200 ▲	78,100 ▲	1,06,000 ▼
విజయవాడ	85,700 ▲	80,500 ▲	95,500 ▲
విశాఖపట్నం	83,180 ▲	76,250 ▲	94,630 ▲
రాజమండ్రి	85,200 ▲	78,100 ▲	96,600 ▲
ప్రొద్దుటూరు	84,400 ▲	77,970 ▲	94,700 ▲
ముంబై	83,010 ▲	76,037 ▲	93,793 ▲

మిధానీ లాభంలో 102 శాతం వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగంలోని మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్ (మిధానీ).. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ నికర లాభం స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన 102.32 శాతం వృద్ధి చెంది రూ.25.27 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ.12.49 కోట్లుగా ఉంది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం మాత్రం రూ.251.98 కోట్ల నుంచి రూ.237.97 కోట్లకు తగ్గింది. డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలలకు గాను కంపెనీ రూ.663.54 కోట్ల ఆదాయంపై రూ.53.92 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. డిసెంబరు ముగిసే నాటికి ఆర్డర్ బుక్ రూ.1,936.71 కోట్లుగా ఉన్నట్లు మిధానీ వెల్లడించింది.

నెల గరిష్ఠానికి సూచీలు

సెన్సెక్స్ 1,397 పాయింట్లు అప్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం ట్రేడింగ్‌లో దాదాపు 2 శాతం మేర వృద్ధి చెంది నెల రోజుల గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మెక్సికో, కెనడాపై విధించిన సుంకాల అమలును నెల రోజులు వాయిదా వేయడంతో ఆసియా మార్కెట్లతో పాటు మన సూచీలూ ర్యాలీ తీశాయి. సెన్సెక్స్ 1,397.07 పాయింట్లు (1.81 శాతం) బలపడి 78,583.81 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 378.20 పాయింట్లు (1.62 శాతం) పెరిగి 23,739.25 వద్ద స్థిరపడింది. ఈ ఏడాది జనవరి 3 తర్వాత సూచీలకిదే గరిష్ఠ ముగింపు స్థాయి. కాగా, ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.95 లక్షల కోట్లకు పైగా పెరిగి రూ. 425.50 లక్షల కోట్లకు (4.88 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

ఆల్గో ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్లకూ అనుమతి

ఆగస్టు 1 నుంచి అమల్లోకి

ముంబై: ఆల్గోరిథమిక్ ట్రేడింగ్ (ఆల్గో ట్రేడింగ్)లో రిటైల్ ఇన్వెస్టర్లూ పాల్గొనేందుకు అనుమతిస్తున్నట్లు సెబీ మంగళవారం ప్రకటించింది. రిటైల్ ఇన్వెస్టర్లు కూడా ఈ సదుపాయాన్ని భద్రంగా ఉపయోగించుకునేందుకు వీలుగా ఆల్గో ట్రేడింగ్‌లో ప్రధాన వర్గాలైన ఇన్వెస్టర్లు, బ్రోకర్లు, ఆల్గో ప్రొవైడర్లు, మార్కెట్ మౌలిక వసతులు కల్పించే సంస్థల హక్కులు, బాధ్యతలకు సంబంధించి సెబీ నియంత్రణ నియమావళిని ప్రవేశపెట్టింది. ఆగస్టు 1 నుంచి ఇది అమల్లోకి రానుంది. వేగంగా ఆర్డర్ల ఎగ్జిక్యూషన్‌తో పాటు ద్రవ్య లభ్యతను మెరుగుపరచడం వంటి పలు ప్రయోజనాలున్న ఆల్గో ట్రేడింగ్‌లో ప్రస్తుతం సంస్థాగత ఇన్వెస్టర్లు మాత్రమే పాల్గొనేందుకు అనుమతి ఉంది. సెబీ నియంత్రణ నియమావళి ప్రకారం.. రిజిస్టర్డ్ బ్రోకర్లు రిటైల్ ఇన్వెస్టర్లకు ఆల్గో ట్రేడింగ్ సదుపాయాన్ని కల్పిస్తారు. ప్రతి ఆల్గోకు స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి అవసరమైన అనుమతులు పొందాకే బ్రోకర్లు రిటైల్ మదుపరులకు ఈ సదుపాయాన్ని కల్పించాల్సి ఉంటుంది. ఇందులో పారదర్శకత కోసం ఎక్స్ఛేంజ్‌లు చిన్న మదుపరుల ఆల్గో ట్రేడింగ్ కార్యకలాపాలను పర్యవేక్షించనున్నాయి. ఇందుకోసం ఎక్స్ఛేంజీలు అన్ని ఆల్గో ఆర్డర్లకు వినూత్న గుర్తింపును కేటాయించనున్నాయి. నిషేధిత కార్యకలాపాల ఏపీఐను పర్యవేక్షించడంతోపాటు ఆల్గో ట్రేడింగ్‌లో మదుపరుల సమస్యలను పరిష్కరించాల్సిన పూర్తి బాధ్యత బ్రోకర్లదే. 2023-24 ఆర్థిక సంవత్సరంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు తమ లాభాల్లో 97 శాతం, బడా ట్రేడర్లు 96 శాతం లాభాలను ఆల్గో ట్రేడింగ్ ద్వారానే ఆర్జించారని సెబీ గత అధ్యయన నివేదిక వెల్లడించింది.

అదానీ నివేదికపై కట్టుబడి ఉన్నాం..

- సంస్థ మూసివేతలో ఎవరి బలవంతం లేదు..
- హిండెన్‌బర్గ్ వ్యవస్థాపకులు నాథన్ ఆండర్సన్

న్యూఢిల్లీ: భారత్‌లో రెండో అతిపెద్ద ధనవంతుడు గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్‌పై చేసిన ఆరోపణలు సహా తాము విడుదల చేసిన అన్ని నివేదికలకూ ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని అమెరికన్ మార్కెట్ రీసెర్చ్, షార్ట్ సెల్లింగ్ కంపెనీ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వ్యవస్థాపకులు నాథన్ ఆండర్సన్ అన్నారు. అదానీ గ్రూప్ కంపెనీల అక్రమాలకు సంబంధించి మీడియాలో పలు కథనాలు వచ్చిన నేపథ్యంలోనే తామూ దర్యాప్తు ప్రారంభించామన్నారు. మీడియా కథనాల్లో ప్రస్తావించిన అవకతవకలపై ఆధారాల కోసం అన్వేషించామన్నారు. కానీ, హిండెన్‌బర్గ్ రీసెర్చ్‌ను మూసివేస్తున్నట్లు నాథన్ ఆండర్సన్ ఈ ఏడాది జనవరిలో ప్రకటించి అందరినీ విస్మయపరిచారు. బలమైన ఒత్తిళ్ల వల్లే ఆయన దుకాణం కట్టేశారన్న ఊహాగానాలు గుప్పుమన్నాయి. అయితే, తమను ఎవరూ బెదిరించలేదని.. కేవలం పనిభారం వల్లే ఆ నిర్ణయం తీసుకున్నట్లు పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన స్పష్టం చేశారు.

"అదేమైనా సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ లేదా వస్తు తయారీ అయితే దాన్ని ఇతరులకు విక్రయించవచ్చు. కానీ, నా పని మార్కెట్ పరిశోధన. దాన్ని ఇతరులకు అప్పగించలేను కదా. అందుకే సంస్థను మూసివేయాల్సి వచ్చింది. అయితే, నాతో పనిచేసిన బృందం కొత్త సంస్థను ప్రారంభిస్తే గనుక వారికి అవసరమైన మద్దతును సంతోషంగా అందిస్తా"నని ఆండర్సన్ పేర్కొన్నారు.

స్పోర్ట్స్

వరల్డ్‌కప్ స్టార్లకు ఘన స్వాగతం



త్రిష, ధ్రుతి



షబ్నం

హైదరాబాద్/విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): ఐసీసీ అండర్-19 టీ20 వరల్డ్‌కప్‌లో పాల్గొన్న తెలుగు క్రీడాకారిణులు గొంగడి త్రిష, షబ్నం షకీల్, ధ్రుతి కేసరికి ఘన స్వాగతం లభించింది. మంగళవారం తెల్లవారుజామున తెలంగాణ అమ్మాయిలు గొంగడి త్రిష, ధ్రుతి కేసరి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. వీరికి హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు స్వాగతం పలికారు. త్రిష, ధ్రుతితో పాటు కోచ్ నూషీన్ అల్ ఖదీర్, ఫిట్‌నెస్ ట్రైనర్ షాలిని కూడా ఉన్నారు. ఇక పేసర్ షబ్నం షకీల్‌ను విశాఖపట్నం విమానాశ్రయంలో అభిమానులు కేరింతల నడుమ స్వాగతించారు. శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారిణి రమణకుమారి.. షబ్నమ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

తెలంగాణకు తొలి స్వర్ణం

జాతీయ క్రీడలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణకు 38వ జాతీయ క్రీడల్లో ఎట్టకేలకు స్వర్ణ పతకం లభించింది. డెహ్రాడూన్‌లో జరుగుతున్న ఈ పోటీలకు ఎనిమిదో రోజైన మంగళవారం మహిళల 3-3 బాస్కెట్‌బాల్ పోటీల్లో గులాబ్‌షా అలీ, పుష్ప, హర్షిత, ప్రియాంకతో కూడిన తెలంగాణ జట్టు 21-11తో కేరళపై నెగ్గి ఈ క్రీడల్లో తొలి పసిడి పతకాన్ని అందించింది. పురుషుల బాస్కెట్‌బాల్ 3-3 పోటీల్లో తెలంగాణ జట్టు సెమీఫైనల్లో 16-21తో తమిళనాడు చేతిలో ఓడింది. బీచ్ వాలీబాల్‌లో తెలంగాణ మహిళల జట్టు క్వార్టర్స్‌లో ప్రవేశించింది. ఆంధ్రప్రదేశ్‌కు మంగళవారం రెండు కాంస్య పతకాలు లభించాయి. పురుషుల బ్యాడ్మింటన్ డబుల్స్‌లో సాయి పవన్-షేక్ గౌస్ జోడీ, కనోయింగ్-కయాకింగ్‌లో చేతన కాంస్య పతకాలు సాధించారు.



ఆర్చర్ ధీరజ్ రికార్డు ప్రదర్శన: జాతీయ క్రీడల్లో విజయవాడ యువ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ మూడు జాతీయ రికార్డులను తిరగరాశాడు. పదేళ్ల కిందటి రికార్డులను బద్దలుకొట్టాడు. మంగళవారం జరిగిన ఆర్చరీ రికర్వ్ ర్యాంకింగ్ పోటీల్లో 70 మీటర్ల విభాగంలో 347/360, 2-70 మీటర్ల కేటగిరీలో 690/720, టీమ్ ఈవెంట్‌లో 2038/2160 స్కోరుతో గత రికార్డులను ధీరజ్ అధిగమించాడు.

ప్రీక్వార్టర్స్‌లో సుమిత్

న్యూఢిల్లీ: రోసారియో చాలెంజర్ పోటీల్లో భారత టెన్నిస్ స్టార్ సుమిత్ నగల్ ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించాడు. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో సుమిత్ 5-7, 6-1, 6-0తో స్థానిక ఆటగాడు రెన్జో ఒలివోపై గెలిచాడు.

చెన్నై ఓపెన్ నుంచి రామ్, ముకుంద్ అవుట్

చెన్నైలో జరుగుతున్న చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నమెంట్‌లో భారత ఆటగాళ్లకు చుక్కెదురైంది. సింగిల్స్ స్టార్లు రామ్‌కుమార్ రామనాథన్, ముకుంద్ శశికుమార్ ఆరంభ రౌండ్లలోనే వెనుదిరిగారు. మంగళవారం జరిగిన తొలి రౌండ్లో రామ్‌కుమార్ 3-6, 5-7తో జే క్లార్క్ చేతిలో, ముకుంద్ 3-6, 7-6, 1-6తో అలెక్సీ జఖరోవ్ చేతిలో ఓడారు.

ఆఖరి అవకాశం

ఫామ్ కోసం రోహిత్, కోహ్లీ తంటాలు



ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ రేపటి నుంచే

ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్ ద్వారా భారత జట్టు ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీకి సన్నద్ధం కావాలనుకుంటోంది. వాస్తవానికి ఈ ఫార్మాట్‌లో చివరిసారి భారత జట్టు ఆరు నెలల క్రితం ఆడడం గమనార్హం. ఆ తర్వాత మళ్లీ బుధవారం నుంచి 50 ఓవర్ల మ్యాచ్ ఆడబోతోంది. మరోవైపు బట్లర్ సేనతో జరిగే ఈ మూడు వన్డేలు కూడా కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు అత్యంత కీలకం కానున్నాయి. ఎందుకంటే ఈ ఇద్దరూ తమ ఫామ్‌ను అందుకునేందుకు ఈ సిరీస్‌ను చివరి అవకాశంగా భావించాల్సి ఉంటుంది. ఇద్దరికీ ఆసీస్ పర్యటన చేదు అనుభవాన్నే మిగిల్చింది. దీనికితోడు ఆడిన ఏకైక రంజీ మ్యాచ్‌లోనూ విఫలమయ్యారు. జమ్మూ-కశ్మీర్‌పై రోహిత్ 3, 28 రన్స్ చేయగా.. విరాట్ రైల్వేస్‌పై ఆరు పరుగులే చేసి బౌల్డయ్యాడు. అయితే వన్డే ఫార్మాట్‌లో ఓపెనర్‌గా రోహిత్, వన్‌డౌన్‌లో విరాట్ మెరుగైన ప్రదర్శనే కనబరుస్తుంటారు. గతేడాది ఆగస్టులో శ్రీలంకపై రోహిత్ మూడు మ్యాచ్‌ల్లో 157 పరుగులు సాధించాడు. కానీ ఆ తర్వాతే తన ప్రదర్శన దిగజారుతూ వచ్చింది. ఇక విరాట్ ఆ సిరీస్‌లోనూ పెద్దగా ఆకట్టుకోలేదు. కానీ ఇంగ్లండ్‌తో సిరీస్‌లో వన్డేల్లో వేగంగా 14 వేల పరుగులు పూర్తి చేసేందుకు ఎదురుచూస్తున్నాడు. ఈ ఫీట్‌కు తను 94 పరుగుల దూరంలో ఉన్నాడు. అంతేకాకుండా ఆఫ్‌సైడ్ ఆవలి బంతులను వేటాడే బలహీనతను వీలైనంత త్వరగా అధిగమించి.. భారీగా పరుగులను సాధిస్తే జట్టుకు అంతకు మించిన ప్రయోజనం ఉండదు. ఇదిలావుండగా చాంపియన్స్ ట్రోఫీలో రోహిత్, విరాట్ స్థాయికి తగ్గట్టు ఆడితే భారత్ విజయావకాశాలు మెరుగవుతాయని మాజీ బ్యాటర్ సురేశ్ రైనా అభిప్రాయపడ్డాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

కీపింగ్ బాధ్యతలు ఎవరికి?

రోహిత్, గిల్ ఓపెనర్లుగా రానుండగా విరాట్, శ్రేయాస్ ఆ తర్వాతి స్థానాల్లో బరిలోకి దిగడం ఖాయమే. అయితే వికెట్ కీపర్, బ్యాటర్‌గా ఎవరిని ఆడిస్తారనేది ఆసక్తిగా మారింది. ఈ సిరీస్ కోసమే కాకుండా చాంపియన్స్ ట్రోఫీలోనూ ఐదో స్థానం కోసం రిషభ్ పంత్-కేఎల్ రాహుల్‌ల మధ్య పోటీ నెలకొంది. 2023 ఆగస్టు నుంచి ఈ ఫార్మాట్‌లో రాహుల్ కీపర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇక కారు ప్రమాదం నుంచి కోలుకున్నాక, గతేడాది ఆగస్టులో శ్రీలంకపై మూడో మ్యాచ్‌లో కీపింగ్ చేసిన పంత్ ఆరు పరుగులే చేశాడు. అటు ఆసీస్ పర్యటనలో రాహుల్ పది ఇన్నింగ్స్‌లో 276 పరుగులు చేస్తే.. పంత్ తొమ్మిది ఇన్నింగ్స్‌లో 255 రన్స్ సాధించాడు. ఇక ఇద్దరికీ ఇంగ్లండ్‌తో ముగిసిన టీ20 సిరీస్‌లో చోటు దక్కలేదు. ఒకవేళ తాజా సిరీస్‌లో రాహుల్‌కు చోటు కల్పిస్తే టాప్-6లో ఎడమచేతి బ్యాటర్ ఉండడు. ఇందుకోసం స్పిన్ ఆల్‌రౌండర్లలో ఒకరిని ప్రమోట్ చేయాల్సి ఉంటుంది. అదే ఇద్దరినీ తీసుకుంటే శ్రేయా్‌స్‌ను తప్పించి రాహుల్‌ను స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఆడించాల్సి ఉంటుంది.

బౌలర్ల ఫిట్‌నెస్ కీలకం

భారత జట్టులో ముగ్గురు బౌలర్లు గాయాల నుంచి కోలుకుని బరిలోకి దిగబోతున్నారు. స్టార్ పేసర్ బుమ్రా సిడ్నీ టెస్టు రెండో ఇన్నింగ్స్ నుంచి క్రికెట్‌కు దూరంగా ఉంటున్నాడు. ప్రస్తుతం ఎన్‌సీఏలో పరీక్షల కోసం ఉన్న తను ఇంగ్లండ్‌తో చివరి వన్డే ఆడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇక స్పిన్నర్ కుల్దీప్ గతేడాది అక్టోబరు నుంచి భారత్ తరఫున బరిలోకి దిగలేదు. గత వారం రంజీ మ్యాచ్ ఆడి మూడు వికెట్లు తీశాడు. అలాగే పేసర్ షమి ఏడాది బ్రేక్ తర్వాత దేశవాళీతో పాటు ఐదు టీ20ల సిరీస్‌లో ఆడాడు. చాంపియన్స్ ట్రోఫీని దృష్టిలో ఉంచుకుంటే వీరితో పాటు పేసర్ అర్ష్‌దీప్ ఫిట్‌నెస్ కూడా కీలకం కానుంది.

వందో టెస్టుతో.. కరుణరత్నె వీడ్కోలు



గాలె: శ్రీలంక వెటరన్ బ్యాటర్ దిముత్ కరుణరత్నె కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఆస్ట్రేలియాతో గురువారం నుంచి జరిగే రెండో టెస్ట్.. అతడి కెరీర్‌లో 100వ మ్యాచ్. ఈ టెస్ట్‌తో అతడు ఆటకు వీడ్కోలు పలకనున్నాడు. 36 ఏళ్ల కరుణరత్నె 99 టెస్టుల్లో 7172 పరుగులు సాధించాడు. అందులో 16 శతకాలు, 34 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 'ఏడాదికి నాలుగు టెస్టులే ఆడి ఫామ్‌ను కొనసాగించడం చాలా కష్టం. మాథ్యూస్, దినేష్ చాందిమల్‌తో కూడా మాట్లాడా. ముగ్గురం ఒకేసారి రిటైరయ్యే బదులు.. ఒక్కొక్కరుగా వీడ్కోలు పలికితే మంచిదని భావించామ'ని చెప్పాడు.

ఒక్క సిరీస్‌తో తక్కువ చేస్తే ఎలా?

గిల్

నాగ్‌పూర్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత జట్టు వైఫల్యంపై ఓపెనర్ శుభ్‌మన్ గిల్ స్పందించాడు. 'ఒక్క సిరీస్ ద్వారా జట్టు మొత్తం ప్రదర్శనను తక్కువ చేయలేం. మా జట్టులో చాలా మంది ఆటగాళ్లు నిలకడగా రాణించి ఎన్నో సిరీస్‌లను, మ్యాచ్‌లను గెలిపించారు. అయితే ఆసీస్ పర్యటనలో జట్టు స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేదనేది వాస్తవమే. సిడ్నీ టెస్టు చివరి ఇన్నింగ్స్‌కు బుమ్రా దూరం కావడం నష్టపరిచింద'ని అన్నాడు.



అభిమాని అనుకుని పోలీసులు ఆపేశారు

నాగ్‌పూర్: ఇంగ్లండ్‌తో తొలి వన్డే కోసం భారత జట్టు ఇక్కడకు చేరుకొంది. ఆటగాళ్లందరూ టీమ్ బసచేస్తున్న హోటల్‌కు బస్సులో వచ్చారు. జట్టులో అందరూ తమ లగేజీని తీసుకెళ్తున్న సమయంలో టీమిండియా త్రోడౌన్ స్పెషలిస్ట్ రఘుకు మాత్రం ఊహించని అనుభవం ఎదురైంది. పోలీసులు అతడిని అభిమానిగా భావించి హోటల్‌లోకి వెళ్లకుండా అడ్డుకొన్నారు. తాను జట్టు సభ్యుడినని అతడు పోలీసులకు వివరించే ప్రయత్నం చేశాడు. ఆ తర్వాత ఎవరు చెప్పారో తెలియదు కానీ.. పోలీసులు నవ్వుతూ అతడిని వదిలేశారు. రఘు కూడా ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. ఈ వీడియో ఇప్పుడు నెట్‌లో చక్కర్లు కొడుతోంది.

వన్డేల్లోకి వరుణ్



మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు ఎంపిక చేశారు. ఇటీవలే ముగిసిన ఐదు టీ20ల సిరీస్‌లో అతను అద్భుతంగా రాణించి 14 వికెట్లు తీశాడు. అయితే ఇప్పటికే ప్రకటించిన వన్డే జట్టులో వరుణ్ పేరు లేకపోయినా.. తాజా ప్రదర్శనతో ఈ ఫార్మాట్‌లోనూ ఆడించాలని జట్టు భావిస్తోంది. మంగళవారం నెట్స్‌లో ప్రాక్టీస్ చేశాడు. అతను గురువారం జరిగే తొలి వన్డేలో అరంగేట్రం చేసే అవకాశాలున్నాయి. మరోవైపు ఇప్పటికే జట్టులో నలుగురు స్పిన్నర్లు ఉన్నారు. దీంతో చాంపియన్స్ ట్రోఫీ తుది జట్టులో వరుణ్ ఉండాలంటే కుల్దీప్ లేక సుందర్‌లలో ఒకరిపై వేటు పడవచ్చు.

ముంబై జట్టులో సూర్య, దూబే

ముంబై: భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్, ఆల్‌రౌండర్ శివమ్ దూబే రంజీ మ్యాచ్ ఆడనున్నారు. ఈనెల 8 నుంచి జరిగే క్వార్టర్స్‌లో ముంబై జట్టు హరియాణాతో తలపడనుంది. ఇందుకోసం రహానె నేతృత్వంలో 18 మందితో కూడిన ముంబై జట్టును ప్రకటించారు. ఇంగ్లండ్‌పై టీ20ల్లో పేలవ ఫామ్‌తో నిరాశపర్చిన సూర్య ఈ మ్యాచ్‌తో ఫామ్‌ను అందుకోవాలనుకుంటున్నాడు.



టాటా స్టీల్ చెస్ విజేత ప్రజ్ఞానంద స్వదేశం చేరుకొన్నాడు. మంగళవారం చెన్నై ఎయిర్‌పోర్టులో అతడికి తమిళనాడు ప్రభుత్వ అధికారులు, జాతీయ చెస్ సమాఖ్య ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. నెదర్లాండ్స్‌లో జరిగిన ఆ టోర్నీలో వరల్డ్ చాంపియన్ గుకేష్‌ను ఓడించి ప్రజ్ఞానంద టైటిల్ సొంతం చేసుకొన్న సంగతి తెలిసిందే.

ఇంటింటి సర్వేపై అపోహలు సృష్టించవద్దు

» విపక్షాలకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సూచన

» ఓసీలు తగ్గారు.. బీసీలు పెరిగారని వెల్లడి



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు తమ ప్రభుత్వం సామాజిక ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కులగణన సర్వే నిర్వహించిందన్నారు. మంగళవారం అసెంబ్లీలో సర్వేపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. విపక్షాల ఆరోపణలను ఆయన తిప్పికొడుతూ సర్వేను క్రమశిక్షణతో, నిబద్ధతతో నిర్వహించామని చెప్పారు. అంకెల గారడీతో ఇంటింటి సర్వేపై ప్రజల్లో అపోహలు, అనుమానాలు సృష్టించవద్దని కోరారు. బీఆర్ఎస్ హయాంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో ఓసీల శాతం 21 ఉండగా... ఇప్పుడు 15.79 శాతానికి తగ్గిందనితెలిపారు. బీసీల శాతం 51 ఉండగా... తమ సర్వేలో 56 శాతానికి పెరిగిందని చెప్పారు. గణాంకాలు ఇంత స్పష్టంగా ఉండగా విపక్షాలు ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. బీసీలకు రిజర్వేషన్లపై అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని కేంద్రానికి పంపుతున్నామని, ఇక్కడి బీజేపీ నేతలు కేంద్రాన్ని ఒప్పించి, రిజర్వేషన్లను ఆమోదింపజేయాలని సూచించారు.

కేంద్రంపై ఒత్తిడి తెస్తాం: కోమటిరెడ్డి

స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను పెంచాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. వారం రోజుల తర్వాత ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశం ఏర్పాటుచేసి ఎస్సీ వర్గీకరణ చట్టాన్నీ చేస్తామని చెప్పారు. కులగణనకు సంబంధించి 4 వాల్యూమ్‌లు ఉన్నాయని, వాటిలో మూడింటిని ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. అసెంబ్లీ లాబీల్లో మంగళవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ కులగణన గురించి మాట్లాడే అర్హత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు లేదన్నారు. పరిషత్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఒక్క జెడ్పీ సీటు కూడా రాదన్నారు. ఆ పార్టీకి ఓటు బ్యాంకు కూడా పెరగలేదన్నారు.

గతంలో కచ్చితమైన లెక్కలేదు: పొన్నం

గతంలో బీసీల జనాభాకు సంబంధించి ఎలాంటి నిర్ధారిత లెక్క లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 1931లో మాత్రమే కులగణన జరిగిందని, ఆ తర్వాత ఎప్పుడూ కులాల వారీగా లెక్కలు తీయలేదని చెప్పారు. బలహీన వర్గాలకు న్యాయం జరగాలన్న ఉద్దేశంతో తమ ప్రభుత్వం ఈ సర్వే చేపట్టిందని, ఇది చాలా సున్నితమైన అంశమని, రాజకీయాలకు తావివ్వరాదని సూచించారు.

రాష్ట్రంలో సగానికి పైగా బీసీల జనాభా

» టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

రాష్ట్రంలో సగానికి పైగా జనాభాలో బీసీలు ఉన్నారనే విషయం సర్వే ద్వారా తేట తెల్లమైందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. అసెంబ్లీ, మండలిలో బీసీ కులగణన నివేదికను ప్రవేశపెట్టడం చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుందన్నారు. గత ప్రభుత్వం 33 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించిందని ఆరోపించారు. పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు బీసీ కులగణన చేపట్టి ఏడాదిలో పూర్తి చేశామని తెలిపారు. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా కులగణన జరపాలని కోరుతున్నారని, దానికి తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు.

బీసీ జనాభాను తగ్గించి చూపించినట్టుంది: తీన్మార్ మల్లన్న

కులగణన సర్వే నివేదికలో బీసీల జనాభాను తగ్గించి చూపినట్టుందని అధికారపక్ష ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అనుమానం వ్యక్తం చేశారు. బీసీల రిజర్వేషన్ కోసం తాజా సర్వే నివేదికను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం.. ఎస్సీల వర్గీకరణకు 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మంగళవారం శాసనమండలి మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేసే వరకు తాను పోరాడతానని చెప్పారు. సర్వేలో 42 లక్షల మందిని విస్మరించారన్నారు.

సమాచారం సరిపోలడం లేదు: అక్బరుద్దీన్

బీసీ కులగణన చేయాలన్న ప్రభుత్వ ఉద్దేశం మంచిదే అయినా నిర్వహించిన తీరుపై అనేక అనుమానాలు వస్తున్నాయని మజ్లిస్ పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. రాష్ట్రంలో ఓటర్లు, జారీ అయిన ఆధార్ కార్డులు, తెల్ల రేషన్ కార్డుల గణాంకాలతో ప్రభుత్వం చేపట్టిన సర్వే వివరాలు సరిపోలడం లేదన్నారు. ఈ సర్వే వివరాలే నిజమైతే ఆధార్ వివరాలు తప్పయి ఉండాలని, దానిపై అసెంబ్లీలో ఓ తీర్మానం చేసి ఆధార్-యూఐడీఏఐకి పంపాలని సూచించారు. ఈబీసీ రిజర్వేషన్లను 10 నుంచి 25 శాతం పెంచాలని కోరారు. అగ్రవర్ణాల్లోని పేదలకూ రిజర్వేషన్ ఫలాలు అందాలన్నారు. బీసీ విద్యార్థులకు మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదని తెలిపారు.

వివరాలతో ఏం చేస్తారో చెప్పలేదు: కూనంనేని

సర్వే వివరాలతో ఏం చేస్తారనే విషయాన్ని ప్రభుత్వం చెప్పలేదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తారా? లేక మరేదైనా కారణం ఉందా అనే విషయాన్ని వెల్లడించలేదన్నారు. గత ప్రభుత్వం 2014లో ఒక్క రోజులోనే సర్వే చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర నెలలు సర్వే చేసి వివరాలు సేకరించిందన్నారు. నాటి సర్వేకు నేటి సర్వేకు ఎంతో తేడా ఉంటుందన్నారు. సర్వేలో సేకరించిన వివరాలను గ్రామసభల్లో ఉంచి ఏదైనా తప్పులు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. అయితే జనం ఊహించుకున్నంత గొప్పగా ఈ రిజర్వేషన్లతో ఉపయోగం ఉండదన్నారు.

పొన్నంను సీఎం చేయండి: బీఆర్ఎస్ నేతలు

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. సభలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతున్న సమయంలో తమకు మాట్లాడేందుకు అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్‌ను ఉద్దేశించి కోరారు. అయితే అదే సమయంలో సామాజిక న్యాయం జరగాలంటే పొన్నంను సీఎం చేయాలంటూ బీఆర్ఎస్ నాయకులు పాడి కౌశిక్ రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. బీఆర్ఎస్ నేతల వైపు చూస్తూ మంత్రి పొన్నం... 'నన్ను వదిలేయండి' అన్నట్టు చేతులు జోడించి దండం పెట్టారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

» కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీ తీర్మానం

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కులగణన దేశవ్యాప్తంగా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసింది. దేశంలోని వివిధ కులాలకు సంబంధించిన స్థితిగతుల్ని అర్థం చేసుకోవడానికి వీలుగా.. తెలంగాణలో నిర్వహించిన తరహాలోనే దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ సభలో తీర్మానం చేశారు.

కులగణన సర్వేపై నేడు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

సమగ్ర కులగణన సర్వేపైన బుధవారం అసెంబ్లీ కమిటీ హాల్లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పీపీపీ) ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సబ్ కమిటీ కో చైర్మన్ దామోదర రాజనర్సింహ, సభ్యులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క తదితరులు పాల్గొననున్నారు.



బీసీలకు 42% సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

మాట ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కులగణన సర్వేపై మంగళవారం శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారు. బీజేపీ సభ్యుడు పాయల్ శంకర్‌ను అపోహల సంఘం మాట్లాడిస్తున్నట్లు కనిపిస్తోందంటూ పరోక్షంగా బీఆర్ఎస్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. "2011 జనగణన ప్రకారం రాష్ట్రంలో 3,50,03,674 మంది జనాభా ఉంటే.. వీళ్ల (బీఆర్ఎస్) చేపట్టిన ఇంటెన్సివ్ హౌస్ హోల్డ్ సర్వే ప్రకారం 3,68,76,544గా తేలింది. ఇదే డాక్యుమెంట్‌లోని పేజీ నంబర్ 33లో ఓసీలు 21 శాతంగా ఉన్నారు. కానీ, మా సర్వేలో ఓసీల శాతం పెరిగిందంటున్నారు. పాయల్ శంకర్ మంచోడే. కానీ, వెనుక ఉన్నోళ్లు (బీఆర్ఎస్) ఏది చెబితే అది వింటున్నట్లున్నారు? వాళ్ల లెక్క ప్రకారం.. బీసీలు 1,85,61,856 మంది అంటే.. 51 శాతం. ఓసీలు 78,12,858 మంది అంటే 21 శాతం. ఎస్సీలు 63,60,158 మంది అంటే 18 శాతం. ఎస్టీలు 36,02,288 మంది అంటే 10 శాతం. మా ప్రభుత్వ లెక్కల ప్రకారం.. బీసీ జనాభా 56.33 శాతం. అంటే ఈ రోజు బీసీలు పెరిగారా? తగ్గారా? ఓసీలను వాళ్లు 21 శాతంగా చూపిస్తే.. మా సర్వేలో 15.79 శాతంగా తేలింది. ఓసీలు పెరిగినట్లా? బీసీలు పెరిగినట్లు వాస్తవాలను తెచ్చి సభలో పెట్టాం" అని సీఎం అన్నారు.



సభను తప్పుదోవ పట్టిస్తున్నారు..


గత బీఆర్ఎస్ ప్రభుత్వ సర్వే డాక్యుమెంట్‌లో నాలుగు కేటగిరీలనే చూపించారని, ముస్లిం మైనారిటీలను చూపించలేదని సీఎం రేవంత్ తెలిపారు. "సభను తప్పుదోవ పట్టిస్తే ఎలా? వారి డాక్యుమెంట్ అధికారికమా? కాదా? అనేది అక్కడ మంత్రులుగా పని చేసిన వారుచెప్పాలి. మా సర్వేలో చెప్పిన సమాచారాన్ని మొత్తం మేము ఓన్ చేసుకుంటున్నాం. వంద శాతం ఈ సర్వేను మేము బాధ్యతగా తీసుకుంటున్నాం" అని సీఎం చెప్పారు. ఇంత సమగ్రంగా ప్రభుత్వం సర్వే చేస్తే.. మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, పద్మారావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ వివరాలు ఇవ్వలేదని ముఖ్యమంత్రి తప్పుబట్టారు. పైగా తప్పుడు లెక్కలు తెచ్చి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. "1931 మాత్రమే కాదు.. ప్రతి పదేళ్లకోసారి జనగణన చేశారు. 2014లో నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక 2021కు సంబంధించిన జనగణన చేపట్టడం లేదు. బలహీన వర్గాలకు హక్కులు ఇవ్వడం బీజేపీకి ఇష్టం లేదు. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్లలో ఎప్పుడూ ఆగని జనగణనను ఎందుకు ఆపారు? అందుకే జనగణన చేపట్టాలని, అందులో కులగణనను కూడా చేపట్టాలంటూ మా పార్టీ నేత రాహుల్‌గాంధీ ప్రధానిని డిమాండ్ చేశారు. దానికి సమాధానం లేదు. వీళ్ల(బీఆర్ఎస్) సమగ్ర కుటుంబ సర్వే చేసి, ఒకే ఒక కుటుంబం దానిని దాచి పెట్టుకుంది. ఈ డాక్యుమెంటును బయటి గ్రూపుల్లో సర్క్యులేట్ చేస్తున్నారు. మంత్రివర్గ సమావేశంలో పెట్టి ఎందుకు ఆమోదించలేదు? శాసనసభలో ఎందుకు ప్రవేశపెట్టలేదు? ఎందుకు బయట పెట్టలేదు?" అని సీఎం ప్రశ్నించారు.

మాది అధికారిక డాక్యుమెంట్..

2011 జనాభా లెక్కలు తప్ప.. ఎక్కడా అధికారిక లెక్కలు లేవని ముఖ్యమంత్రి తెలిపారు. 2024లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ సర్వే మాత్రమే అధికారిక డాక్యుమెంట్ అని, ఇంతకు మించి అధికారిక డాక్యుమెంట్ లేదని స్పష్టం చేశారు. "2011 జనాభా లెక్కల ప్రకారం.. రాష్ట్రంలో 3,50,03,674 మంది జనాభా ఉంది. ఈ రోజు 3.70 లక్షలకు పైగా జనాభా ఉంది. ఇంకా ఎక్కడా అధికారిక లెక్కలు లేవు. ఎవరైనా చెబితే అవి ఊహించినవే. సామాజిక న్యాయం చేయాలనే ఉక్కు సంకల్పంతో ఈ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు సహకరించండి. అర్థం పర్థం లేని కాగితాలు తెచ్చి, సభను తప్పుదోవ పట్టించవద్దు. సర్వేలో పాల్గొనని వారు ఈ సభలోనే ఉన్నారు. ఇప్పటికైనా వారు వివరాలు ఇవ్వాలని కోరుతున్నా" అని రేవంత్ అన్నారు. హిందువులు, ముస్లింలలో బలహీన వర్గాలవారు 50 శాతానికి పైగా ఉన్నారని మొదటి నుంచి చర్చించుకుంటున్నామని, కానీ.. దీనికి ఒక సహేతుకత, పారదర్శకమైన పాలసీ డాక్యుమెంట్ లేదని పేర్కొన్నారు. ఈ దేశాన్ని బ్రిటిష్‌వాళ్లు పరిపాలించినప్పుడు 1931లో కుల గణనను చేపట్టారు తప్ప.. జనాభా లెక్కల సందర్భాల్లో కుల గణన జరగలేదన్నారు. ఎస్సీ, ఎస్టీల వివరాలను మాత్రమే పొందుపర్చారు తప్ప.. బలహీనవర్గాల వివరాలను పొందుపరచలేదని తెలిపారు. దీంతో బీసీల లెక్క లేకపోవడం వారికి ఒక బాధగా, హక్కులను కాలరాస్తున్నట్లుగా మిగిలిపోయిందన్నారు.

రాహుల్‌గాంధీ చెప్పారు..

ఎంత మంది ఉంటే అంతమేర హక్కులు ఇవ్వాలని, కులాల ప్రాతిపదికన జనాభా లెక్కలు తీయాలని తమ నాయకుడు రాహుల్‌గాంధీ చెప్పారని సీఎం రేవంత్ తెలిపారు. కానీ, ఇందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రాలేదన్నారు. "రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే.. బలహీనవర్గాల లెక్క తేల్చి వారికి రాజకీయ, విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు కల్పిస్తామని తెలంగాణలో యాత్ర సందర్భంగా రాహుల్‌గాంధీ చెప్పారు. అందుకే మంత్రివర్గ సమావేశంలో సర్వేపై తీర్మానం చేశాం. కులగణన జరగాలన్న లక్ష్యంతో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశాం. ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాం. 12 సార్లు సమీక్ష సమావేశాలు పెట్టి, పకడ్బందీగా సర్వే చేశాం. ఇది చారిత్రక నిర్ణయం. దీనికి మంత్రిమండలి సమావేశంలో ఆమోదం తెలిపి, సభలో ప్రవేశపెట్టాం. బలహీన వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కల్పించాలంటే దీనికి చట్టబద్ధత కల్పించాలి. అందుకే ఈ రోజు 46.25 శాతం ఉన్న బీసీలు, బీసీల్లోని 'ఇ' గ్రూపులో ఉన్న 10.08 శాతం కలిపి మొత్తం 56.33 శాతం మంది బీసీలకు సముచిత స్థానం కల్పించాలన్న ఆలోచనతో ఈ ప్రభుత్వం నిర్ణయం తీసుకుని, ముందుకు వచ్చింది. ఇందుకు అన్ని పార్టీలు ప్రభుత్వాన్ని అభినందించాలని కోరుతున్నా" అని ముఖ్యమంత్రి అన్నారు.



బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ వైఖరి ఎలా ఉండబోతుందన్న విషయాన్ని గత ఏడాది ఆగస్టులోనే చెప్పిన ఆంధ్రజ్యోతి

వ్యక్తిగత సమాచారం మినహా అంతా ఇస్తాం..

కులగణన పూర్తి నివేదికను సభలో ఎందుకు పెట్టలేదని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ ప్రశ్నించడంపై ముఖ్యమంత్రి స్పందిస్తూ, "మొత్తం నాలుగు వాల్యూమ్‌లలో వేలాది పేజీల్లో నివేదిక ఉంది. అయితే నాలుగో వాల్యూమ్‌లో ప్రజల వ్యక్తిగత సమాచారం అంతా ఉంది. వ్యక్తిగత సమాచార భద్రత చట్టం కింద ఆ సమాచారాన్ని బహిర్గతం చేస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తారు. అందుకే ఈరోజు సభలో పెట్టలేదు. వ్యక్తిగత సమాచారం లేని మిగతా మూడు వాల్యూమ్‌లు బహిర్గతం చేసేందుకు మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. సర్వేకు సంబంధించి ఏ వివరాలైనా నాతో చర్చించవచ్చు. నేను అమావాస్యకో, పౌర్ణమికో వచ్చే ముఖ్యమంత్రిని కాను.. నిత్యం అందరికీ అందుబాటులో ఉండే ముఖ్యమంత్రిని.. గత 14 నెలలుగా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నా" అని రేవంత్ అన్నారు. గత ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వే ఓ ఫాల్తూ రిపోర్ట్ అని, అందులో ఎస్సీల్లో 82 ఉప కులాలు ఉన్నాయని చెప్పారు. గత ప్రభుత్వం చెప్పినట్టుగా ఎస్సీల్లో 82 ఉపకులాలుంటే సీఎం పదవికి ఇప్పుడే రాజీనామా చేసి వెళ్లిపోతానని సవాల్ చేశారు. సీఎం సమాధానం తర్వాత కూడా అక్బరుద్దీన్ మళ్లీ అదే అంశాన్ని గట్టిగా లేవనెత్తడంతో.. రేవంత్ మళ్లీ స్పందించారు. "మీరు ఇక్కడ సీనియర్ ఎమ్మెల్యే. మేము మధ్యలో బ్రేక్ ఇచ్చి వస్తుంటే.. మీరు మాత్రం 1999 నుంచి వరుసగా గెలిచి వస్తున్నారు. మీరు కులగణనపై ఇలా గట్టిగా మాట్లాడితే.. ప్రభుత్వానిదే తప్పని ప్రజలు భావించే ప్రమాదముంది" అని సీఎం నవ్వుతూ అన్నారు. అంతకుముందు కులగణనపై మంత్రివర్గ సమావేశంలో చర్చించారు. బీసీ కులాల శాతంపై వస్తున్న రకరకాల వాదనలపైనా క్యాబినెట్ చర్చించింది. సర్వే ఎలా చేశామన్న అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అభిప్రాయపడింది.

సర్వేలో పాల్గొననివారికి మైక్ ఇవ్వొద్దు

2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే నివేదికను పదేళ్లయినా అధికారికంగా ఎందుకు ప్రకటించలేదని సీఎం రేవంత్ ప్రశ్నించారు. అటెండర్లు, చప్రాసీలు, డ్రైవర్లతో ఆ సర్వే చేయించారని, వారి వివరాలు కూడా ఇంతవరకు తెలియదని అన్నారు. ప్రజల వ్యక్తిగత వివరాలన్నీ సేకరించి లాకర్లో పెట్టుకున్నారని, ఆ తర్వాత జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఆ డేటాను వినియోగించుకున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వం సేకరించిన అధికారిక సమాచారాన్ని మాత్రం ప్రతిపక్షాలు తప్పుపడుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వంపై నమ్మకం లేదంటున్నవారు, సర్వేలో పాల్గొనని వారు ఈ సభకు ఎందుకు వచ్చినట్లని ప్రశ్నించారు. సర్వేలో పాల్గొనని వారికి సభలో మాట్లాడే అర్హత లేదన్నారు. వారు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వద్దని, వారికి మైక్ ఇవ్వద్దని స్పీకర్‌ను కోరారు. "గత ప్రభుత్వం కేవలం సెల్ఫీలు, సెల్ఫ్ డబ్బాల కోసమే తాపత్రయ పడింది. సీఎం జుట్టు నచ్చలేదు.. ముక్కు నచ్చలేదు అని సర్వేలో పాల్గొనకుంటే ఎలా.? సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ప్రజలకు చెప్పకుండా.. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్ కోసం పంపారు. ఏం పొడిచారని రికార్డు కోసం దరఖాస్తు చేశారు?" అని సీఎం మండిపడ్డారు.

బీసీలు 46.25%

ముస్లింలలో బీసీలు 10.08%.. వారిని కలుపుకొంటే మొత్తం బీసీలు 56.33%


ఎస్సీలు 17.43%, ఎస్టీలు 10.45%, ఓసీలు 13.31%

ముస్లిం ఓసీలు 2.48%, మొత్తం 15.79%

మొత్తం 3,54,77,554 మంది సర్వే.. శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి

రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు (బీసీ) చెందినవారు 1,64,09,179 మంది ఉన్నారని, ఇది రాష్ట్ర జనాభాలో 46.25 శాతమని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ముస్లింలలో బీసీలు 35,76,588 మంది ఉన్నారని, ఇది మొత్తం జనాభాలో 10.08 శాతమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నవంబరు 6వ తేదీ నుంచి డిసెంబరు 25వ తేదీ వరకు 50 రోజుల పాటు నిర్వహించిన 'సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల (సమగ్ర ఇంటింటి) సర్వే'లో ఈ వివరాలు వెల్లడయ్యాయని పేర్కొన్నారు. సమగ్ర ఇంటింటి సర్వేపై మంగళవారం శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారు. సర్వే ద్వారా సేకరించిన వివరాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర బలహీన వర్గాల సంక్షేమానికి అవసరమైన విధానాల రూపకల్పన కోసం ప్రభుత్వం ఉపయోగిస్తుందని సీఎం రేవంత్ తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్



ముస్లింలలో 10.08% బీసీలు, 2.48% ఓసీలు ఉన్నారు.

సర్వేలో పాల్గొన్న వారి సంఖ్య

3,54,77,554

బీసీలు	1,64,09,179
ఎస్సీలు	61,84,319
ఎస్టీలు	37,05,929
ఓసీలు	47,21,115
ముస్లింలు	44,57,012

ముస్లింలలో బీసీలు 35,76,588, ఓసీలు 8,80,424 ఉన్నారు.

ముస్లింలలో ఉన్న బీసీలను కూడా కలుపుకుంటే రాష్ట్రంలో మొత్తం బీసీల సంఖ్య 1,99,85,767 (56.33%)

ఓసీలలో ఉన్న ముస్లింలను కూడా కలుపుకొంటే మొత్తం ఓసీలు 56,01,539 (15.79%)

బీసీల జనాభా తగ్గినట్లు చూపిస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)



ప్రశ్నించారు. తప్పుల తడక సర్వేతో బీసీలకు రిజర్వేషన్లు దక్కకుండా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. బీసీ జనాభాను తగ్గినట్లు చూపిన వారిపై చర్యలు తీసుకోరా అని ప్రశ్నించారు. మంగళవారం కులగణనపై అసెంబ్లీలో జరిగిన చర్చలో శంకర్ మాట్లాడారు. 'సమగ్ర కుటుంబ సర్వేలో తేలిన బీసీ కులాల శాతం కంటే ఈ కులగణనలో శాతం ఎందుకు తగ్గింది? సమగ్ర కుటుంబ సర్వే ఎక్కడుందని సీఎం అడుగుతున్నారు? అది మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ వెబ్‌సైట్‌లోనే ఉందని, ఆ సంస్థ ప్రైవేటుదేమీ కాదని చెప్పారు. కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ చేసేప్పుడు చట్ట సవరణ కావాలని కాంగ్రెస్ పార్టీకి తెలియదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇస్తామన్నారని, సీఎం కాక ముందు రేవంత్ రెడ్డికి చట్టాలపై అవగాహన లేదా అని అడిగారు. పార్టీపరంగా బీసీలకు 42 శాతం ఇస్తామని రేవంత్ అంటున్నారని, కానీ కాంగ్రెస్ నిబద్ధత ఏమిటో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయే సీట్లు బీసీలకు ఇచ్చారని ఆరోపించారు. మొత్తం 119 స్థానాల్లో 27 స్థానాలు బీసీలకు ఇచ్చామని చెప్పారని, కానీ అందులో 5 సీట్లు పాత బస్తీలోవేనని పేర్కొన్నారు. ఆ 5 సీట్లలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి నిలబడినా గెలవరని అన్నారు. సమాజంలో ఉన్న చిట్టచివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ ఫలాలు అందాలన్నదే బీజేపీ ఆలోచన అని చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు.

నాటి మా సర్వే అధికారికమే

(మొదటిపేజీ తరువాయి)



చెప్పారని గుర్తుచేశారు. "నిజానికి ఈ రోజు సభను నిర్వహిస్తే.. బీసీలకు 42% చట్టబద్ధ కోటాకు ప్రత్యేక బిల్లు పెడతారని ఆశించాను" అని వ్యాఖ్యానించారు. గతంలో తాము నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 57 రకాల వివరాలను ఎందుకివ్వాలని, సర్వేను బహిష్కరించాలని అప్పట్లో రేవంత్‌రెడ్డి చెప్పలేదా? అని నిలదీశారు. ఎస్సీ వర్గీకరణకు తమ పార్టీ అనుకూలంగా ఉంటుందని కేటీఆర్ స్పష్టంచేశారు. వర్గీకరణపై పోరాటం చేసిన మందకృష్ణను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవడం సముచితంగా ఉంటుందన్నారు. ఉద్యమంలో అమరులను స్మరించుకోవాల్సిన అవసరముందన్నారు. "మా హయాంలో సభలో ఎస్సీ వర్గీకరణపై తీర్మానం చేశాం. అప్పటి సీఎం కేసీఆర్ స్వయంగా ప్రధాని మోదీకి నివేదికను అందజేశారు. సామాజిక స్వేచ్ఛ లేకపోతే.. చట్టం ద్వారా సంక్రమించే ఏ హక్కు అయినా నిరర్థకమని అంబేడ్కర్ చెప్పారు. అందుకే మేం సుప్రీంకోర్టులో పెద్ద లాయర్లను పెట్టి, వాదనలను వినిపించాం. దళిత పారిశ్రామికవేత్తల కోసం మేం డిక్కీ అనే సంస్థను ఏర్పాటు చేశాం. దళిత బంధును అమలు చేసి, రూ.10 లక్షలు ఇచ్చాం" అని గుర్తుచేశారు. కాంగ్రెస్ చేసిన చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్‌ను, అంబేడ్కర్ అభయ హస్తం పేరుతో రూ.12 లక్షల ఆర్థిక సాయం చేస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో భాగంగా ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీలకు 18%, ఎస్టీలకు 12% ఇస్తామన్న హామీని ఎప్పుడు నెరవేరుస్తారని నిలదీశారు. బీసీల ఆవేదనపై మాట్లాడుదామంటే.. చర్చించే అవకాశం లేకుండా పోయిందని, బయట బీసీలు గగ్గోలు పెడుతున్నారని, బీసీ సంఘాలు, కాంగ్రెస్ ఎమ్మెల్సీలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారని కేటీఆర్ వివరించారు. మరోవైపు.. శాసనసభను ప్రారంభమైన నిమిషంలోనే వాయిదా వేయడాన్ని ఖండిస్తున్నామని మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇలా సభ మొదలైన వెంటనే వాయిదా పడిన దాఖలాలు లేవన్నారు. అసెంబ్లీ నిర్వహణకు ముందురోజు క్యాబినెట్ సమావేశాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని నిలదీశారు. బీసీలకు అన్యాయం చేసే ప్రయత్నంలో కాంగ్రెస్ ఉందని, దీన్ని నిరసిస్తూ తెలంగాణ పోరుకంటే తీవ్రస్థాయిలో బీసీల ఉద్యమం రానుందని జోస్యం చెప్పారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తుంగలో తొక్కారని, బీసీలను నిలువునా మోసం చేసిన ఆయన్ను తెలంగాణలో తిరగనీయమని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ హెచ్చరించారు.

బీసీలు తగ్గారు.. ఓసీలు పెరిగారు: తలసాని


బీసీలకు 42% రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాకే.. స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం అసెంబ్లీలో కులగణనపై సీఎం రేవంత్ ప్రకటన తర్వాత తలసాని మాట్లాడారు. కులగణన సర్వేలో లోపాలున్నాయని, మళ్లీ సర్వే చేయాలని సూచించారు. సర్వేలో 57 అంశాలను పొందుపర్చడం వల్ల చాలా మంది వివరాలు చెప్పలేదని, జీహెచ్ఎంసీ పరిధిలో 30% మంది మాత్రమే సర్వేలో పాల్గొన్నారనే సమాచారం తనకుందన్నారు. కులగణన సర్వేలో బీసీలు, ఎస్సీలు, ముస్లింలు తగ్గినట్లుగా.. ఓసీలు పెరిగినట్లు చూపించారనే చర్చ జరుగుతోందన్నారు.

మండలిలో బీఆర్ఎస్ వాకౌట్

బీసీ రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించి, కులగణన నివేదికతో సరిపెట్టి.. వెనకబడిన వర్గాల ఆశలను అడియాసలు చేసే ప్రయత్నంలో కాంగ్రెస్ సర్కారు ఉందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం శాసనమండలి నుంచి వాకౌట్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. మండలిలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో 'సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే-2024'పై ప్రకటన చేయించిందని ఆరోపించారు. సభలో ఆ నివేదికపై వివరణలకు అవకాశం ఇస్తున్నట్లు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పగా.. బీఆర్ఎస్ పక్ష నాయకుడు మధుసూదనాచారి మాట్లాడారు. సర్వే నివేదికలో శాస్త్రీయత లోపించిందని, బీసీల జనాభా లెక్కలు తప్పుల తడకగా ఉన్నాయని ఆరోపించారు. సర్వేను మరోమారు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా రిజర్వేషన్లు పెరుగుతాయనే బీసీల ఆశలపై నీళ్లు చల్లారని.. నివేదిక మాత్రమే ప్రవేశపెట్టారని ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ ఆరోపించారు. జాతీయ స్థాయిలో కులగణన నిర్వహించాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండలిలో తీర్మానం ప్రవేశపెడుతుండగా.. బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలుపుతూ.. వాకౌట్ చేశారు. అంతకు ముందు చైర్మన్ పోడియం వైపు దూసుకెళ్లి.. కొంతసేపు నిరసన వ్యక్తం చేశారు.

సుప్రీం తీర్పిచ్చిన గంటన్నరలోనే సీఎం స్పందించారు

అదీ దళితుల పట్ల రేవంత్‌కున్న చిత్తశుద్ధి: దామోదర



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన గంటన్నర వ్యవధిలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. దళితుల అభివృద్ధి పట్ల సీఎం చిత్తశుద్ధికి, కాంగ్రెస్ ప్రభుత్వ నిబద్ధతకు అదే నిదర్శనమని అన్నారు. ఎస్సీ వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ ఇచ్చిన నివేదికపై శాసనసభలో చర్చ సందర్భంగా మంగళవారం రాజనర్సింహ మాట్లాడారు. చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 2024 ఆగస్టులో సుప్రీం తీర్పు వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో ప్రకటన చేశారని గుర్తుచేశారు. 59 కులాలను మూడు కేటగిరీలుగా వర్గీకరణ చేయాలని కమిషన్ ప్రతిపాదించిందన్నారు. రేవంత్‌రెడ్డి అణగారిన వర్గాలకు జాతిపిత అని, ఈ నిర్ణయంతో చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. సమాజంలో ఆత్మగౌరవంతో బతకాలంటే విద్య, ఉపాధితో పాటు ఆర్థిక సాధికారత ఉండాలని.. అందుకు అవసరమైన సదుపాయాలు కల్పించినప్పుడే ఆయా జాతులకు చెందిన పిల్లలు కూడా ఆత్మగౌరవంతో ఎదుగుతారని చెప్పారు.

మద్దతు ఇస్తున్నారో లేదో చెప్పలేదు: దుద్దిళ్ల



ఎస్సీ వర్గీకరణకు మద్దతిస్తున్నారా? వ్యతిరేకిస్తున్నారా? అనేది చెప్పకుండా బీఆర్ఎస్ వాళ్లు వాకౌట్ చేయడం మంచి సంప్రదాయం కాదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న అక్కసుతోనే వారు బయటికెళ్లిపోయారని ఆరోపించారు. దళితులకు సంబంధించి రాబోయే కాలంలో ఆర్థిక, సామాజిక, విద్య పరంగా ఏం చేస్తే బాగుంటుందో కేటీఆర్ ఆలోచన చేస్తారని భావించామన్నారు.

కేసీఆర్ రాకపోవడమే మంచిది: కోమటిరెడ్డి



పేద ప్రజలు బాగుపడడం ఇష్టం లేకనే శాసనసభను బీఆర్ఎస్ బహిష్కరించిందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. వర్గీకరణతో పాటు కీలకమైన బీసీ కులగణనపై చర్చ జరుగుతుంటే కేసీఆర్ సభకు రాలేదని విమర్శించారు. ఆయన రాజీనామా చేసి, సభకు రాకుండా ఉండడమే మంచిదన్నారు. తెలంగాణ వస్తే దళితుడ్ని ముఖ్యమంత్రిని చేస్తామని, బీసీ బంధు అమలు చేస్తామని కేసీఆర్ రకరకాలుగా మోసం చేశారని ఆరోపించారు. తాము ఇచ్చిన మాట ప్రకారం కులగణన చేశామని, ఎస్సీ వర్గీకరణ అమలు చేయనున్నామని చెప్పారు.

తొలిసారి మద్దతిచ్చింది చంద్రబాబే: అక్బర్

ఎస్సీ వర్గీకరణ మూడు దశాబ్దాలుగా జరుగుతున్న ఉద్యమమని, తొలుత చంద్రబాబు నాయుడు ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశారని మజ్లిస్ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. కమిషన్ 1997లో నివేదిక ఇవ్వగా చంద్రబాబు వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారని, దీన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో కేసు నడిచిందని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత తెలంగాణ ప్రభుత్వం నియమించిన జస్టిస్ అక్తర్ కమిషన్ 3 కీలక సిఫారసులు చేసిందన్నారు. కమిషన్ నివేదికను సభలో ఎందుకు పెట్టలేదో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరారు. క్రీమీలేయర్ నిర్ణయాన్ని ప్రభుత్వం ఎందుకు తిరస్కరించిదో స్పష్టం చేయాలన్నారు.

క్రిమీలేయర్ సిఫారసును అమలు చేస్తే బాగుండేది: కూనంనేని

రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ అమలుకు ముందుకు రావడం అభినందనీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇక వారి సమస్యలు శాశ్వతంగా పరిష్కారమైనట్లు భావిస్తున్నానని చెప్పారు. మాలలు, మాదిగలు ఐక్యంగా ఉండాలని సూచించారు. బీసీలకు కూడా సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఎస్సీ, ఎస్టీల సాధికారతకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. క్రీమీలేయర్‌పై కమిషన్ సిఫారసు వాస్తవం అన్నారు. దాన్ని ప్రభుత్వం ఎందుకు తిరస్కరించిందో అర్థం కాలేదని, భవిష్యత్తులో అయినా దీన్ని అమలు చేయాలని కోరారు. సీపీఐ దీనికి మద్దతు ఇస్తుందన్నారు.

రేవంత్‌రెడ్డికి మాదిగ జాతి రుణ పడి ఉంటుంది: కడియం శ్రీహరి

సీఎం రేవంత్‌రెడ్డికి మాదిగ జాతి రుణ పడి ఉంటుందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. దళిత జాతికి మేలు చేస్తున్న ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. 1994లో ప్రకాశం జిల్లా ఈదుమూడిలో ఎస్సీ వర్గీకరణ కోసం తొలి సమావేశం జరిగిందని, 30 ఏళ్ల పాటు ఎమ్మార్పీఎస్ నాయకత్వంలో దండోరా ఉద్యమం జరిగిందని గుర్తుచేశారు. ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న మందకృష్ణ మాదిగను అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే సభలో సభ్యుడిగా ఉన్నందుకు గర్వపడుతున్నానని చెప్పారు. మాదిగ, మాదిగ ఉపకులాలకు వెంటనే వర్గీకరణ ఫలాలు అందించాలని కోరారు. రిజర్వేషన్లలో క్రీమీలేయర్ ఉండాలని సీపీఐ కోరడాన్ని తప్పుపట్టారు.

చంద్రచూడ్ పీష్వా కావడం వల్లే ఆ తీర్పు: వివేక్

ఎస్సీలను విభజించు, పాలించు విధానం అమలులో ఉందంటూ భీమా-కోరేగావ్‌లో పీష్వాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని ఎమ్మెల్యే వివేక్ అన్నారు. జస్టిస్ డీవై చంద్రచూడ్ కూడా పీష్వా అని, ఎస్సీలను విభజించే రీతిలో తీర్పు ఇచ్చారని చెప్పారు. మాలల్లో ఎస్సీ వర్గీకరణపై ఆందోళన ఉందని, సరైన లెక్కల తర్వాతే దీన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మాదిగ జాతికి బీఆర్ఎస్ అన్యాయం చేసింది: లక్ష్మణ్‌కుమార్

మాదిగ జాతికి బీఆర్ఎస్ అన్యాయం చేసిందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. వర్గీకరణపై నిర్ణయం తీసుకోవడం ద్వారా ఈ రోజు ఒక పర్వదినమని చెప్పారు. జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందించాలని కోరారు. హైదరాబాద్ సంస్థానంలో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు ఉద్యమం, 30 ఏళ్లుగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ పోరాటం చరిత్రలో నిలిచిపోతాయని ఎమ్మెల్యే సామేలు అన్నారు.

3% ఉన్న మాలలకు 5% రిజర్వేషన్లు తగదు

» మాదిగ హక్కుల దండోరా అధ్యక్షుడు కొంగర శంకర్

ఎస్సీ వర్గీకరణ కోసం ఏకసభ్య కమిషన్ అందించిన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి, ఆమోదించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాదిగ హక్కుల దండోరా అధ్యక్షులు కొంగరి శంకర్‌మాదిగ ధన్యవాదాలు తెలిపారు. నివేదికను సవరించాల్సి ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించగా తెలంగాణలో మాదిగ జనాభా 9.9శాతం ఉందని తేలిందని, ఇప్పుడు దాదాపు 10 శాతం ఉన్నారని తెలిపారు. అయినా మాదిగలకు 9శాతాన్ని కేటాయించడం అన్యాయమని అన్నారు. కేవలం 3శాతం ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్ కేటాయించడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. మాదిగలకు 11శాతం రిజర్వేషన్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

వర్గీకరణకు సై

(మొదటిపేజీ తరువాయి)

ఖరారు చేయడంలో దేశంలోనే మొట్టమొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కమిషన్ సిఫారసు చేసినా.. వర్గీకరణలో క్రీమీలేయర్ విధానాన్ని అమలు చేయడం లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు గత ఏడాది ఆగస్టు ఒకటో తేదీన ఇచ్చిన తీర్పుపై స్పందించిన తెలంగాణ ప్రభుత్వం.. వర్గీకరణకు కట్టుబడి ఉన్నట్లు అదే రోజు ప్రకటించిన విషయం తెలిసిందే. ఎస్సీ వర్గీకరణ అమలుకు తొలుత గత ఏడాది సెప్టెంబరు 12న నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో మంత్రులు దామోదర్ రాజ నరసింహ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ మల్లు రవి సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. అనంతరం అక్టోబరు 11న రిటైర్డ్ జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ జీవో నంబర్ 8ని విడుదల చేసింది. వర్గీకరణపై సమగ్రంగా అధ్యయనం చేసిన కమిషన్.. 2011 జనాభా లెక్కల ప్రకారమే వర్గీకరణ ప్రక్రియను నిర్వహించింది. ఫిబ్రవరి మూడో తేదీన మంత్రివర్గ ఉప సంఘానికి తన నివేదికను అందించింది.

కమిషన్ చెప్పిందే చేద్దాం..

ఎస్సీ ఉప కులాల్లో ఎవరిని ఏ గ్రూపులో చేర్చాలన్న అంశంపై సొంత నిర్ణయం వద్దని, ఏకసభ్య కమిషన్ సిఫార్సు చేసిన దానికే కట్టుబడి ఉందామని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. అసెంబ్లీ ప్రత్యేక సమావేశానికి ముందు మంగళవారం కమిటీ హాల్లో క్యాబినెట్ సమావేశమైంది. జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికను అందులో ప్రవేశపెట్టారు. అనంతరం దానిపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. మొదటి గ్రూప్‌లో 15 కులాలను, రెండో గ్రూప్‌లో 18, మూడో గ్రూప్‌లో 26 కులాలను చేర్చాలని కమిషన్ సిఫార్సు చేసింది. వీటిలో ఏ కులాన్నైనా ఒక గ్రూపు నుంచి మరో గ్రూపునకు మార్చాలా? అన్న దానిపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. అయితే, ఈ అంశంలో వేలు పెట్టకూడదని, ఏకసభ్య కమిషన్ సిఫార్సుకే కట్టుబడి ఉండాలని చివరకు నిర్ణయించింది.

మూడు గ్రూపులు..

క్యాబినెట్ ఆమోదం తర్వాత జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికను మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించారు. నివేదికలోని సిఫారసుల ప్రకారం ఎస్సీలను మూడు గ్రూపులుగా వర్గీకరిస్తున్నట్లు అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించింది. ఆయా వర్గాలు, జనాభా, సామాజిక, ఆర్థిక, విద్య తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని మొత్తం 59 కులాలను వర్గీకరించినట్లు తెలిపింది. దాని ప్రకారం.. అత్యంత వెనకబడిన 15 కులాలను గ్రూప్-1గా పేర్కొంది. ఎస్సీల్లో వారి జనాభా 3.288 శాతం. వీరికి 1 శాతం రిజర్వేషన్ కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. ఇక, మాదిగ, 18 ఉప కులాలను గ్రూప్-2గా పేర్కొంది. వాటి జనాభాను 62.748 శాతంగా పేర్కొంది. ఈ కులాల్లో ఒక్క మాదిగల జనాభా శాతమే 61.967 శాతం (32,33,642)గా పేర్కొంది. ఈ గ్రూపులోని మాదిగ, ఉప కులాలకు 9 శాతం రిజర్వేషన్‌ను ఖరారు చేసింది. ఇక, మాల, 26 ఉప కులాలను కలిపి గ్రూప్-3గా వర్గీకరించింది. ఎస్సీల్లో వారి జనాభాను 33.963 శాతంగా పేర్కొంది. వీరిలోనూ ఒక్క మాలల జనాభానే 29.265 శాతం (15,27,143)గా వివరించింది. మాల, ఇతర ఉప కులాలకు కలిపి 5 శాతం రిజర్వేషన్‌ను కేటాయించింది.

క్రీమీలేయర్‌కు నో

ఎస్సీ వర్గీకరణలో భాగంగా రిజర్వేషన్‌తోపాటు క్రీమీలేయర్ విధానాన్ని కూడా అమలు చేయాలని ఏక సభ్య కమిషన్ సిఫారసు చేసింది. దీనితో కలిపి మొత్తం నాలుగు సిఫారసులు చేసింది. వీటిలో క్రీమీలేయర్ మినహా మిగిలిన మూడు సిఫారసులను ప్రభుత్వం ఆమోదించింది. క్రీమీలేయర్ సిఫారసును ప్రభుత్వం తిరస్కరించింది. క్రీమీలేయర్ అంటే ఇప్పటికే వివిధ రంగాలు, వివిధ రూపాల్లో రిజర్వేషన్ల లబ్ధి పొందిన వారి రెండో తరానికి ఆ ప్రయోజనాన్ని మినహాయించడం. దీని ప్రకారం.. ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీ ఛైర్‌పర్సన్లు, మేయర్లు సహా ప్రజా ప్రతినిధులతోపాటు గ్రూప్-1 సర్వీసుల్లో ఉన్న వారిని క్రీమీలేయర్‌గా పరిగణించాలని సూచించింది. ఈ వ్యక్తుల రెండో తరం రిజర్వేషన్ల ప్రయోజనం పొందకుండా మినహాయించాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. దీనిని ప్రభుత్వం తిరస్కరించింది. ఇక, నివేదికలోని రెండో సిఫారసు.. ఉద్యోగ ఖాళీల భర్తీల్లో ప్రాధాన్య క్రమాన్ని పాటించడం. దీని ప్రకారం.. ఉద్యోగ ఖాళీల భర్తీ క్రమంలో గ్రూప్-ఐలో గుర్తించిన కులాలతో ఆ ఖాళీలు భర్తీకాకపోతే.. వాటిని తదుపరి ప్రాధాన్య గ్రూప్ అయిన రెండో గ్రూప్‌లోని కులాల ద్వారా భర్తీ చేయాలి. అప్పటికీ ఆ పోస్టులు భర్తీ కాకపోతే.. ఆ తర్వాత ఉన్న గ్రూప్-3లోని కులాల ద్వారా భర్తీ చేయాలని సిఫారసు చేసింది. ఒకవేళ, మూడు గ్రూపుల్లో తగిన అభ్యర్థులు లేకపోతే వాటిని క్యారీ ఫార్వర్డ్ చేయాలని పేర్కొంది. మూడో సిఫారసు కింద.. ఈ మూడు గ్రూపుల వారికీ రోస్టర్‌లను సూచించింది. దాని ప్రకారం గ్రూప్-1కు 7 రోస్టర్ పాయింట్లు, గ్రూప్-2లో ఉన్నవారికి 2, 16, 27, 47, 52, 66, 72, 87, 97 పాయింట్లను, గ్రూప్-3లో ఉన్న వారికి 22, 41, 62, 77, 91 చొప్పున రోస్టర్ పాయింట్లను ప్రతిపాదించింది.



వర్గీకరణ నివేదికపై గాంధీభవన్‌లో జరిగిన సంబరాల్లో పాల్గొన్న సంపత్‌కుమార్

రిటైర్డ్ జస్టిస్ డాక్టర్ షమీమ్‌అక్తర్ కమిషన్ చేసిన సిఫారసులు

కేటగిరి	గ్రూప్ పేరు	కులాల సంఖ్య	జనాభా % (2011 లెక్కల ప్రకారం)	సిఫారసు చేసిన రిజర్వేషన్%
గ్రూప్-1	సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, అత్యంత వెనుకబడిన, పట్టించుకోని షెడ్యూలు కులాలు	15	3.288	1
గ్రూప్-2	మధ్యస్థంగా లబ్ధిపొందిన షెడ్యూలు కులాలు	18	62.748	9
గ్రూప్-3	మెరుగైన ప్రయోజనం పొందిన షెడ్యూలు కులాలు	26	33.963	5
మొత్తం		59	100	15

నో కామెంట్

నివేదికపై ఇప్పుడేమీ మాట్లాడను 'ఆంధ్రజ్యోతి'తో మంద కృష్ణ మాదిగ

"రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ నివేదికపై ఇప్పుడేమీ మాట్లాడను" అని ఎమ్మార్పీయస్ అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ నివేదిక, కులాల వారీ రిజర్వేషన్లపై కృష్ణ మాదిగ అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. ఈ విషయమై ఇప్పుడేమీ మాట్లాడనంటూ.. 'నో కామెంట్' అన్నారు. సమగ్ర సమాచారంతో అన్ని వివరాలను బుధవారం వెల్లడిస్తానని చెప్పారు. ఆయన బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించనున్నారు.

వారం, పది రోజుల్లో గెజిట్ నోటిఫికేషన్

రిజర్వేషన్లలో ఎస్సీ వర్గీకరణ అమలుకు ప్రభుత్వం త్వరలోనే గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. ఎస్సీ ఉప కులాలను మూడు భాగాలుగా వర్గీకరిస్తూ రాష్ట్ర శాసన సభ, మండలి మంగళవారం ఆమోదించిన తీర్మానం ఆధారంగా దీనిని విడుదల చేయనుంది. వర్గీకరణ అమలుకు మార్గదర్శకాల రూపకల్పనపై కసరత్తు చేస్తున్న ప్రభుత్వం.. అది పూర్తయిన వెంటనే గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. ఈ ప్రక్రియకు వారం, పది రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఆ తర్వాత.. ఉద్యోగ నోటిఫికేషన్ల విడుదలకూ కసరత్తు జరుగుతోంది. ఈ కసరత్తు పూర్తై నోటిఫికేషన్లు విడుదలైతే.. పాతికేళ్ల తర్వాత రిజర్వేషన్లలో ఎస్సీ వర్గీకరణ అమలవుతున్న ఉద్యోగాలు ఇవే కానున్నాయి.

రిజర్వేషన్ల వర్గీకరణ, గ్రూపులు, కులాల వారీగా

గ్రూప్ - 1

వ. సం.	కులం పేరు	జనాభా	మొత్తం ఎస్సీ జనాభాలో %
1	బాపురి	127	0.002
2	బేడా (బుడ్గ) జంగం	1,11710	2.141
3	చచాటి	125	0.002
4	డక్కల్, డొక్కాల్వార్	2558	0.049
5	జగ్గలి	2575	0.049
6	కొలుపులవాండ్లు, పంబాల పంబాడ,పంబండి,	931	0.018
7	మాంగ్	13260	0.254
8	మాంగ్,గరోడి	1392	0.027
9	మన్నె	29656	0.568
10	మష్తీ	1246	0.024
11	మాతంగి	704	0.013
12	మెహతర్	6973	0.0134
13	మండాల	212	0.004
14	సంబన్	108	0.002
15	సప్రు	44	0.001
మొత్తం		1,71,625	3.288

గ్రూప్ -2

వ. సం.	కులం పేరు	జనాభా	మొత్తం ఎస్సీ జనాభాలో %
1	అరుంధతీయ	107	0.002
2	బైండ్ల	13082	0.251
3	చమార్, మోచీ, ముచి, చమర్-రవిదాస్, చమర్-రోహిదాస్	17068	0.327
4	చంబార్	632	0.012
5	చండాల	64	0.001
6	దండాసి	86	0.002
7	డోమ్, డోంబర, పైడి, పానో	1926	0.037
8	ఎల్లమ్మల్వార్, ఎల్లమ్మలవాండ్లు,	504	0.010
9	గోడారి	208	0.004
10	జాంబవులు	108	0.002
11	మాదిగ	32,33,642	61.967
12	మాదిగదాసు, మష్టీన్	1663	0.032
13	పామిడి	51	0.001
14	పంచమ,పరియ	63	0.001
15	సమగర	1046	0.020
16	సింధోళ్లు(చిందోళ్లు)	3872	0.074
17	యాటల	163	0.003
18	వల్లువన్	92	0.002.
మొత్తం		32,74,377	62.748

గ్రూప్ -3

వ. సం.	కులం పేరు	జనాభా	మొత్తం ఎస్సీ జనాభాలో %
1	ఆది ఆంధ్ర	2289	0.044
2	ఆదిద్రావిడ	651	0.012
3	అనాముక	17	0.003
4	అరెమాల	1992	0.038
5	అర్వమాల	8398	0.161
6	బారికి	83	0.002
7	బ్యాగర, బ్యాగరి	9672	0.185
8	చలవాడి	160	0.003
9	ఢోర్	2146	0.041
10	ఘాసి, హడ్డి, రెల్లి, చాచండి	84	0.002
11	గోసంగి	23251	0.447
12	హోలెయా	358	0.007
13	హోలెయ దాసరి	8482	0.163
14	మాదాసికురవ, మాదారి కురవ	3707	0.071
15	మహర్	31938	0.612
16	మాల,మాలఅయ్యవార్	1527143	29.265
17	మాలదాసరి	6630	0.139
18	మాలదాసు	925	0.018
19	మాలహన్నాయ్	37	0.001
20	మాలజంగం	3187	0.061
21	మాలమస్తీ	108	0.002
22	మాలసాలే,నేతకాని	133072	2.550
23	మాలసన్యాసి	162	0.003
24	మితఅయ్యల్వార్	3118	0.060
25	సాకీ,మోటి, తోటీ	947	0.018
26	రెల్లి	3025	0.058
మొత్తం		17,71,682	33.96

గాంధీ భవన్‌లో సంబరాలు

పాల్గొన్న మహేశ్ గౌడ్, సంపత్‌కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ తీర్మానం ఆమోదం పొందుతున్న సమయంలో గాంధీ భవన్‌లో మంగళవారం పెద్ద ఎత్తున సంబరాలు జరిగాయి. ఏఐసీసీ కార్యదర్శి సంపత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాల్లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రీతమ్, మాజీ మంత్రులు చంద్రశేఖర్, పుష్పలీల తదితరులు పాల్గొన్నారు. బాణసంచా కాల్చి, సీట్లు పంచుకున్నారు. డప్పు వాయిద్యాలతో గాంధీభవన్ దద్దరిల్లింది. ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ, కులగణన కాంగ్రెస్ మార్కు విజయాలన్నారు. ఎస్సీలు, బీసీల కోసం పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో కేటీఆర్, హరీశ్ రావు సమాధానం చెప్పాలన్నారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయం పార్టీ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. కాగా, కులగణన సర్వే నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టిన నేపథ్యంలో పార్టీ బీసీ నేతలూ గాంధీ భవన్‌లో సంబరాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

పూర్తి నివేదిక వెల్లడి ఎప్పుడు?

ఆసక్తిగా ఎదురుచూస్తున్న పార్టీలు.. ప్రజలు

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో మంగళవారం ప్రవేశపెట్టిన సమగ్ర కులగణన నివేదికలోని పూర్తి వివరాలు ఎప్పుడు తెలుస్తాయా అని రాజకీయ పార్టీలు, ప్రజలు ఎదురుచూస్తున్నారు. కులగణన నివేదికలో రాష్ట్రంలో ఉన్న కులాలు, వాటి జనాభా, శాతం వివరాలను మాత్రమే ప్రభుత్వం వెల్లడించింది. ఏ కులం వారికి ఎంతమేర అవకాశాలు దక్కాయనే వివరాలను బయటపెట్టలేదు. అయితే కులాల వారీ లెక్కలను కూడా అవసరమైతే బయటపెడతామంటూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో అన్నారు. ఆ నివేదిక కూడా బయటకు వస్తే రాష్ట్రంలో ఉన్న అన్ని కులాల్లోని వారికి ఎవరెవరికి ఎంతమేర ఉద్యోగాలు సహా వివిధ అంశాల్లో లబ్ధి జరిగిందన్నది తెలియనుంది. కాగా బిహార్ రాష్ట్ర ప్రభుత్వం కూడా కులగణన చేపట్టింది. ఆ తరువాత పూర్తి నివేదికను బహిర్గతం చేసింది. తొలుత మొత్తం జనాభా వారీగా, బీసీల వివరాలను వెల్లడించింది. ఆ తరువాత పూర్తి నివేదికను ప్రజల ముందు ఉంచింది. ఈ క్రమంలోనే తెలంగాణలోనూ పూర్తి నివేదికను ప్రజల ముందు ఉంచితే అన్ని వివరాలపై స్పష్టత వస్తుందనే చర్చ జరుగుతుంది. రాష్ట్రంలో బీసీల్లోనూ ఏ, బీ, సీ, డీ, ఈలుగా పలు కేటగిరీలున్నాయి. వీటిల్లో ఎవరు ఎక్కువ జనాభా కలిగి ఉన్నారు, ఏ కులం వారు ఎంతమంది ఉన్నారనే వివరాలు నివేదిక బహిర్గతమైతే తేలనున్నాయి. అందులోని అన్ని వివరాలను ప్రభుత్వం బయటపెట్టకపోవడంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

వర్గీకరణలో దేశంలో మేమే ముందు

సుప్రీంకోర్టు తీర్పునాడే మాటిచ్చాం అమలు చేసి చూపిస్తున్నాం

» కమిషన్ చేసిన నాలుగు సిఫారసుల్లో మూడింటిని ఆమోదిస్తున్నాం

» క్రీమీ లేయర్‌ను తిరస్కరిస్తున్నాం

» అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేసే విషయంలో తమ ప్రభుత్వం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తీర్పు వచ్చినరోజే.. ఎస్సీ వర్గీకరణ అమలుకు తాము కట్టుబడి ఉన్నామని ప్రకటించామన్నారు. ఆ దిశగా డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ వేయడం, ఆ నివేదికను ఆమోదించడం ద్వారా ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై మంగళవారం అసెంబ్లీలో ప్రభుత్వం తరఫున సీఎం ప్రకటన చేశారు. షమీమ్ అక్తర్ కమిషన్ నాలుగు సిఫారసులు చేయగా.. అందులో మూడింటిని ఆమోదించామన్నారు. ఎస్సీల్లోని 59 కులాలను మూడు గ్రూపులుగా విభజించాలన్న సిఫారసునూ ఆమోదించినట్లు తెలిపారు. ఉద్యోగ ఖాళీలను క్రమబద్ధంగా, సమానంగా భర్తీ చేసేందుకు ప్రిఫరెన్షియల్ మోడల్, రోస్టర్ పాయింట్లకు సంబంధించి కమిషన్ ఇచ్చిన సిఫారసులకు అంగీకారం తెలిపామన్నారు. క్రీమీ లేయర్ ప్రవేశపెట్టాలన్న సిఫారసును మాత్రం తిరస్కరించామన్నారు. ఎస్సీ వర్గీకరణకు కమిషన్ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా తదుపరి చర్యలు చేపట్టేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు.

ఆత్మసంతృప్తి కలిగించిన రోజు..

తన 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఆత్మసంతృప్తినిచ్చిన రోజు ఇది అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రాజకీయ జీవితానికి పరిపూర్ణత వచ్చిందన్నారు. ఎవరికీ రాని అవకాశం తనకు వచ్చిందని, తన విషయంలో ఒక పేరా రాయాల్సి వస్తే.. 4 ఫిబ్రవరి 2025 గురించి రాయాలని వ్యాఖ్యానించారు. ఆనాడు ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు తాను వాయిదా తీర్మానం ఇస్తే.. సభ నుంచి బయటకు పంపించారని, ఇప్పుడు సభా నాయకుడిగా వర్గీకరణ అమలుకు సభలో నిర్ణయం తీసుకుంటున్నానని చెప్పారు. ఇది అంబేద్కర్ అందించిన రాజ్యాంగం వల్లే సాధ్యమైందన్నారు. అంతకుముందు అసెంబ్లీ లాబీలో ముఖ్యమంత్రి మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. కులగణన, ఎస్సీ వర్గీకరణకు తెలంగాణ నుంచి రోడ్ మ్యాప్ ఇస్తున్నామని, ఇక్కడి కులగణన ఇతర రాష్ట్రాలకు రిఫరెన్సుగా మారుతుందని అన్నారు. తమ నిర్ణయంతో ప్రధానిపైనా ఒత్తిడి పెరుగుతుందన్నారు. ఇక పార్టీ మారిన ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు ఇవ్వడం ప్రొసీజర్‌లో భాగమని ఒక ప్రశ్నకు సమాధానంగా సీఎం చెప్పారు. ఉప ఎన్నికలు ఎందుకు వస్తాయని ప్రశ్నించారు. అసెంబ్లీకి రానివారు అసెంబ్లీ టైం గురించి మాట్లాడుతున్నారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌నుద్దేశించి విమర్శించారు. మరోవైపు తమ ప్రభుత్వం చేపట్టి.. పూర్తి చేసిన కులగణన రేపటి తరానికి ఆదర్శమని 'ఎక్స్' ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

సీఎంకు మంత్రులు, ఎమ్మెల్యేల అభినందనలు

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, కులగణనపై తీర్మానాలకు అసెంబ్లీలో ఆమోదం లభించిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు అభినందనలు తెలిపారు. అసెంబ్లీలోని సీఎం చాంబర్లో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛాలు సమర్పించారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్?

సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉంది. ఆయనతో పాటుగా ఒకరిద్దరు మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలూ వెళ్లేందుకు అవకాశం ఉంది. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణ తీర్మానాలు ఆమోదం పొందిన నేపథ్యంలోనే అధిష్ఠానం పెద్దలను కలిసేందుకు ఆయన ఢిల్లీ వెళ్లనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

బీఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీ: వీరేశం

బీఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీ అని, దళితుడ్ని సీఎం చేస్తామని చెప్పి మోసం చేసిన పార్టీ అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం దశాబ్దాలుగా మాదిగలు, మాదిగ ఉపకులాలు ఎదురు చూస్తున్నాయని చెప్పారు. తమ జాతి రేవంత్‌కురుణపడి ఉంటుందన్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు

- బీఆర్ఎస్ ఫిర్యాదుపై లిఖితపూర్వకంగా స్పందించాలని కోరిన స్పీకర్ కార్యాలయం
- 4 నెలల గడువు కోరిన పలువురు ఎమ్మెల్యేలు

హైదరాబాద్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తమ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ చేసిన ఫిర్యాదుపై లిఖితపూర్వకంగా స్పందించాలంటూ వారికి స్పీకర్ కార్యాలయం మంగళవారం నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో స్పందించింది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్ (ఖైరతాబాద్), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), తెల్లం వెంకట్రావు (భద్రాచలం), పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ), డాక్టర్ సంజయ్ (జగిత్యాల), గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు), ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి), కాలె యాదయ్య (చేవెళ్ల), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల)కి నోటీసులు ఇచ్చింది. అయితే నోటీసుల్లో ఫలానా తేదీలోగా సమాధానం ఇవ్వాలని పేర్కొనలేదు. నోటీసులు అందుకున్న ఎమ్మెల్యేల్లో దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు తదితరులు తమకు సమాధానం ఇవ్వడానికి 3 నుంచి 4 నెలల సమయం ఇవ్వాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి కోరారు.

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిపై కోడ్ కేసు కొట్టివేత

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి, వికారాబాద్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎ.సుధాకర్‌రెడ్డిలకు హైకోర్టులో ఊరట లభించింది. 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారంటూ నమోదైన కేసును కొట్టివేసింది. తమపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. దర్యాప్తు అధికారి సీఆర్పీసీలో పేర్కొన్న ప్రొసీజర్‌ను అనుసరించలేదని, చార్జిషీట్‌లో పిటిషనర్‌లకు సంబంధించిన ప్రస్తావన లేదని వ్యాఖ్యానించింది. కేసు కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

సర్కార్ నిర్లక్ష్యంతో రిటైర్డ్ ఉద్యోగులకు శాపం

- మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు

హైదరాబాద్, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వం ఇచ్చిన ఆరోగ్య భద్రత కార్డుతో చికిత్స చేయించుకుందామని ఆస్పత్రికి వెళ్తే చెల్లదు పొమ్మంటున్నారు. పోలీసు అధికారిగా పనిచేసిన ఠాగూర్ నారాయణ సింగ్ రెండు కిడ్నీలు చెడిపోయి తీవ్ర అనారోగ్య సమస్య, మరోవైపు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక ఆర్థిక సమస్యలు చుట్టుముట్టి ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్య ఒక్క ఉద్యోగిది కాదని.. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం రాష్ట్రంలోని 8వేలమంది రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు శాపంగా మారింది' అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. 30 ఏళ్లకుపైగా సేవలందించిన ఆయన దుర్భర పరిస్థితి ఎదుర్కోవడం తన హృదయాన్ని కలచివేసిందని మంగళవారం ఎక్స్‌లో ఆయన పేర్కొన్నారు.

రూ.3000 కోట్ల రుణం తీసుకున్న ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రూ.3000 కోట్ల అప్పు తీసుకున్నది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళవారం నిర్వహించిన ఈ-వేలం ద్వారా ఈ రుణాన్ని సేకరించింది. 7.19 శాతం వార్షిక వడ్డీ, 21 సంవత్సరాల కాల పరిమితితో రూ.1000 కోట్లు, 7.18 శాతం వార్షిక వడ్డీ, 22 ఏళ్ల కాల పరిమితితో రూ.1000 కోట్లు, 7.18 శాతం వార్షిక వడ్డీ, 24 ఏళ్ల కాల పరిమితితో రూ.1000 కోట్ల చొప్పున రుణం తీసుకున్నది. తెలంగాణతో కలిపి 13 రాష్ట్రాలు రూ.33,420 కోట్ల మేర రుణాలు తీసుకున్నాయి.


బంజారాహిల్స్‌లో మంత్రుల నివాసాల ముట్టడికి వచ్చిన వీఆర్ఏలు

వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలివ్వాలి

- మంత్రుల నివాసాల ముట్టడికి జేఏసీ యత్నం
- సచివాలయం ముట్టడికీ యత్నం, అరెస్టు

బంజారాహిల్స్, ఖైరతాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జీవో 81 ప్రకారం 61 సంవత్సరాలు పూర్తయిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని వీఆర్ఏల జేఏసీ డిమాండ్ చేసింది. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ జేఏసీ మంగళవారం బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాసాల ముట్టడికి పిలుపునిచ్చింది. పెద్దఎత్తున వీఆర్ఏలు హాజరై మంత్రుల నివాసాల ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ వీఆర్ఏలు 80 రోజుల పాటు పోరాటం చేయగా ప్రభుత్వం చర్చలు జరిపి వారసులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ వంగూరి రాములు, అధ్యక్షుడు బీసం ఆంజనేయులు, హరీశ్, శ్రీనివాస్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు. కాగా వీఆర్ఏలు సచివాలయం ముట్టడికీ యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు.

శాసనమండలిలో బీఆర్ఎస్ విప్‌లుగా సత్యవతిరాథోడ్, కేపీ వివేకానంద్

- ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీగా మళ్లీ సత్యవతి.?

మహబూబాబాద్, దుండిగల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసన మండలిలో బీఆర్ఎస్ పార్టీ విప్‌లుగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌లు నియమితులయ్యారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేసీఆర్ వారికి ఈ బాధ్యతలు అప్పగించారు. వారి నియామక పత్రాలను వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మంగళవారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ.. తనను విప్‌గా ప్రకటించి కేసీఆర్ తనపై మరింత బాధ్యత పెంచారన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కేసీఆర్, కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు పూర్తి నిబద్ధతతో బాధ్యతలు నిర్వర్తిస్తానని, ఈ అవకాశాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని, పార్టీ అభివృద్ధికి, ప్రజల ఆంకాక్షలు నెరవేర్చేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఇక మరోనెల రోజుల్లో సత్యవతి రాథోడ్ ఎమ్మెల్సీ పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో ఆమెను విప్‌గా ఎంపిక చేయడంతో ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా మళ్లీ ఆమెనే నియమించనున్నట్లు తెలుస్తోంది.

'పౌల్ట్రీ'పై వైరస్ దాడి



ఖమ్మం జిల్లాలో లక్షకుపైగా కోళ్లు మృతి.. అంతుపట్టని వైరస్‌తో ఫారాలు ఖాళీ

- లక్షల్లో నష్టపోతున్న యజమానులు
- పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు నమూనాలు

సత్తుపల్లి, బీర్కూర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అంతుపట్టని వైరస్ దెబ్బకు ఖమ్మం జిల్లాలో.. నాటు, బ్రాయిలర్ కోళ్లు పెద్ద సంఖ్యలో చనిపోతున్నాయి! ఉదయం ఒక్క కోడికి వైరస్ సోకిందంటే చాలు.. సాయంత్రానికి ఆ షెడ్డులో ఉన్న వేలాది కోళ్ల ప్రాణాలు కోల్పోతున్నాయి దీంతో ఫారాల యజమానులు ఈ సీజన్‌లో తీవ్రస్థాయిలో నష్టాలు చవిచూస్తున్నారు. ఖమ్మం జిల్లాలో సత్తుపల్లి నియోజకవర్గంలో డిసెంబరు నుంచి ఇప్పటి వరకు.. రెండు నెలల వ్యవధిలోనే లక్షకు పైగా కోళ్లు చనిపోయినట్లు చెబుతున్నారు. కోళ్లు పెద్ద సంఖ్యలో చనిపోతుండడంతో షెడ్లు మొత్తం ఖాళీ అవుతున్నాయి. ఇంకా వైరస్ సోకక.. మిగిలి ఉన్న ఫారాల్లో కోళ్ల పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. కొవిడ్ సమయంలో భారీగా నష్టపోయామని మళ్లీ ప్రస్తుతం అప్పటి పరిస్థితులు ఎదుర్కొంటున్నామని రైతులు చెబుతున్నారు. హ్యాచరీల యజమానులు కోళ్లను పెంచి నిర్ణీత బరువుకు చేరగానే.. కంపెనీలకు కిలోల లెక్కన అప్పగిస్తారు. ఒక్కో బ్యాచ్‌నూ సాధారణంగా 35 నుంచి 40 రోజులపాటు పెంచుతారు. శీతాకాలంలో మాత్రం 30 రోజుల వ్యవధిలోనే ఒక బ్యాచ్ కోళ్లు తయారవుతాయని యజమానులు చెబుతున్నారు. కానీ.. 20-23 రోజుల పోషణ తరువాత కోళ్లు చనిపోతున్నాయి. నవంబరు, డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి మాసాల్లో కోళ్లు తక్కువ సమయంలోనే నిర్ణీత బరువు పెరుగుతాయని.. తద్వారా లాభాలు రావాల్సిన ఈ తరుణంలో వైరస్ వల్ల పెద్ద మొత్తంలో నష్టాలు వస్తున్నాయని కోళ్లఫారాల యజమానులు వాపోతున్నారు.

ఆ మండలంలో..

సత్తుపల్లి నియోజకవర్గంలోని సత్తుపల్లి మండలంలో దాదాపు ప్రతి గ్రామంలోనూ కోళ్ల ఫారాలున్నాయి. వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాల్లో కూడా భారీగా కోళ్ల ఫారాలు ఉన్నాయి. కనీస స్థాయిలో అయిదు వేల కోళ్ల బ్యాచ్ షెడ్డు నుంచి గరిష్ఠంగా 40వేల బ్యాచ్ వరకూ షెడ్లు ఉన్నాయి. కొన్ని ఏసీ షెడ్లూ ఉన్నాయి. 40 వేల బ్యాచ్ కోళ్లు చనిపోతే ఒక్కో రైతుకూ సగటున రూ.7 లక్షల దాకా నష్టం వస్తుందని రైతులు చెబుతున్నారు. వైరస్ కారణంగా ఏదైనా షెడ్డులో కోళ్లు మొత్తం చనిపోతే కనీసం మూడు నెలలు ఆ షెడ్డులో మరొక బ్యాచ్ పిల్లలు వేసే అవకాశం ఉండదు. సత్తుపల్లి మండలం కాకర్లపల్లిలో ఒక రైతుకు చెందిన ఫారంలో నెల క్రితం 20వేల కోళ్లు చనిపోయాయి.


వైరస్‌తో ఫారంలో చనిపోయిన కోళ్లు

తుంబూరులో మరో రైతుకు చెందిన సుమారు పదివేల కోళ్లు చనిపోయినట్లు సమాచారం. ఈ మండలంలోని దాదాపు అన్ని ఫారాల్లోనూ వైరస్ కారణంగా కోళ్లు చనిపోయాయి. కల్లూరు మండలం పెద్దకోరుకొండిలో రెండు రోజుల వ్యవధిలో 3,500 కోళ్లు మృతి చెందాయి. తల్లాడ మండలం అన్నారుగూడెం, సర్వీంహారావుపేట గ్రామాల్లో 2,500 కోళ్లు చనిపోయాయి. చనిపోయిన కోళ్ల నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపినట్టు సత్తుపల్లి పశుసంవర్ధక శాఖ ఏడీ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కాగా, ఏపీలో లక్షలాది కోళ్లు వైరస్ కారణంగా చనిపోతున్నాయని, అక్కణ్నుంచే సరిహద్దుల్లో ఉన్న సత్తుపల్లి మండలంలోని కోళ్లకు ఆ వైరస్ సోకి ఉంటుందని పలు ఫారాల యజమానులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు, తాడేపల్లిగూడెం, భీమడోలు, ఉంగుటూరు, కొల్లేరు ప్రాంతాల్లోని ఫారాల్లో 1.3 కోట్ల కోళ్లు ఉండగా.. వాటిలో 20 లక్షల దాకా కోళ్లు వైరస్ కారణంగా చనిపోయినట్టు తెలుస్తోంది.

కామారెడ్డి జిల్లా బీర్కూర్‌లో కోళ్లకు కొక్కెర వ్యాధి!

3 రోజుల్లో 3,600కు పైగా కోళ్ల మృతి!

బీర్కూర్, ఫిబ్రవరి 4: కొక్కెర వ్యాధి కారణంగా.. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన బుజ్జముల భాస్కర్ అనే పౌల్ట్రీ రైతు ఫారంలో రెండు రోజుల వ్యవధిలో 3,600 కోళ్లు చనిపోయాయి. నాలుగైదు రోజుల్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న కోళ్లు ఒక్కసారిగా గిలగిల కొట్టుకుంటూ మృత్యువాత పడుతుండడంతో.. ఏదైనా వైరస్ సోకిందన్న అనుమానంతో ఆయన పశు వైద్యాధికారులకు సమాచారం అందించారు. వారు మంగళవారం అతడి కోళ్లఫారాన్ని పరిశీలించే సమయంలోనే.. మిగతా 400 కోళ్లలో కొన్ని గిలగిల కొట్టుకుంటూ ప్రాణాలు వదిలాయి! కోళ్ల మృతితో తనకు రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. అయితే.. ఆ ఫారంలో మృతిచెందిన 25 కోళ్లను పరీక్షించగా.. వాటికి కొక్కెరవ్యాధి సోకినట్టుగా తేలిందని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ జగన్నాథం తెలిపారు. ఆ ఒక్కచోట తప్ప జిల్లాలో మరెక్కడా కోళ్లు చనిపోలేదని ఆయన తెలిపారు. కొక్కెరవ్యాధికి సంబంధించిన మందులు వాడాల్సిందిగా ఫారం యజమాని భాస్కర్‌కు సూచించినట్టు చెప్పారు. అటు.. నెక్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు అశోక్ రెడ్డి కూడా జిల్లాలో కోళ్లకు ఎలాంటి వ్యాధులూ లేవని స్పష్టం చేశారు. ఎండలు పెరుగుతున్నందున జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పేస్‌మేకర్ రోగికి.. ఎంఆర్ఐ

- పరికరం ఉందన్నా స్కానింగ్‌కు పంపిన వైద్యులు
- వివరాలేమీ అడగకుండా స్కానింగ్ చేసిన సిబ్బంది
- మిషన్‌లోనే ప్రాణాలు విడిచిన మహిళ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆమెకు గుండె జబ్బు ఉంది. గతంలో ఆపరేషన్ చేసిన వైద్యులు పేస్‌మేకర్ కూడా అమర్చారు. ఇలాంటి రోగులకు ఎట్టిపరిస్థితుల్లోనూ ఎంఆర్ఐ స్కానింగ్ చేయకూడదు. కానీ.. ఈ వివరాలేమీ పట్టించుకోకుండా ఆమెకు ఎంఆర్ఐ స్కానింగ్ చేశారు. అంతే.. స్కాన్ తీస్తుండగా ఆమె ఆ మిషన్లోనే గిలగిలా కొట్టుకుంటూ భర్త కళ్లెదుటే ప్రాణాలు విడిచింది. వైద్యులు, స్కాన్ సెంటర్ సిబ్బంది నిర్లక్ష్యంతో నిండు ప్రాణం గాల్లో కలిసిపోయింది. ఈ ఘటన ఏపీలోని ఏలూరు నగరంలోని ఆర్ఆర్ పేటలో ఉన్న సుస్మిత డయాగ్నోస్టిక్ సెంటర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు రూరల్ మండలం ప్రత్తికోళ్ల లంక గ్రామానికి చెందిన నల్లగచ్చు రామతులసి (60)కి గుండె సమస్య రావడంతో గతంలో పేస్‌మేకర్ అమర్చారు. అయితే కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఆమెకు రెండు నెలల నుంచి ఏలూరులోని ఒక ఆస్పత్రిలో డయాలసిస్ చేయిస్తున్నారు. అక్కడి వైద్యులకు పేస్‌మేకర్‌ను అమర్చిన విషయాన్ని కూడా తెలియజేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉంది. అయితే తలనొప్పిగా ఉందని చెప్పడంతో వైద్యులు సుస్మిత డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఎంఆర్ఐ స్కాన్ తీయించుకురావాలని సూచించారు. మంగళవారం ఉదయం రామతులసి, ఆమె భర్త కోటేశ్వరరావు సుస్మిత డయాగ్నోస్టిక్ సెంటర్‌కు వెళ్లారు. స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు ఏమైనా ఆపరేషన్లు జరిగాయా, ఐరన్ రాడ్లు ఉన్నాయా, ఎలర్జీలు ఉన్నాయా వంటి వివరాలు తెలుసుకుని ఆపై స్కానింగ్ చేయాల్సి ఉంది. కానీ తనిఖీలేమీ చేయకుండా వెంటనే స్కానింగ్ విభాగంలోకి పంపించారు. అక్కడ ఆమె భర్త కోటేశ్వరరావును ఉంచారు. మిషన్‌లోకి వెళ్లిన క్షణాల్లోనే ఆమె కాళ్లు కొట్టుకుంటూ విలవిల్లాడింది. స్కానింగ్ సెంటర్ నిర్వాహకులకు తెలిపినా.. వాళ్లు ఏమీ కాదు కాళ్లు కదలకుండా పట్టుకోవాలని సూచించారు తప్ప ఒక్కరు కూడా మిషన్ వద్దకు రాలేదు. దీంతో భర్త కళ్లెదుటే ఆమె ప్రాణాలు విడిచింది. అయినప్పటికీ స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు ఆమె బతికే ఉందని, ఆస్పత్రికి తీసుకువెళ్లాలని అంబులెన్సు ఏర్పాటు చేశారు. అప్పటికే ఆమె మృతి చెందిన విషయం గ్రహించిన బంధువులు ఆస్పత్రికి వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్కాన్ సెంటర్ నిర్వాహకులపై పోలీసులు కేసునమోదు చేశారు. కాగా, డయాగ్నోస్టిక్ సెంటర్‌కు షోకాజు నోటీసు జారీ చేయనున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ అధికారిణి నాగరత్నం వెల్లడించారు.

వారంలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్!

- 'కేంద్రం స్పందించకున్నా ఇక్కడే నిర్ణయం' అంటూ బీసీ రిజర్వేషన్లపై సీఎం వ్యాఖ్యలతో జోరుగా ప్రచారం

హైదరాబాద్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల వేడి మొదలుకానుంది. తాజా పరిణామాల నేపథ్యంలో మరో వారం రోజుల్లోనే పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది. బీసీ గణన, జనాభా ఆధారంగా వారికి రిజర్వేషన్లు కల్పించే అంశంపై ప్రభుత్వం ఒక స్పష్టతకు వచ్చిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు ఎంతో సమయం పట్టదని సమాచారం. వేగంగా ఎన్నికల ప్రక్రియ చేపట్టాలని కాంగ్రెస్ సర్కారు భావిస్తోందని, అందుకు అనుగుణంగానే అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ, కులగణన సర్వే నివేదికను మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు అంశంపై ప్రసంగించిన ఆయన.. రాష్ట్రం చేస్తున్న ప్రతిపాదనపై కేంద్రం స్పందించకపోయినా తమ ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. అవసరమైతే పార్టీపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్నారు. అయితే ఆ తరువాత అసెంబ్లీ చేసిన తీర్మానంలో దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్రాన్ని కోరింది తప్ప.. రిజర్వేషన్లు 50 శాతానికి మించి పెంచుకునేలా చట్టం చేయాలని మాత్రం కోరలేదు. దీన్ని బట్టి పార్టీపరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే ఎన్నికలకు వెళతారని తెలుస్తోంది. సీఎం వ్యాఖ్యల దృష్ట్యా ప్రభుత్వం రిజర్వేషన్ల ఖరారుపై ఓ నిర్ణయం తీసుకుంటుందని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశం నిర్వహించడం.. కులగణన, అన్ని వర్గాల జనాభావంటి వివరాలు వెల్లడించిన నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలు చేపట్టడం ఖాయమని గ్రామీణ ప్రాంతాల్లోని ఆశావహులు అభిప్రాయపడుతున్నారు. అయితే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల అమలుకు విధి విధానాలు రూపొందించడం, ఎన్నికలు ఎప్పుడు చేపట్టాలన్న అంశంపై నిర్ణయానికొచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ జారీ చేయాల్సి ఉంటుంది. దీని ఆధారంగానే రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతుంది. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు క్షేత్రస్థాయిలో ఎస్ఈసీ తగిన ఏర్పాట్లు చేసుకుంది. ఇదిలా ఉండగా, ముందుగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరుగుతాయని, ఆ తర్వాతే సర్పంచ్ ఎన్నికలు చేపట్టే అవకాశం ఉందని సమాచారం. కాగా, పంచాయతీరాజ్ సాధారణ ఎన్నికల నిర్వహణలో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు ఎస్ఈసీ సిద్ధమవుతోంది. ఈ సిబ్బందికి ట్రైనర్లు శిక్షణ ఇస్తారు. ఈ ట్రైనర్లకు బుధవారం హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్ఈసీ తెలిపింది. జిల్లాకు 10 మంది చొప్పున పంపాలని కలెక్టర్లను కోరింది.

తీన్మార్ మల్లన్న తీరుపై టీపీసీసీ ఆగ్రహం

- షోకాజ్ నోటీసు జారీకి రంగం సిద్ధం
- ఫిర్యాదులు చేసిన పలువురు పార్టీ నేతలు
- పరిశీలిస్తున్న క్రమశిక్షణ చర్యల కమిటీ
- రెండు రోజుల్లో షోకాజ్ నోటీసు జారీ
- బీసీ మీటింగ్ పెట్టి ఇతర కులాలను తిట్టడం ఏంటి?: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కులగణన సర్వేలో బీసీ జనాభా లెక్కల విషయంలోను, వివిధ వేదికలపై నుంచి పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్) చేస్తున్న ప్రకటనలపైన టీపీసీసీ నాయకత్వం ఆగ్రహంతో ఉంది. ఆయనపైన క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తోంది. వాస్తవానికి కాంగ్రెస్ టికెట్‌పైన ఎమ్మెల్సీగా ఎన్నికైన తీన్మార్ మల్లన్న.. కొద్దినెలలుగా వివిధ అంశాలపైన పార్టీ విధానాలకు విరుద్ధంగా స్పందిస్తూ వస్తున్నారు. అయినా ఆయన విషయంలో చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తూ వస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్.. తాజాగా ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేకు వ్యతిరేకంగానూ తీన్మార్ మల్లన్న మాట్లాడటం పట్ల సీరియస్ అయ్యారు. ఇటీవల బీసీలకు సంబంధించిన ఓ సభలో పాల్గొన్న తీన్మార్ మల్లన్న.. ఓ అగ్ర కులంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాజాగా కులగణన సర్వే నివేదికను తప్పుపడుతూ నిరసనగా ప్రతిని కాల్చివేశారు. తీన్మార్ మల్లన్న తీరుపైన పార్టీ నేతల్లోనూ ఆగ్రహం వ్యక్తమవుతోంది. పలువురు నాయకులు ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదులూ చేశారు. తీన్మార్ మల్లన్న ప్రకటనల పట్ల ఆగ్రహంగా ఉన్న మహేశ్‌కుమార్‌గౌడ్.. ఆయనపై చర్యలకు ఉపక్రమించారు. మల్లన్నపైన వచ్చిన ఫిర్యాదులపైన ఒకటి రెండు రోజుల్లో క్రమశిక్షణ చర్యల కమిటీ భేటీ అయి.. ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేయనున్నట్లు సమాచారం. మరోవైపు..తీన్మార్ మల్లన్న తనను తిడితే స్వాగతిస్తానని, కానీ.. ఓ కులాన్ని తిట్టడం సరికాదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గెలుపు ఓటములను ప్రజలు నిర్ణయిస్తారని, వ్యక్తులు కాదన్నారు. కాంగ్రెస్ బీ ఫామ్‌పైన గెలిచిన మల్లన్న తమపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అసెంబ్లీ లాబీల్లో మంగళవారం మీడియాతో చిట్ చాట్‌గా ఆయన మాట్లాడారు. తీన్మార్ మల్లన్నకు ఇతర కులాలను తిట్టే హక్కు లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆయన పార్టీ లైన్‌కు వ్యతిరేకంగా మాట్లాడటం సరైంది కాదని పేర్కొన్నారు. ఇష్టం లేకుంటే పార్టీ నుంచి వెళ్లిపోవచ్చునన్నారు. తీన్మార్ మల్లన్న గెలుపుకోసం తనతో పాటుగా తన కుటుంబం మొత్తం పని చేసిందని వెల్లడించారు. ఆనాడు తాము రెడ్డిలం అని ఆయనకు గుర్తు లేదా అని ప్రశ్నించారు. అసెంబ్లీ లాబీల్లో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు.



రెండు గ్రామాలతోనే మండల పరిషత్

- రాష్ట్రంలోనే అతి చిన్న మండల పరిషత్‌గా అమీన్‌పూర్

పటాన్‌చెరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అతి చిన్న మండల పరిషత్‌గా అమీన్‌పూర్ నిలవనుంది. కేవలం రెండు గ్రామ పంచాయతీలతో మండల పరిషత్‌ను ఏర్పాటు చేయడంతో ఈ రికార్డును దక్కించుకోనుంది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలో ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న 6 గ్రామాలను ఇటీవల అమీన్‌పూర్ మునిసిపాలిటీలో విలీనం చేశారు. దీంతో వడక్‌పల్లి, జానకంపేట గ్రామపంచాయతీలుగా మిగిలిపోయాయి. ఈ రెండు పంచాయతీలను ఐదు ఎంపీటీసీ స్థానాలుగా విభజించి మండల పరిషత్‌గా ఏర్పాటు చేశారు. వడక్‌పల్లిలో ఏడువందల జనాభాకు గాను 3 ఎంపీటీసీ స్థానాలు, జానకంపేటలో ఆరు వందల జనాభాకు గాను 2 ఎంపీటీసీ స్థానాలను ఏర్పాటు చేశారు. ఒక ఎంపీటీసీ కింద కనీసం 3-5వేల జనాభా ఉండాలన్న నిబంధన ఉంది. కానీ, అధికారులు మొత్తం 1,105ఓట్లకు గాను రెండు గ్రామాల్లో 5 ఎంపీటీసీలను ఏర్పాటు చేశారు. మండల పరిషత్ ఏర్పాటుకు కనీసం 5 ఎంపీటీసీ స్థానాలు ఉండాలన్న నిబంధన ప్రకారం ఈ విభజన జరిగినట్లు చెప్తున్న అధికారులు, జనాభా, ఓట్లను ఇందుకు ప్రాతిపదికగా తీసుకోలేదని అంటున్నారు. అయితే.. తమను కూడా మునిసిపాలిటీలో విలీనం చేయాలని ఆ రెండు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రెండు గ్రామాల ప్రజలు, అన్ని పార్టీల నాయకులు త్వరలోనే సీఎం రేవంత్‌ను కలిసి ఆ గ్రామాలను అమీన్‌పూర్ మునిసిపాలిటీలో విలీనం చేయాలని కోరతామని అమీన్‌పూర్ మాజీ జడ్పీటీసీ సభ్యుడు గంగుల సుధాకర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

సీపీఎస్ సంఘం తరఫున ఇన్నారెడ్డి నామినేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్- మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఎస్ సంఘం తరఫున పోటీ చేస్తున్న తిరుమల రెడ్డి ఇన్నారెడ్డి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎస్ అధ్యక్షుడు స్థితప్రజ్ఞ మాట్లాడుతూ, ఫిబ్రవరి 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఎస్ సంఘం బలపరిచిన అభ్యర్థిని గెలిపించి, ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న ఏకీకృత పింఛను పథకాన్ని (యూపీఎస్) అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ బరిలో ఉన్న ఇన్నారెడ్డి ఉపాధ్యాయ సమస్యల కోసం పని చేశారని, ఈ విషయాన్ని ఉపాధ్యాయులు గుర్తించాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఇన్నారెడ్డి మాట్లాడుతూ, 37 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేశానని, ఉపాధ్యాయుల కష్టం తెలిసిన వ్యక్తిగా ఈ ఎన్నికల్లో తనకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

బీసీలను నమ్మించి నట్టేట ముంచిన కాంగ్రెస్

- బీసీ కులాల జనాభాను 21 లక్షలు తగ్గించారు
- కుల గణన సర్వే రిపోర్టును తిరస్కరిస్తున్నాం
- భవిష్యత్ కార్యాచరణను రేపు ప్రకటిస్తాం: జాజుల శ్రీనివాస్
- ఉద్దేశపూర్వకంగానే బీసీల జనాభాను తగ్గించారు: వద్దిరాజు

బేగంపేట/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను నమ్మించి నట్టేట ముంచిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. బీసీల జనాభాను 21 లక్షలు తగ్గించి వారిని సమాధి చేశారని వ్యాఖ్యానించారు. బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బీసీల అత్యవసర సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో వందకు పైగా బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు. కులగణన నివేదికను తిరస్కరిస్తున్నామని వారంతా ఏకగ్రీవంగా తీర్మానించారు. నివేదిక ప్రతులను చించి చెత్త బుట్టలో వేశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఈ నెల 6న(గురువారం) హైదరాబాద్‌లో అన్ని బీసీ కుల సంఘాలు, మేధావులు, ఉద్యమకారులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈ నెల చివరి వారంలో హైదరాబాద్‌లో లక్షలాది మంది బీసీలతో సమర శంఖారావ మహాసభను నిర్వహించడంతో పాటు మార్చి మొదటి వారంలో తెలంగాణ అంతటా బస్సుయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. తమిళనాడులో లాగా బీసీలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలన్నారు. బీసీల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. బీసీ మేధావుల ఫోరం చైర్మన్ చిరంజీవులు, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ గణేశ్‌చారి, కన్వీనర్ బాలరాజ్‌గౌడ్, బీసీ కమీషన్ మాజీ చైర్మన్ కృష్ణమోహన్‌రావు తదితరులు మాట్లాడుతూ.. కులగణన సర్వే తప్పుల తడక అన్నారు. తెలంగాణలో కులగణన సర్వే కాకి లెక్కలతో అశాస్త్రీయంగా ఉందని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. బీసీ జనాభాను ఉద్దేశ పూర్వకంగానే తగ్గించి చూపించారని మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేసే ఉద్దేశం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని కుల గణన నివేదికను చూస్తేనే అర్థమవుతోందన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.